సాహిత్య

# ప్రస్థానం

అక్టోబర్ 2018

వెల రూ. 20



సాహితీస్రవంతి



జానీ మిల్లర్ అనే అమెరికన్ 'అసమానతల దృశ్యాలు' పేరుతో ఒక ప్రాజెక్ట్ చేపట్టాడు. అమెరికా, ఇండియా, దక్షిణాఫ్రికా, కెన్యా, టాంజానియా, మెక్సికో దేశాలలో తన డ్రోన్ కెమెరాను ఉపయోగించి కొన్ని చిత్రాలు తీశాడు. ప్రపంచ వ్యాప్తంగా ధనిక, పేద తేడాలకు అద్దం పట్టే చిత్రాలను తీసి ప్రచారం చేయడమే తన లక్ష్యంగా కృషి చేస్తున్నాడు. ఈ చిత్రం మనదేశంలోని ముంబయి నగరంలో ఒక దృశ్యం. ఆకాశాన్నంటే ఎత్తైన భవంతుల పక్కనే మురికివాడల దృశ్యాలు.

సాహిత్య ప్రస్థానం
అక్టోబర్ 2018

సంపుటి : 17 | సంపాదకీయం | సంచిక : 10

# రాజకీయ సామాజిక సంచలనాలు

తెలుగు రాష్ట్రాలలో రాజకీయంగా సామాజికంగా అనేక సంచలనాత్మక పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇందులో ఆందోళనకరమైనవీ ఆసక్తికరమైనవీ కూడా వున్నాయి. రచయితలూ, కవులూ, సాహిత్య జీవులంతా స్పందించాల్సిన అంశాలివి. తెలంగాణ అధినేత కెసిఆర్ శాసనసభను తొమ్మిది మాసాలు ముందే రద్దు చేశారు. నవంబరులో ఎన్నికలు జరిగి డిసెంబరులోగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని భావిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ప్రతివారికీ సంబంధించినవి. పైగా అనేక ఉద్యమాలతో, రాజకీయ మలుపులతో ఏర్పడిన తెలంగాణ తొలి ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికలకు ముందే తనను తాను రద్దు చేసుకుని విడివిడిగా ఎన్నికలకు వెళ్లడంపై అనేక రకాల వ్యాఖ్యానాలు వచ్చాయి. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి తామే తిరిగి వస్తామని చెబుతుంటే ప్రతిపక్షాలు ఆయన ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా ఓటమి తప్పదని చెబుతున్నాయి. అంతిమ తీర్పరులు ప్రజలే. ఈ సమయంలోనే ధర్నాచౌక్‌ను పునరుద్దరిస్తూ హైకోర్టు తీర్పు నివ్వడం విశేషం. ఎవరైనా సరే ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలన్న సందేశం ఇందులో వుంది.

మిర్యాలగూడలో తనకూతురిని కులాంతర వివాహం చేసుకున్న నేరానికి ప్రణయ్ అనే యువకుడిని– అంటే అల్లుడినే– మారుతీరావు అనే కోటీశ్వరుడు కిరాయి హంతకులతో హత్య చేయించడం అందరినీ దిగ్భ్రాంత పరచింది. అదే సమయంలో హైదరాబాదులో మనోహరాచారి అనే ప్రైవేటు ఉద్యోగి ఇలాటి కారణాలతోనే కూతురుపై కత్తితో దాడి చేసి ప్రాణాంతకంగా గాయపర్చారు. ప్రకాశం జిల్లాలో ఇలాగే కులాంతర వివాహం చేసుకున్న జంటపై బాబాయి వరసయ్యే వ్యక్తి తీవ్రంగా బెదిరించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. తర్వాత మరిన్ని ఘటనలు బయటకు వచ్చాయి. వీటిపై వివరమైన వ్యాసం లోపల వుంది గాని సాహిత్య జీవులుగా వీటిని తీవ్రంగా ఖండించాల్సిన బాధ్యత ప్రతివారిపై వుంది.

ఇక విశాఖజిల్లా అరకు ఎంఎల్ఏ కిడారి సర్వేశ్వరరావును, మాజీ ఎంఎల్ఏ సోమాను మావోయిస్టులు హతమార్చడం మరో ఘాతుకం. బాక్సయిట్ తవ్వకానికి వత్తాసునిస్తున్న కారణంగా చంపామంటున్నారు గాని వ్యక్తులను చంపడం సమస్యలకు పరిష్కారం కాదని స్పష్టం చేయాల్సి వుంది. గత నెలలోనే మావోయిస్టు సానుభూతిపరులనే పేరుతో కొందరు రచయితల అరెస్టులు కేసులను ప్రజాస్వామికవాదులుగా ఖండించాం. బూటకపు ఎన్‌కౌంటర్లను కూడా నిరంతరం వ్యతిరేకిస్తున్నాం. కాని మరోవైపున మావోయిస్టులు చేసే ఇలాటి చర్యలు ఆ ప్రజాస్వామిక వాదులు హర్షించలేనివి. ప్రజలను కదిలించి ఉద్యమాలు నిర్మించడం ద్వారా తప్ప పథకం ప్రకారం కొందరిని మట్టుపెట్టినంత మాత్రాన సమస్యలు మటుమాయం కావు. పైగా దీని ప్రభావంతో గిరిజనులపై నిర్బంధం పెరుగుతుంది. మావోయిస్టులు ఈ విధానాన్ని సమీక్షించుకోవడం అవసరం.

శత వత్సరాల అభ్యుదయ స్త్రీ మూర్తి కొండపల్లి కోటేశ్వరమ్మకు ప్రస్థానం అక్షర నివాళి. ♦

♦
సంపాదకవర్గం:
**తెలకపల్లి రవి** ప్రధాన సంపాదకుడు
**వొరప్రసాద్** వర్కింగ్ ఎడిటర్
**కె. సత్యరంజన్** ♦ **చీకటి దివాకర్**
**గనారా** ♦ **శమంతకమణి**
**కెంగార మోహన్**
**కె.లక్ష్మయ్య,** మేనేజర్

బొమ్మలు: **తుంబలి శివాజి**
**గంగాధర్ వీర్ల**
**చిదంబరం**

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
**సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059**
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, www.prasthanam.com

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి! తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!
**1 సంవత్సర చందా రూ. 240/- ♦ 5 సంవత్సరాల చందా రూ.1000/ ♦ 10 సంవత్సరాల చందా రూ. 2000/-**
Bank Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada
A/c No. 52001500585, IFSC: SBIN0020343
చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

## ఈ సంచికలో ... సాహిత్య ప్రస్థానం అక్టోబర్ 2018

### కథలు


**చెదిరే స్వప్నం** – డా॥ వి.ఆర్. రాసాని.................. 5
**సంఘాల పంతులు** – సురవరం ప్రతాపరెడ్డి........... 21
**నీలిమ** – డా॥ ఎం. ప్రగతి................................ 36
**సంకల్పం** – పుష్పాల సూర్యకుమారి..................... 52
**ఆ ఒక్క క్షణం** – మహీధర శేషారత్నం.................. 60


### కవితలు


**మొగ్గలు** – డా॥ భీంపల్లి శ్రీకాంత్....................... 4
**మొఖం చాటేసిన మేఘం** – జానూ సురేష్............ 12
**తన వాంగ్మూలం** – దారల విజయకుమారి............ 15
**ప్రెస్‌క్లబ్, అనంతపురం** – ఈడుగ రాఘవేంద్ర........ 20
**దండె కడియం** – తగుళ్ళ గోపాల్....................... 24
**అల్జీమర్స్** – షేక్ అహమద్ భాష........................ 28
**మనం** – రవి నన్నపనేని................................ 28
**సంతాపం** – పొగడదొరువు.............................. 35
**ప్రేమ'కులం'** – వారణాసి భానుమూర్తి................. 35
**అక్షరాంజలి** – నీలం వెంకటేశ్వర్లు...................... 40
**పొలంలో అమ్మా..నాన్నా.**– ఆది ఆంధ్ర తిప్పేస్వామి. 40
**అసుంటసుంట** – రతన్‌రాజు బందిలి.................. 46
**భూమిని శపిస్తూ ఆకాశం**–అడిగోపుల వెంకటరత్నమ్ 48
**తీయని చెమట**– జాకీర్.................................. 59


### వ్యాసాలు


**సాహిత్య ప్రస్థానం సెప్టెంబర్ నెల పురస్కారాలు** ...... 12
**హే మొహబ్బత్ జిందాబాద్** – తెలకపల్లి రవి........... 13
**అధికారం, ఆప్యాయతల మధ్య నలిగిన ఆమ్రపాలి**
– దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు................. 16
**సమాజ పరివర్తన కోరే కవి బంగారురాజు కంఠ**
– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి................... 25
**యుగపురుషుడు** – నార్ల వెంకటేశ్వర రావు............ 29
**గిరిజన జీవితాలలోని దోపిడీని ప్రశ్నించిన కథలు**
– మందరపు హైమవతి........................... 41
**ప్రకృతి... విధ్వంసం... చరిత్ర...**
– సుంకర గోపాలయ్య............................ 47
**వర్తమాన సామాజిక కవితా చిత్రం**
– వొరప్రసాద్...................................... 49
**రాయలసీమ నవలల్లో సంఘసంస్కరణ**
– ఇ. తిరుపతి..................... 57
**స్వీకారం**.................................................64
**డైరీ** ..........................................................65


### కవిత

## మొగ్గలు


**- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్**
*9032844017*


*బుద్ధి అజ్ఞానాంధకారాన్ని నశింపజేస్తూనే*
*మనిషిలో మంచిగుణాలను మొలకెత్తిస్తుంది*
*మనిషికి మంచి తెలివితేటలే సుగుణాలు*

*మనిషి మితభాషియై ఆచితూచి మాట్లాడితేనే*
*సమున్నత గౌరవం పరిమళంలా శోభిస్తుంది*
*మంచిమాటలే మనిషికి వాసంతసమీరాలు*

*నీతి, నిజాయితీలను ఆభరణాలుగా ధరిస్తేనే*
*లోకంలో గౌరవమర్యాదలు శోభిల్లేలా చేస్తాయి*
*న్యాయంగా జీవిస్తేనే మనిషికి ఎనలేని విలువ*

*సత్యశీలసంపదలు మనిషికి గీటురాళ్ళవుతేనే*
*మానవతామూర్తిగా మహిలో వెలుగొందుతాడు*
*మహోన్నత వ్యక్తిత్వమే మనిషికి అసలైన సంపద*

*మంచి నడవడికలతో జీవనపయనం సాగిస్తేనే*
*శుభప్రదమైన శాంతియుతజీవితం అలవడుతుంది*
*మంచి వ్యక్తిత్వమే మనిషికి నిజమైన ఆభరణం*



♦



# చెదిరే స్వప్నం

డా॥ వి.ఆర్.రాసాని - 9848443610

రాజమండ్రి నుంచి కార్లో పట్టిసీమకు వెళ్లి అక్కడ ఉదయం ఎనిమిదికంతా లాంచ్‌లో ఎక్కాం. లాంచి తొమ్మిదికి కదిలింది. కిలో మీటర్ వెడల్పున్న గోదావరీ నదీ ప్రవాహం పైన లాంచి మెల్లగా ముందుకుపోతోంది. నది రెండు వడ్డులు పచ్చటి తివాచీ పరచుకున్నట్లుంది. ఆ తివాచీని ఆ ప్రాంతంలో కనిపిస్తున్న కొండలకు దుప్పటిలా కప్పినట్లు పచ్చదనం నయనానందకంగా ఉంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే నంది నాటక పోటీలకు స్క్రూటినీ జడ్జిలుగా వున్న ముగ్గురిలో నేనూ ఒకన్ని. ఒక నెలపాటు తెలంగాణా, ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాలలో తిరిగి ఎన్నిక చేసిన నాటకాలే రాజమండ్రిలో జరుగుతున్న నంది నాటకోత్సవాలలో ప్రదర్శింపబడుతున్నాయి. ఎన్.ఎఫ్.టి.వి.డి.సీ కమిషనర్ పార్థసారథి గారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు బ్రహ్మాండంగా జరగుతున్నాయి.

అవి పదిరోజులు జరుగుతాయి. చివరిరోజు మాకూ స్వర్ణనందితో సన్మానం వుంటుంది. సైట్‌సీయింగ్ కోసమే ఆ రోజు ఏపి టూరిజం వారి ప్యాకేజీలో ఒక రోజు ప్రోగ్రాం. మూడు టికెట్లు తీసుకుని నా శ్రీమతి డాక్టర్ ఉమాదేవినీ, నా కుమారుడు పదునాలుగేండ్ల చిన్నాతో లాంచిలో కూర్చున్నాను. లాంచీ నిండా జనమే. మా ప్రక్కసీట్లో చిన్నా వయసున్న ఒక తెల్లటి అందమైన అబ్బాయితో మా చిన్నా అప్పుడే స్నేహం కలుపుకొని మాట్లాడుతున్నాడు.

బోటు సర్రున ముందుకు పోతోంది. గట్టుపైనుంచి వస్తున్న గాలి చల్లగా మా శరీరాలను తాకుతోంది. ఇంతలో వున్నట్టుండి లాంచి అటుఇటు ఊగింది. అందరూ ఒక్కసారి ఉలిక్కి పడి 'గోవిందా!' అన్నారు.

'ఏం కాదు, భయపడకండి. ఇవన్నీ మామూలే" అన్నాడు బోటును నడుపుతున్న సరంగు.

గోదావరి ఉధృతి కాస్తా పెరిగింది.

మా అందరిలో కాస్త భయం చోటుచేసుకుంటోంది.

"యేటయిందే గోదారమ్మా.. ఎందుకే గగురుపాటు
ఎందుకే ఈ ఉలికిపాట

సల్లంగ సూడే గోదారితల్లీ
అమ్మలా సూడే గోదారి తల్లీ.. ఎందుకే ఉలికిపాటు"

చేతులెత్తి గోదారికి దండం పెడుతూ సరంగు పాటపాడుతున్నాడు. అతని పాట విని కాబోలు గోదావరి ఉధృతి తగ్గిపోయింది. కొంతదూరం ఊగుతూ పోయిన లాంచి నెమ్మదిగా ముందుకు సాగింది. గోదావరి జలం నిశ్చలంగా కనిపించ సాగింది. అందరి మనసులు కుదుట పడ్డాయి.

చిన్నా ఆ అబ్బాయితో మాట్లాడుతూనే ఉన్నాడు. ఆ అబ్బాయి అందంగా, తెల్లగా వున్నా అతని చూపులు. కొంచెం అసాధారణగా కనిపిస్తున్నాయి. అతని చేష్టలు కూడా కాస్త చిన్నపిల్లల చేష్టల్లా కనిపిస్తున్నాయి. పట్టిసీమదగ్గర లాంచి ఎక్కేముందు, చిన్నపడవల్లో ఎక్కి అక్కడికి కొంతదూరంలో వున్న ఒక ప్రాచీన దేవాలయాన్ని చూసి వచ్చాము. ఆ గుడి దగ్గరే ఆ అబ్బాయి చిన్నాకు పరిచయమైనాడు.

ఆ లాంచీలోనే మాకు టిఫెన్లు.

ప్రతి ప్లేట్లోనూ మూడు ఇడ్లీలు, ఒక వడ చొప్పున ఒక్కొక్కరికీ ఒక్కో కాగితపు ప్లేట్లో పెట్టిచ్చాడు. మా ఆవిడ మా చిన్నోడికి టిఫిన్ తినిపిస్తోంది. అదే సమయంలో.. "నువ్వూ అలాగే పెట్టు తింటా. లేకుంటే తిననుపో' అంటూ చిన్నాని చూపిస్తూ బుంగమూతి పెట్టుకొన్నాడు ఆ అబ్బాయి.

"అలాగేలే నాన్నా.. ఇదుగో.. తిను" అంటూ ఇడ్లీ ముక్కల్ని చట్నీలో అద్ది గోముగా తినిపిస్తోంది అతని తల్లి.

ఆమె తెల్లగా అందంగానే వుంది. ఆమెకు సరిజోడులా చక్కగా వున్న ఆమె భర్త కొడుకును మురిపెంగా చూస్తున్నాడు.

రెండు ముక్కలు తిన్న తరువాత ఆ పిల్లవాడు కుర్చీలోనుంచి పైకిలేచి మా ఆవిడవైపే చూస్తూ దగ్గరికి వచ్చి 'మమ్మీ! మమ్మీ! నాకూ.." అంటూ నోరు తెరిచాడు. మా ఆవిడ ఒక్క క్షణం ఆశ్చర్యపోయింది.

"నవీన్ ఆగరా.. " అతని తల్లిదండ్రులు దగ్గరికి వచ్చి 'సారీ మేడం.. మా వాడు.. కొంచెం అన్‌మెచ్యూర్డ్‌మైండ్. ఏమీ అనుకోకండి" అన్నారు.

దానికేముందిలెండి. ఫర్వాలేదు. అని ఒక ఇడ్లీ ముక్కను చట్నీలో అద్ది అతని నోటికందించింది.

అతను ఆనందంగా చప్పట్లు తిడుతూ తినసాగాడు.

మా చిన్నోడు నవ్వుతూ 'నీపేరేమిటి? ' అని అడిగాడు.

'నాపేరూ.. నా పేరూ..' అంటూ తల్లి వైపు చూశాడతను.

"నవీన్!" అంది ఆమె.

"ఆ.. నవీన్" అన్నాడతను.

క్షణాల్లో వాళ్లిద్దరూ కలిసిపోయారు.

గోదావరి నిర్మలంగా ప్రవహిస్తానే వుంది. ఇరుగట్లపైనుంచీ వీస్తున్న గాలి మరింత హాయిని గొలుపుతోంది. ఆకాశంలో తెల్ల కొంగలగుంపు ఒకే వరుసలో నిలబడి రన్నింగ్‌రేస్ చేస్తున్నట్లు.. సొంపుగా పోతున్నాయి.

వాటిని చూసి నవీన్ 'హాయ్.. కొంగలు.. కొంగలు' అంటూ చప్పట్లు తడుతూ ఆకాశంలోకి చూస్తున్నాడు.

మా చిన్నోడూ "అవును కొంగలు" అంటూ వాటినే చూస్తున్నాడు.

నవీన్ చేతులు పైకెత్తి, చేతివ్రేళ్ళు చక్కగా చాచి "కొంగా కొంగా పూలుపొయ్.. కొంగా.. కొంగా పూలుపొయ్" అంటూ చేతులు తిప్పసాగాడు. లాంచిలో అందరూ అతనివైపే చూస్తున్నారు.

"కొంగలెక్కడైనా పూలు పూస్తాయా?" అడిగాడు చిన్నా.

"అవును పూస్తాయి. మావూర్లో పిల్లలందరూ కొంగను చూస్తేచాలు ఇలాగే అనేవారు తెలుసా?" అన్నాడు నవీన్.

నవీన్ తల్లిదండ్రులు సంతోషంగా చూస్తున్నారు. లాంచిలో వున్న మిగిలిన వారంతా కనిపిస్తున్న కొండల అందాలను చూస్తున్నారు.

గోదావరి గజగమనలా గమిస్తోంది.

అటువైపు ఇటువైపు ఎత్తయిన కొండలు. ఆ కొండల మధ్యన మెలికలు తిరిగిన పాములా నది.. సుతారంగా వీస్తున్న గాలి.. ఆ గాలిలో తేలిపోతున్న మనసు.

"పోలవరం ప్రాజెక్ట్ కట్టడం పూర్తయితే ఈ పాపికొండల అందాలన్నీ నీట మునుగుతాయి. ఈ కొండల్లో, కోనల్లో జీవించే ఎన్నో గిరిజన గూడేలు నీటిపాలవుతాయి. ఎందరో అడవిబిడ్డల బతుకులు.. దారీతెన్నూ తెలియని అయోమయంలో పడిపోయి.. చెట్టుకొకరు, పుట్టకొకరుగా మారిపోతారు. ప్రాజెక్టు పూర్తయితే వీటిని చూసే అవకాశంవుండదనీ.. ప్రకృతి ప్రేమికులు సందర్శనాసక్తితో ఇక్కడికి .. మాలాగే... ఎందరో వస్తున్నారు.. పోతున్నారు.."

మాకంటే కొంతదూరం ముందు.. సాగిపోతున్న మరోలాంచిని చూస్తూ ఆలోచనల్లో పడిపోయాను. ఇంతలో "హలోఫ్రెండ్స్.." అంటూ సరంగు వెనకవున్న ఖాళీ ప్లేస్‌లోకి వచ్చిన ఒక వ్యక్తి అనడంతో గాలిలో విహరిస్తున్న నా మనసు

మళ్ళీ లాంచిలోకి వచ్చి పడ్డది. అతనే గైడ్. ఆ గైడ్ ఆ ప్రాంతాలను పరిచయం చేస్తూ చెప్పుకుపోతున్నాడు.

"ఇది కొయ్యూరు, దీన్ని దాటితే పేరంటాలపల్లి.. ఆ మీరు కానీండి.. " అంటూ పక్కనున్నోళ్ళకు కనుసైగ చేశాడతను.

తమకు టిఫెన్ వడ్డించిన వారిలో ఒక అమ్మాయి, ఒక అబ్బాయి వేషాలు మార్చుకొని మేకప్‌లో వున్నారు. వాళ్ళు ఎప్పుడు మేకప్ చేసుకున్నారో, ఎక్కడ చేసుకున్నారో మాకు తెలీదు. అంతవరకూ మాట్లాడిన వ్యక్తి తప్పుకున్నాడు. వాళ్ళు నృత్యభంగిమల్లో నిలబడ్డారు. టేప్‌రికార్డర్‌లో పాట...

'బంగారు కోడి పెట్టా.."

దానికనుగుణంగా కళాకారుల డాన్స్.

వారి నృత్యం చూసి కొందరు క్లాప్స్ కొట్టారు. వారి ఉత్సాహం రెట్టింపయింది.

అందరూ వారి డాన్స్ చూడడంలో లీనమైపోయారు. కానీ చిన్నోడు, నవీన్ మాత్రం దాంతో సంబంధం లేనట్లు ఏవేవో మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు. నవీన్ తల్లిదండ్రులు డాన్స్ చూస్తూనే వాళ్ళను గమనిస్తున్నారు.

"వొరే! నీపేరేంటి?" కళ్ళు పెద్దవి చేసి అడిగాడు నవీన్.

"చిన్నా" చెప్పాడు చిన్నోడు.

"ఏవూరు.. మీ.. మీది?" పిచ్చిచూపులు చూస్తూ అడిగాడు.

"మాది తిరుపతి. మీదీ?" అడిగాడు చిన్నోడు.

"మాది.. మా.. దీ.." ఒక్కక్షణం ఆగి, గుర్తుకు తెచ్చుకున్నోడిలా "ఆ.. బళ్ళారి.." అన్నాడు.

"ఎక్కడిది?"

"కర్నాటక ... అనంత.. పురంకు.. అవతల..."

"సరే. నీకు ఈతొచ్చా" అడిగాడు చిన్నోడు.

బుంగమూతి పెట్టి చేతివేళ్ళు నలుపుకుంటూ "రాదు.. మరి.. నీకూ?" అడిగాడు నవీన్.

"నాకు వచ్చు.." అని చిన్నోడు వాన్ని ఉడిగించాలని" ఇప్పుడు ఈ పడవకు ప్రమాదం జరిగి నదిలో మునిగిపోతే.. ఏం చేస్తావ్?" అన్నాడు.

"సచ్చిపోతాం.. అంతే.. " సీరియస్ అయిపోయాడు నవీన్.

పాట అయిపోయింది. గైడ్ మళ్ళీ ముందుకొచ్చి చెప్పడం ప్రారంభించాడు.

"అదిగో.. కుడిపక్కన గట్టుపైన కనిపిస్తున్న పల్లెకు ఒక చరిత్ర వుంది. ఏమంటే.. మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆంగ్లేయులపైన తిరగబడి.. మొట్టమొదట ఆ పల్లెలో వున్న పోలీస్ స్టేషన్‌పైన దాడిచేసి, పోలీసుల్ని కొట్టి తుపాకులు ఎత్తుకుపోయాడు..'

అతను ఇంకా ఏదో చెబుతూనే వున్నాడు. బోటు వేగం తగ్గించుకొని మెల్లగా ఆ పల్లెవున్న గట్టువరకు పోతోంది. గోదావరి నిశ్చలంగా గోగమనం చేస్తోంది. బోటు గట్టువారగా వెళ్లి ఒకచోట ఆగింది. ఆ గట్టు.. ప్రకృతి మాత నారు పోసిన చెట్ల కుప్పలా వుంది. ఆ కుప్పలో మధ్య కొన్ని పాత ఇండ్లు కనిపిస్తున్నాయి. ఆ యిండ్ల దగ్గర నుంచీ ఒక సన్నని కాలిదారి గట్టుకింద వరకు ఏటవాలుగా సాగి, లాంచి ఆగిన ప్రదేశంలో.. అంతమైంది. నీటి అంచును తాకుతున్న ఆ దారికీ, దానికి నేరుగా ఆగివున్న లాంచిని కలుపుతూ యిద్దరు రెండు చెక్కలు వేశారు. అప్పటికే అక్కడికే చేర్చివున్న ఒక పెద్ద డాక్సా, మరికొన్ని పాత్రలు ఇద్దరు వ్యక్తులు ఎత్తి లాంచిలోకి చేర్చేశారు. లాంచి మళ్లీ కదిలింది. గైడ్ చెప్పాడు. "ఇప్పుడే మధ్యాహ్న భోజనం లాంచిలో చేర్చబడింది. పేరంటాల పల్లెదగ్గర లంచ్. అంతవరకూ మా కళాకారులు తమ నృత్యకళతో మిమ్మల్ని ఆనందింపచేస్తారు. ప్లీజ్! యుకెన్ ఎంజాయ్!" అతను పక్కకు తప్పకున్నాడు.

లాంచి మందగమనంతో ముందుకు సాగిపోతోంది.

కొన్ని గూడబాతులు తమ పెద్ద రెక్కల్ని ఆడించుకుంటూ ఆకాశంలో హంసల్లా వయ్యారంగా కదులుతూ ముందుకు వెళుతున్నాయి. ఎత్తయిన కొండల మధ్య.. వెడల్పాటు కాలువలా నది.. మధ్యలో మెల్లగా సాగిపోతున్న లాంచి.. ఆ లాంచిని దాటుకొని ఆకాశంలో ముందుకు వెళ్ళిపోతున్న గూడ బాతులు.. పెద్ద కాన్వాస్ పైన చేయి తిరిగిన ఏ చిత్రకారుడో గీసిన అందమైన ప్రకృతి దృశ్యంలా.. అనిపిస్తోంది నాకు.

నా భార్యా ఆ దృశ్యాన్నీ చూస్తోంది. నవీన్, చిన్నా 'అదిగో హంసలు.. హంసలు' అంటూ కేరింతలు కొడుతున్నారు.

కళాకారులు ఏదో పాటకు స్టెప్పులేస్తున్నారు. యాత్రికులు కొందరు వారి నృత్యం చూడ్డంలో నిమగ్నమైపోయారు. మరికొందరు ప్రకృతి అందాలు చూడ్డంలో మునిగివున్నారు.

పాట ఆగింది. గైడ్ ముందుకొచ్చాడు.

"ప్రియమైన యాత్రికులారా.. ఎదురుగా చూడండి."

అందరూ ముందుకు చూశారు.. కొంతదూరంలో ఒక కొండ.. ముందుకొచ్చినట్లు కనిపిస్తోంది. దానికవతలా కొండలే..

"చూశారు కదా.. నది కనపడ్డం లేదు. అది ఎదరగా అంతమైనట్టు కనిపిస్తోంది. కదా! అంతం కాలేదు. అక్కడ నది మలుపుతిరుగుతుంది. ఆ మలుపు కుడివైపుకా? ఎడమవైపుకా? ఆలోచించండి. నది మధ్యలో మనం వున్నాం.. మనలాంచి ఎటువైపుకు తిరుగుతుందో చెప్పిన వాళ్ళకి మంచి బహుమతి యిస్తాం. ఆ కొండదగ్గరికి చేరడానికి పదహైదు నిముషాలు పట్టవచ్చు. ఆలోచించండి. కరెక్టుగా చెప్పినవారిలో ఒకరికి.. మంచి గిఫ్ట్.. ఓకె?"

చెప్పి కూర్చున్నాడు గైడ్. అక్కడ ఒక ఫర్లాంగ్ వెడల్పుతో కనిపిస్తున్న నది.. సగం ఇసుక మేటలతో నిండివుంది. సగం నీళ్ళు.. ఆ నీళ్ళపైన కదులుతున్న లాంచి..

నదికిరువైపులా ఆకాశాన్నంటుతున్నంత ఎత్తుగా పచ్చని కొండలు.. కొండల నడుమ లాంచి.. క్రమంగా ఆ కొండను సమీపించింది. గైడ్ మళ్ళీ వచ్చి "ఇప్పుడు చెప్పండి. మన లాంచి కుడివైపుకు తిరుగుతుందా? ఎడమవైపుకా?" అడిగాడు. అందరూ చూస్తున్నారు. కొండ ముందుకు పొడుచుకొచ్చినట్టు కనిపిస్తోంది. నవీన్ మేట వేసిన ఇసుక వైపు చూస్తున్నాడు.

"త్వరగా చెప్పండి. ముందు కరెక్టుగా చెప్పిన వాళ్ళకే బహుమతి" గైడ్ అందరివైపు చూస్తున్నాడు. కొండ ఇంకొంచెం దగ్గరైంది. "కుడివైపుకి.. తిరుగుతుంది.. పడవ.. రైట్.. రైట్!" గట్టిగా అరిచాడు నవీన్.

"ఇంకా?" అన్నాడు గైడ్.

"లెఫ్ట్!" అన్నాడు చిన్నా.

ఆ తర్వాత కొందరు రైట్ అన్నారు. మరికొందరు లెఫ్ట్ అన్నారు.

"కాదు.. కాదు.. రైట్.. రైట్.. కుడిపక్కకే తిరుగుతుంది" ముందుకు వచ్చి గట్టిగా అరిచాడు నవీన్

కొండ ఇంకా దగ్గరైంది.

"ఎలా చెబుతావ్ కుడివైపుకనీ?" గైడ్ అడిగాడు.

అందరూ అతనివైపే ఉత్సాహంగా చూస్తున్నారు.

"మరి.. మరి.. ఇసక మేటలు.. నీళ్ళు.. పారినవైపు జారినై.."

కళ్ళు పెద్దవి చేసి.. వ్రేళ్లు ఆడిస్తూ చెప్పాడు నవీన్.

పడవ కొండ ప్రక్కకు వచ్చేసింది..

"నీపేరేమిటి?" అడిగాడు.

"ఆ.. నవీన్" చెప్పాడతను.

"ఎస్. నవీన్ చెప్పింది కరెక్టు. చూడండి.. లాంచి కుడివైపుకు తిరుగుతోంది" అన్నాడు గైడ్.

నిజమే.. కొండను దాటుతోంది పడవ.. కుడివైపుకు తిరుగుతూ..

"నవీన్ ఇలారా.. " ముందుకు పిలిచాడు గైడ్.

"ఈ అబ్బాయి చూడడానికి ఇలా వున్నాడు కానీ.. ఇంటలిజెంటే. అందరూ క్లాప్స్ కొట్టండి" గైడ్ చెప్పాడు.

అందరూ క్లాప్స్ కొట్టారు.

"ఈ అబ్బాయికి అయిదువందల రూపాయల పార్కర్‌పెన్ గిఫ్ట్.. తీసుకో నవీన్. విష్ యు గుడ్‌లక్." అని అభినందించి గైడ్ బంగారు రంగుతో మెరిసిపోతున్న పార్కర్ పెన్ ఉన్న పాకెట్ యిచ్చాడు.

దాన్ని ఆనందంగా తీసుకొని ముఖమంతా కండ్లు చేసుకుని పేనాను చూస్తూ నవీన్ తన పేరెంట్స్ దగ్గరకు వెళ్లి "మమ్మీ.. నాకు.. నాకు ప్రైజ్" అన్నాడు.

"మా నాన్న బంగారం.. " అంటూ అతని తల్లి నవీన్ నొసటన ముద్దు పెట్టుకుంది.

నవీన్ ఆ తర్వాత మా చిన్నోడి దగ్గరికొచ్చి "వావ్.. చిన్నా..నాకు..పార్కర్ పెన్ ప్రైజ్ అంటూ మురిసిపోతూ చూపించాడు.

"కంగ్రాట్స్" దాన్ని చూస్తూ అన్నాడు చిన్నోడు.

మళ్ళీ ఆ యిద్దరూ కబుర్లలో పడిపోయారు.

నడినెత్తి కొచ్చిన సూర్యబింబం. గోదావరి జలాలు వెండిపూత పూసినట్లు మెరిసిపోతున్నాయి. సినిమాపాటలకు స్టెప్‌లేస్తున్న కళాకారులు బాగా అలసిపోయినట్టు చెమట కార్చుకుంటూ ప్రక్కకు వెళ్ళారు. గైడ్ ముందుకు వచ్చి "రాబోయేది పేరంటాల పల్లి. అక్కడే మన లంచ్. అక్కడే అల్లూరి సీతారామరాజు సేవించిన శివాలయం కూడా ఉంది. మనం ఒక గంట అక్కడ ఆగుతాం. అంతలోపల లంచ్ అయిపోవాలి" అని చెప్పి పక్కకు వెళ్ళాడు. మరికొద్ది క్షణాలకు మెల్లగా వెళ్ళి బోటు అక్కడ ఆగింది. ఆ ప్రదేశంలో చిన్న చిన్న ఇసుక తిన్నెలు ఎండకు మిలమిలా మెరిసి పోతున్నాయి.

అందరూ దిగారు. నవీన్ తల్లిదండ్రులూ దిగారు. నిర్వాహకులు అందరికీ పేపర్ ప్లేట్లలో అన్నమూ, కూరలు వడ్డించి అందించారు.

లాంచికి లంగరు వేసి, తాడు బిగించి, బోటుకిటు అటు అంచుకు వ్రేలాడదీసి కట్టివున్న నల్లటి ట్యూబ్ ఒకసారి పరిశీలించి సరంగులు కూడా దిగేశారు. పడవ యిప్పుడు చాలాదూరం ప్రయాణించి విశ్రాంతి తీసుకుంటున్న బాటసారిలా కనిపించింది.

అందరూ జంటలు జంటలుగా కబుర్లాడుకుంటూ భోంచేస్తున్నారు. మా ప్రక్కనే నిలబడి నవీన్, అతని పేరెంట్స్ కూడా నిలబడే అన్నం ప్లేట్లను చేతపట్టుకుని భోంచేస్తున్నారు. అన్నమూ కూరలు అన్నీ కలిపిస్తే నవీన్ కూడా బుద్ధిగా భోంచేస్తున్నాడు.. అతని ప్రక్కన మా చిన్నా, అతని పక్కన మేమూ..

"మీరేం చేస్తారు మేడం?" పరిచయం పెంచుకోవాలన్న తలంపుతో ఉమాదేవిని అడిగింది నవీన్‌తల్లి.

"నాపేరు ఉమాదేవి.. నేను గవర్నమెంట్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను.. మరి మీరు?" ఆమెకు సమాధానం చెప్పి ప్రశ్నించింది ఉమాదేవి.

నా పేరు భారతి. నేను బళ్ళారిలో టీచర్‌గా పనిచేస్తున్నాను. మా ఆయన నీలకంఠం.. బ్యాంకు మేనేజర్" చెప్పింది ఆమె.

నీలకంఠం "నమస్కారం మేడమ్" అన్నాడు.

"నమస్కారం.. ఇదిగో మా ఆయన రామ్. తిరుపతిలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు" పరిచయం చేసింది.

ఈ పరిచయాల తర్వాత కొన్ని కబుర్లు..

ఆ కబుర్లలో తెలిసిన విషయమేమిటంటే.. నవీన్ వాళ్ళ ఏకైక పుత్రుడు. అతడు పుట్టినప్పుడే మెంటర్‌రిటారేషన్ అనీ, ఎన్నో వైద్యాలయినాయనీ, ఎన్నో తిరిగారనీ, అతనిపైన ప్రత్యేక శ్రద్ధ వహించి, అన్నీ అదే పనిగా నేర్పిస్తే మెరుగవుతుందనీ, వీలయినంత ఎక్కువగా అతన్ని నలుగురిలో తిప్పుతూ, పిల్లల్తో కలిపి ఆడిస్తే బుద్ధిమాంద్యం తగ్గుతుందని డాక్టర్లు చెప్పారనీ, అందులో భాగంగానే ఇలా వచ్చారని తెలుస్తుంది.

"మొదటికంటే యిప్పుడు మేలే మేడం.. సుమారుగా చదువుతాడు కూడా" కబుర్లలో భాగంగా చెప్పింది భారతి.

"నిజమే.. ఇలాగే మరింత శ్రద్ధ చూపిస్తే.. మామూలుగా వచ్చేస్తాడు. కానీ కొంచెం టైం తీసుకుంటుంది. నో ప్రాబ్లం" ఉమాదేవి చెప్పింది.

"మీ అడ్రస్ ఇవ్వండి సార్.. ఏమైనా అవసరమైతే మేడం సలహాలు తీసుకుంటాం.. " అన్నాడు నీలకంఠం.

"ఒకె అలాగే.." అని కుడిచేత్తో ప్లేట్ పట్టుకొని, ఎడమచేతితో జేబులోవున్న నా విజిటింగ్ కార్డిచ్చాను. అతనూ ఎడమచేత్తోనే దాన్ని తీసుకుని ఒక్కసారి చదివి "థ్యాంక్స్" అంటూ దాన్ని తన జేబులో పెట్టుకున్నాడు.

ఇంతలో లాంచిలో నుంచీ హార్న్ వినిపించింది.

"గంట అయిపోయింది. అయిదు నిమిషాల్లో.. అందరూ వచ్చేయండి." సరంగు అరుస్తున్నాడు.

భోజనాలు ముగించిన వారందరూ లాంచిలో ఎక్కి కుర్చీల్లో కూర్చున్నారు. మేమూ భోజనం ముగించి, చేతులు కడుక్కుని నీళ్ళు తాగి ఎక్కేశాం.. లాంచి మళ్ళీ కదిలింది...

అరగంట ప్రయాణించిన తర్వాత గట్టువైపు చేయి చూపిస్తూ మైక్ చేతపట్టుకొని 'అటుచూడండి. ఇసుక తిన్నెలు.. ఆ తిన్నెల పైన వెదురు కుటీరాలు. టూడేస్ ప్యాకేజీలో అయితే నిర్వాహకులు ఇక్కడే "క్యాంపైర్" ఏర్పాటు చేస్తారు. టిఫిన్లు, భోజనాలూ ఇక్కడే. దానికవతలే గట్టుపైన పల్లెవుంది. అవసరమైతే ఆ పల్లీయులూ సహాయం చేస్తారు. ఆ పల్లె పేరు 'రామవరం'. ఇక్కడంతా గిరిజనపల్లెలే. అందమైన ప్రకృతి దృశ్యాలే. ఓకే. మీకు బోరు లేకుండా.. ఎంటర్‌టైన్‌మెంట్.."అని ప్రక్కకు తప్పుకున్నాడు గైడు. ఒక అమ్మాయి, అబ్బాయి డాన్స్ ప్రారంభించారు. రికార్డులో "అమ్మడూ.. కుమ్ముడూ.." పాట.

"ఛీ, ఇంత బూతు పాటకు ఆ సెన్సారోళ్ళు ఎలా యాక్సెప్ట్ చేశారో తెలీదు." అంది భారతి.

"ఈనాటి సినిమాల్లో పాత సినిమాల్లో లాగా సందేశాలు, సంస్కారాలు మచ్చుకయినా వుండవు. అంతే." అంది ఉమ.

"తీసే వాళ్ళకూ బుద్ధిలేదు. చూసేవాళ్ళకు బుద్ధిలేదు. యాక్షన్ చేసే వాళ్ళకూ సెన్స్ లేదు". అన్నాడు నీలకంఠం.

"ఎస్, కరెక్ట్" అంటూ తలూపాను నేను.

చిన్నా, నవీన్ బోటు అంచుకు ఆనుకొని నిలబడి ఏవేవో మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు.

నవీన్ మాటిమాటికీ కళ్ళు పెద్దవి చేసి, నోరు తెరచి 'భలే..భలే' అంటూ చేతులు తడుతూ పిచ్చి చూపుల్లాంటి చూపులు చూస్తూ నవ్వుతున్నాడు.

భారతీ, నీలకంఠం వాళ్లను గమనిస్తూనే ఏవేవో మాట్లాడుతున్నారు. మా శ్రీమతీ వాళ్ళతో కలిసిపోయి మాట్లాడింది మాట్లాడిందిగానే వుంది.

మళ్లీ గైడ్ మైక్ తీసుకుని "మనమిప్పుడు 'కొయ్యూరు' దగ్గరికొచ్చాం. ఆ.. దూరంగా కనిపిస్తున్నవే పాపికొండలు" అని చెప్పాడు.

అందరూ అటువైపు చూశారు. గట్టున దూరంగా ఏవో కొన్ని ఇండ్లు కనిపిస్తున్నాయి. చాలాదూరంలో.. ఆకాశాన్నంటుకున్నట్టు పెద్ద కోట గోడలా కనిపిస్తున్న కొండలు.. అందులో ఒక కొండ ఒక మనిషి వెల్లికలా పడుకున్నట్లుగా వుంది. ఆ దృశ్యం నాకు చాలా వింతగా, ఆహ్లాదంగా అనిపించింది.

“ఎదురుగా.. అడ్డంగా ఒక పేద్ద ఆకారం వెల్లికలా పడుకున్నట్లుగా లేదూ కొండ?” మా ఆవిడతో అన్నాను.

“ఆ.. నాకూ అలాగే అనిపిస్తోంది.” అంది ఉమా..

“అవును.. మాకూ అలాగే అనిపిస్తోంది.” అన్నారు భారతీనీలకంఠాలు.

బోటు వేగంగా పోతోంది.

నవీన్, చిన్నా.. ఏవేవో మాట్లాడుకుంటూ లాంచీ చివరికి వచ్చి వంగి నీళ్ళలోకి తొంగి చూస్తున్నారు.

“అబ్బా.. బోటు వేగంగా పోతోందిరా” అన్నాడు చిన్నా

“అవున్రా.. అందుకే నీళ్ళు.. బర్రున ఎనక్కిపోతావుండాయి చూడూ..”

ఇంకొంచెం వెనక్కి జరిగి నీళ్ళల్లోకి యింకా తొంగిచూస్తూ అన్నాడు నవీన్.

“ఓ.. భలేవుందిరా” అంటున్నాడు చిన్నా.

గైడ్ పాపికొండల ప్రత్యేకతను గురించి చెబుతున్నాడు.

“మీరు గమనించే వుంటారు.. ఎదరగా.. పెద్ద కొండ.. రాక్షసుడు బొజ్జ ఆరేసుకోని పడుకున్నట్లుగా వుంది.. దానికీ ఒక కథ వుంది..”

ఏం చెబుతాడోనని అందరూ ఇంట్రస్టుగా వింటున్నారు.

లాంచి వెనక అంచుపైన పొట్ట ఆనించి “వావ్ నీళ్ళను పడవ చీల్చుకొని పోతున్నట్లుంది..’ అని ఒకరు, “భలే.. భలే.. నీళ్ళు జివ్వున ఎగురుతున్నాయి” అని యింకొకరు కేరింతలు కొడుతూ మాట్లాడుకుంటున్నారు చిన్నా, నవీన్. వారికి కొంతదూరంలో మరి ఇద్దరు పిల్లలు నిలబడి వాళ్ళను చూస్తూ ఆనందిస్తున్నారు.

“ముందు కాలంలో ‘పాపి’ అనే ఒక రాక్షసుడు వచ్చి ఇక్కడి జనాలను, దొరికిన వారిని దొరికినట్లు తినేసి నమిలేవాడట. పల్లెలమీద పడి నివాసాలన్నింటినీ నేలమట్టం చేసేవాడట. వాడు చేసే ఘోరాలు ఇన్నీ అన్నీ కాదట. వాడి బాధ భరించలేక జనమంతా ఒక్కచోట చేరి గోదావరి మాతను వేడుకుని కాపాడమన్నారట. వాళ్ళ బాధను ఆలకించిన అమ్మవారు వాళ్ళకు అభయమిచ్చి దుర్గాంబగా మారి వాడిని చంపేసిందట. అలా అమ్మవారి చేత చంపబడిన వాడి శరీరమే ఆ కొండగా మారిపోయిందట. అప్పటినుంచీ ఈ కొండలను ‘పాపికొండలు’ అని పిలుస్తున్నారని కథ.. అదిగో చూడండి.. అది ఇంకా స్పష్టంగా కనిపిస్తోంది” గైడ్ పాపికొండల క్షేత్ర మహత్మ్యాన్ని వివరించాడు.

తిరిగి డాన్స్.. ఆ యువతీయువకులు నాగేశ్వర్రావ్‌గా, వాణిశ్రీగా, ఎన్టీఆర్‌గా, సావిత్రిగా మరుక్షణం కృష్ణ, శోభన్‌బాబు, శారద, విజయనిర్మలగా.. వారే నాగార్జున, బాలయ్య, నయనతార, శ్రియా.. ఇలా.. ఆయాపాటల్లో హీరోహీరోయిన్లుగా మారిపోయి స్టెప్పులు వేసింది వేసినట్లుగానే వున్నారు.

యాత్రీకులు వారి డాన్సును, గోదారికటు ఇటువున్న కొండల అందాలను ఆస్వాదించడంలో మునిగిపోయివున్నారు.

నవీను, చిన్నా వారి ఆనందంలో వారు మునిగివున్నారు.

బోటు ఆ కొండల ప్రక్కగా.. సాగి.. మలుపు తిరిగింది. గైడ్ గొంతుమళ్ళీ వినిపించింది. “మనమిప్పుడు ఖమ్మం జిల్లా సరిహద్దుల్లో కొచ్చాం.. ఈ పాపి కొండలు దాటుకుంటే ‘పురుషోత్తపట్టణం’.. అట్లే పోతే భద్రాచలం. మనది వండే టూర్.. మనం పురుషోత్తపట్టణం నుంచీ వెనక్కి మల్లుతాం.. అలా రిటర్నయితేనే సాయంత్రానికి తిరిగి పట్టిసీమ చేరుకుంటాం”.

“మనం రాజమండ్రికి పోమా?” ఒకతను అడిగాడు.

“పట్టిసీమ కవతలే పోలవరం ప్రాజెక్ట్ కడుతున్నారు.. కాబట్టి మనం పట్టిసీమ దాటిపోలేం. అక్కడికి పోతే ఉదయంలాగా.. మా వెహికల్స్‌లో మిమ్మల్ని రాజమండ్రి చేరుస్తాం” వివరించాడు గైడ్.

ఇంతలో ఉన్నట్టుండి వెనకనుంచి కేకలు

“కాపాడండీ.. కాపాడండీ”

అందరూ ఏం జరిగిందోనని లేచి నిలబడ్డారు.. నిర్వాహకులు ఇద్దరు ‘ఏమైంది?’ పరిగెత్తుకొచ్చారు.

“తిక్కబ్బాయి.. వెనక్కి తొంగిచూస్తూ కాలుజారి నదిలో పడిపోయినాడు. యింకొక అబ్బాయి అతన్ని కాపాడాలని నీళ్ళల్లో దూకేశాడు” అక్కడున్న పిల్లలు చెప్పారు.

“అయ్యో.. మా పిల్లాడు.. మా పిల్లాడు..” అంటూ నవీన్ తల్లి, ఉమాదేవి ఏడవడం ప్రారంభించారు.

నాకేం చేయాలో దిక్కుతోచడం లేదు. నీలకంఠం పరిస్థితీ అలాగే వుంది.

“మీరు భయపడకండి. మీ పిల్లలకేం కాదు, మేమున్నాం” అని అక్కడికి వచ్చిన ఒక సరంగు ధైర్యం చెబుతున్నాడు.

నిర్వాహకులిద్దరు లాంచి అంచుకున్న ఎయిర్‌ట్యూబ్‌లను చేతుల్లోకి తీసుకుని నదిలో దూకేశారు.

నీళ్ళలో నవీన్ మునుగుతూ తేలుతూవున్నాడు. చిన్నా.. ఈదుతూ వెనకనుంచి వాడిజుట్టు పట్టుకొన్నాడు.

లాంచి కొంతదూరంలో ఆగింది.

నీటిలోకి దూకిన వాళ్ళు గజ ఈతగాళ్ళు.. ఈదుకంటూ వెళ్లి వాళ్ళను పట్టుకొని, ట్యూబుల్ని వాళ్ళ నడుములకు దూర్చి.. “పట్టుకోండి’ అన్నారు. వాళ్లు అలాగే చేశారు.

లాంచిలోవున్న సరంగు లాంచి అంచుకే చుట్టచుట్టి కట్టివున్న పొడువాటి దారాల్ని తీసి, వాళ్ళకందేటట్లుగా విసిరాడు. ఈతగాళ్లు ఒకచేత్తో ట్యూబులు పట్టుకోనున్న పిల్లల్ని పట్టుకొని, మరోచేత్తో తాళ్ళను పట్టుకున్నారు.. క్షణాల్లో చిన్నా, నవీన్ రక్షింపబడ్డారు.. అందరూ ధైర్యంగా గాలి పీల్చుకున్నారు.

‘‘ఈ అబ్బాయి లేకుంటే.. నవీన్‌ను రక్షించేది కష్టమయ్యేది.. మేము నీళ్ళలోకి దూకేదాకా అతను మునిగిపోకుండా రక్షించగలిగాడు” చిన్నాని చూపిస్తూ అన్నారు నిర్వాహక ఈతగాళ్ళు.

అందరూ చిన్నాను మెచ్చుకున్నారు.

“నువ్వెందుకు దూకావురా.. నీకేమైనా అయివుంటే?” చిన్నా తలను టవల్‌తో రద్దుతూ అంది ఉమాదేవి.

“నాకు ఈతొచ్చు.. వాడికి రాదు పాపం!” అన్నాడు చిన్నా.

నవీన్ తల్లిదండ్రులు ఎంతో కృతజ్ఞతతో మావైపు చూశారు.

“మీ చిన్నా మేలు మరువ లేమండీ.. మీకెలా కృతజ్ఞతలు చెప్పాలో తెలీడం లేదు” నవీన్ తలను తుడుస్తూ అంది భారతి.

“దానికేముంది లెండి” అన్నాను నేను.

“మా వాడి కేమౌతుందోనని నేను భయపడ్డాను” అంది ఉమ. భారతి బ్యాగులోనుంచీ పొడిబట్టలు తీసి నవీన్‌కి తొడిగింది. నేనూ మా బ్యాగులోనుంచీ ఫ్యాంటూషర్టూ తీసి ఉమాదేవికిచ్చాను. తడి బట్టలు విప్పించి ఉమాదేవి చిన్నాకు పొడిబట్టలు కట్టించింది.

“అమ్మా! ఏ ప్రమాదమూ జరగలేదు. బిడ్డలు బతికారు” అని అందరూ అనుకున్నారు.

ఆ తర్వాత కొంతసేపటికి మా బోటు పురుషోత్తపట్టణం చేరుకుంది. అక్కడ గట్టున ఒకగంట విశ్రాంతి తీసుకున్న తర్వాత సరంగు లాంచీని వెనక్కి తిప్పాడు..

యాత్రీకులతో నిండిన మరి రెండు లాంచీలు అక్కడే వెనుదిరిగాయి.. జరిగిన సంఘటనతో కాబోలు.. లాంచి సైలెంటుగా తిరిగుప్రయాణం సాగించి, ప్రొద్దుగుంకేసరికి పట్టిసీమకు చేరుకుంది. మమ్మల్ని తిరిగి రాజమండ్రికి తీసుకుపోవడానికి వాహనాలు సిద్ధంగా వున్నాయి.

బోటు దిగిన భారతి, నీలకంఠం ఒక కార్లో ఎక్కబోతూ.. “మీ మేలు మరచిపోలేము.. ముఖ్యంగా మీ అబ్బాయిని.. ఒక్కసారి బళ్ళారికి రండి.. మిమ్మల్ని విజయనగరం తీసుకెళతాం..” అంటూ ప్రేమగా చెప్పారు.

“చిన్నా.. ఎప్పుడైనా.. మా వూరికి రా..రా.. నేనూ మీ వూరికొస్తాలే..” చిన్నా చెంపన ముద్దు పెట్టి కారెక్కి కూర్చున్నాడు నవీన్.

అతన్ని చూస్తుంటే అతనిపైన మాకూ ప్రేమ పెరిగింది. అతనూ మా బిడ్డలాంటోడే అనిపించింది.

నవీన్ ‘అంకుల్ టాటా.. మమ్మీ.. బైబై” అని చెయ్యి ఊపుతుంటే ఆ కుటుంబానికీ మాకూ ఏ అనుబంధమో ఉందనిపించింది.

“అక్కా! ఇకనుంచీ మనం బంధువులం.. టాటా.. అన్నగారూ..’ తప్పక మావూరికి రండి” అంటూ కారెక్కి కూర్చుంది భారతి.

కార్లో కూర్చున్న నీలకంఠమూ ఎంతో కృతజ్ఞతలు చెప్పి ప్రేమగా చూశాడు. వారిప్రేమకు మా కళ్ళు చమర్చాయి. వాళ్ళ కారు ముందుకు కదిలింది.

మా కోసం వచ్చిన వెహికల్‌లో మేమూ కూర్చున్నాం. మేమెక్కిన కారు వేగంగా రాజమండ్రి బాట పట్టింది. కార్లో కూర్చున్న నా మెదడు ఆలోచనల్లో పడిపోయింది.

ఉదయం లాంచిలో కూర్చున్నప్పటినుంచీ సాగిన ప్రయాణం, భారతీ నీలకంఠాల పరిచయం, లాంచిలో డాన్సులు, గైడ్ పరిచయం చేసిన ప్రాంతాలు, పాపికొండల అందాలు, చిన్నా నవీన్ నీటిలో పడిపోయిన సంఘటన అన్నీ సినిమారీలులా మెదడులో పరిగెత్తసాగాయి.

అప్పటికే బాగా చీకటి పడివుండడంతో.. ఉదయం కనిపించిన ప్రకృతి ఏదీ కనిపించక అంతా అంధకారంలో మునిగిపోయివుంది. ఎంత ప్రయత్నించినా నా ఆలోచనలు తెగడం లేదు. మనసులో ఏదో భాద...

“పోలవరం డ్యాం త్వరలో పూర్తవుతుంది. ఆ తర్వాత ఇటువైపుకు రావడం కుదరదు.. కడుతున్న ప్రాజెక్టుతో .. ఈ పాపికొండల అందాలు, ఎన్నో గిరిజన తండాలు, నదీజలంలో మునిగిపోతాయి. ఈ రోజు ఈతగాళ్ళు నా చిన్నాను, అందమైన నవీన్‌ను రక్షించగలిగారు. క్షణం ఆలస్యమై వుంటే ఏమయ్యేది? ఆలోచిస్తూ వెలుపలికి చూస్తే అంతా కారు చీకటే.. కారు వేగంగా ముందుకు దూసుకువెళుతూనే వుంది.

♦

## సాహిత్య ప్రస్థానం సెప్టెంబర్ నెల పురస్కారాలు

**ముగ్గు రాళ్ళ మిట్ట**
కథకు: రూ.700/-
రచయిత : ఆర్.సి. కృష్ణస్వామిరాజు

**అణచివేతపై ధిక్కారస్థలి**
వ్యాసం: రూ.500/-
రచయిత : అనిల్ డ్యాని

**గర్భశోకం**
కవితకు : రూ .500/-
రచయిత : మార్ని జానకిరామ్ చౌదరి

■■■

*కథ, కవితకు సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కారం, వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.*

**- ఎడిటర్**

## మొకం చాటేసిన మేఘం

**- జానూ సురేష్**
**9966861565**



మేఘం...మేఘం...మేఘం
ఎటు చూసినా మేఘాలే
వర్షించే మేఘం ఒక్కటీ కనబడదు
నేలమీది పత్తినంతా
ఆకాశం ఆకర్షించినట్లుగా
పైన తేలియాడుతున్న
తెల్లని దూది బస్తాల్లాంటి మేఘాలు
సముద్రం వైపు దారి పట్టి
కడుపునిండా నీళ్ళు తాగి
పులిచారల మబ్బులు కాస్త
కారుమబ్బులై
సీమ మొకం మీద
కాసిన్ని జల్లులు చిలకరించి
పోవాలని
కోట్ల కళ్ళు మేఘాల్ని
కమ్ముకున్నాయి
మా తలలపైనే అటూ ఇటూ
తిరుగుతూ
నెర్రెలిచ్చిన భూమిని
తడారిపోయిన గొంతును
తడపాలనిపించలేదా?
కునుకు లేకుండా చినుకు కోసం
ఎదురుచూస్తున్న
రైతుకు మొకం చాటేస్తున్నారా
ఉరిశిక్ష దగ్గర పడ్డ ఖైదీల్లా
మోర పైకెత్తుకొని మీ వైపే చూస్తున్న
మొక్కల రెక్కలపై
నాలుగు నీటి చుక్కల్ని చల్లేందుకు
నీకు మనసొప్పలేదా?
దండుకునే వాడికే మరిన్ని
అవకాశాలు అందుతున్నట్లు
లేనివాడికి ఉన్న గోచీ కూడా
ఊడిపోతున్నట్లు
కడుపు నిండిన కుండను మరింత
నింపుతున్నావు
కడుపు ఎండి,
కన్నీటి జాడతప్ప నీటి జాడేలేని
కరువు ప్రాంతంపై కనికరమైనా
చూపవు
ఎందుకు నీకంత ప్రకోపం?
మోడువారిన గుండెలపై
ఎందుకు నీకంత పౌరుషం?
నీ పలకరింపు కోసం పడిగాపులు
కాస్తున్నాం
పట్టుదలమాని మాకోసం దిగొస్తావని
కలలుగంటున్నాం
నీతో చిరకాల స్నేహం చేస్తున్న పొలం
కోసం ...
నువ్వొస్తే తెగ సంబరపడిపోయి గంతులేసే
వాగు వంకల కోసం ...
కొండల కోసం ...గుట్టల కోసం ...
పక్షుల కోసం ...పగుళ్ళువారిన నేల కోసం
...
చివరగా మనిషి కోసం...
వస్తావుగా.....!

♦

**వర్తమానం**

# హే మొహబ్బత్ జిందాబాద్



- తెలకపల్లి రవి

పిల్లలు కులాంతర ప్రేమికులైతే 'పెద్దలు' హంతకులు కావలసిందేనా? రోమియో జూలియట్, లైలా మజ్నూ, దేవదాసు.. కథలు మారవా? శతాబ్దాలు గడిచిపోతున్నా యువతీ యువకుల ప్రేమలను ఆమోదించలేని "పెద్దరికాలు" ఎందుకు? ప్రాణాలు తీసే పైశాచికాలకు కూడా ఎందుకు పాల్పడుతున్నాయి? ప్యార్ కియాతో డర్‌నా క్యా అని అనార్కలి నిలదీస్తే  ప్యార్ కియాతో మర్‌నా కూ అని అమృత ప్రశ్నిస్తున్నదానికి ఏమిటి సమాధానం? రక్షించలేకపోయిన పోలీసులు, స్పందించలేకపోయిన పాలకులూ, సన్నాయి నొక్కుల నాయకులూ, సంధిగ్ధ సమాజమూ ఏం చెబుతాయి? అలనాటి నాగేశ్వరరావు దేవదాసు నుంచి ఈనాటి నానీ దేవదాసు వరకూ ప్రేమకథలే ఆదరిస్తున్న మన సమాజం పితృరూప పిశాచాల  ఆధిపత్య ధోరణులను అహంకారాలను అడ్డుకోలేకపోవడమేమిటి? ఇంకా కులాల గురించి మాట్లాడ్డమేమిటని విసుక్కునే విశాల మనస్కులూ ,ఇంకా బిసి ఎస్‌సి వంటి మాటలేమిటని మండిపడే మహానుభావాలు బుసలు కొట్టిన కులసర్పం కాటుపై ఏమంటారు?

మిర్యాలగూడలో మిత్తికత్తికి బలైన కుర్రాడి పేరు ప్రణయ్ అయితే అతనికోసం అమ్మానాన్నలను ఎదిరించి వచ్చిన యువతి అమృత. ప్రేమ ప్రణయం ఎప్పుడూ అమృత తుల్యమైనవే. కాని కుల దురహంకారం,  ధనమదం  వాటిని సహించలేవు. కులంపైన ప్రేమ కూతురుపై ప్రేమ కన్నా మిన్న. అల్లుడిని అంతం చేసినా అమ్మాయిని మరిపించి మురిపించి అందలమెక్కించగలమనే మూర్ఖత్వం. నయా సంపదలు మదాంధత మరింత పెంచి మాయపొరలు కప్పేస్తుంటాయి. మాఫియా మద్దతులూ  పద్దతులూ వుంటాయి. అల్లుడిని చంపించిన మారుతీరావు ఇటీవలనే టిఆర్‌ఎస్‌లో చేరిన వ్యక్తి అయితే ఆయనకు సహకరించిన కరీం కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు.(తర్వాత తొలగించారు)  సమన్వయం చేసిన బరీ మజ్లిస్ అనుయాయి. నచ్చచెప్పడమో లేక బెదిరించడమో (స్పష్టంగా  తెలియదట) చేసిన వ్యక్తి స్థానిక శాసనసభ్యుడు. వీరంతా వున్నా పార్టీల ప్రసక్తి తేవద్దని ఎస్‌పి సలహా కావచ్చు గాని మన సామాజిక దొంతరలతో రాజకీయాలు ఎంతగా పెనవేసుకుపోయాయో తెలియజేసే నిదర్శనాలివి. దీనికి ముందు కూడా కరీంనగర్ జిల్లా మంథనిలో పూర్వపు నల్గొండలోని యాదాద్రి భువనగిరిలో ఇలాటి ఘాతుకాలు జరిగాయి. అన్నిచోట్లా పోలీసుల పాత్ర సరేసరి. మిర్యాలగూడలో కూడా  కుల పిశాచ పితాశ్రీకి పదిహేనుసార్లు కౌన్సిలింగ్ చేశామంటున్నారు గాని ప్రణయ్ ప్రాణాలు బలి గాకుండా ఆపలేకపోయారు. తమది కొంత వైఫల్యం

వుందంటూనే ఆ అమ్మాయి అమ్మకు ఫోన్లు చేయడం తప్పని పోలీసు బాస్ చెప్పినట్టు యూ ట్యూబ్ క్లిప్స్ కనిపిస్తున్నాయి. ఒకవైపున అమ్మా నాన్నలను గౌరవించడం వారి కలలు నెరవేర్చడం గురించి సూక్తులు చెప్పేవారే తొలిచూలాలైన నవయువతి కన్నతల్లితో అనుభూతి పంచుకోవడం అపరాధమనడం ఎలా కుదురుతుంది? ఇదంతా సత్సంబంధాల పునరుద్దరణలో భాగంగా చూడాలి కదా! కాబట్టి కులమదం ధనబలం కలగలిపి చేసిన కర్కశకాండ ఇది.

మిర్యాలగూడ ఘటన వరకూ చూస్తే ధనమదం ప్రధానమనిపించింది గాని ఎర్రగడ్డలో ఏకంగా కూతురిపైనే స్వయంగా దాడి చేసిన మనోహరాచారిలో కులమే బుసకొట్టింది. ప్రకాశం జిల్లా ఈతముక్కలలో బెదిరింపులతో కొత్త జంట ఆత్మహత్యను ప్రేరేపించిన బాబాయివరస మనిషిలోనూ బండతనమే కనిపిస్తుంది. అందుకే ఇది సామాజిక రుగ్మత తప్ప వ్యక్తిగత వైకల్యం కాదు. కులరక్కసి కరాళనృత్యం తీసిన పసి ప్రాణాలకోసం అశ్రుతర్పణం చేయాల్సిన సమయం. కాని దురదృష్టవశాత్తూ సోషల్ మీడియాలో కొందరు విషం కక్కుతున్నారు. ప్రేమించుకున్న పాపానికి ఆ యువతీ యువకులను ముక్కలు చేసి తీరాలని చిందులు తొక్కుతున్నారు. సినిమాలు స్మార్టు ఫోన్లు ఫేస్‌బుక్‌లతో పిల్లలు పాడైపోతే తలిదండ్రులు ఏం చేయాలని మరి కొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. పిల్లల కోసం పరితపించే పెద్దల బాధ, వారి భవిష్యత్తు భద్రత చూడాలని మానవత్వం వలకబోస్తున్నారు. సమయం సందర్భం చూడని ఈ పరోక్ష సమర్థనలలో దాచేస్తే దాగకుండా కనిపించేది కింది కులాల పట్ల చులకనే. కుటుంబ సంబంధాలూ ప్రేమ గౌరవాలు తప్పక పెంపొందించాల్సిందే. అయితే అమ్మానాన్న కలలు నిజం చేయడమంటే బాగా చదువుకోవడం వారిని గౌరవించడం తప్ప కులాధిక్యతలను అహంభావాలను కొనసాగించడం కాదు. నూటికి ఏ నలుగురో సాహసించి మరో కులం వారిని పెళ్లి చేసుకోవడం అవమానించడం కానే కాదు. తమ ప్రేమను అమ్మానాన్న ఆశీర్వదించాలనే పిల్లలు కోరుకుంటారు. దానికి వారి కులాధిక్యతకు తలవంచాలంటే కులాల పరిధిలోనే గిరికీలు కొడుతుండాలి. విద్యాధికులూ ఆధునికులనుకునే వారు కూడా ఈ తరహాలో మాట్లాడ్డం దారుణం. ఇంకా ముందుకు వెళ్లి పై కులాల వారిని, సంపన్నులనూ ట్రాప్ వేసి మరీ లోబర్చుకుంటారని కొందరు నిందిస్తున్నారు. దీనిపై ఒక తాజా చర్చలో బిజెపి కాంగ్రెస్ ప్రతినిధులిద్దరూ లవ్ జిహాద్‌లను ప్రస్తావించారంటే ఆలోచనలు ఎలా వున్నదీ తెలుస్తుంది. కేరళలో ఇలాటి ఘటనలోనే అమ్మాయి ప్రేమను గౌరవించాల్సిందేనని సుప్రీం కోర్టు తీర్పు. ట్రాప్‌ల విషయానికి వస్తే కొన్ని సందర్భాల్లో కొందరు వ్యక్తులు చేయొచ్చు. మరికొందరు దానికి బలికావచ్చు . క్యాంపస్‌లలో విఫలప్రేమ వల్ల ప్రాణాలు తీసుకున్న వారిలో ఎక్కువ మంది ఒక బలహీన వర్గానికి చెందిన వారన్నది విషాద వాస్తవం. అయితే దీన్ని ఏదో ఒక పాక్షిక కోణంలో చూడటం పొరబాటు. ఇలాటి పలు ఉదాహరణలు వాటిలోని సామాజికాంశాలు క్యాంపస్ ప్రొఫెసర్ ఒకరు చాలా వాస్తవికంగా వివరించారు. చెప్పడానికి ఇది సమయం కాదు. పేదలు కింది కులాల వారే పై వారిపై ట్రాప్‌లు విసురుతారన్న ఆరోపణ దారుణమైంది. తమ సంపదతో సామాజిక స్థానంతో కింది వారిని లోబర్చుకున్న లొంగదీసుకున్న ఉదంతాలు అందుకు కొన్ని వేల రెట్టు వుంటాయి. ప్రేమలోనే గాక జీవితంలోనే నిజాయితీ లేదా మోసం కులాలతో ముడిపడి వుండవు. డబ్బు కోసం వల వేసేవారు ఎక్కడైనా వుంటారు. వాటి విషయంలో కావాల్సింది అప్రమత్తత, అహం కాదు. మోసాలు వరకట్న హత్యలూ గృహహింస కేసుల్లో అత్యధికం పెద్దలుచేసిన పెళ్లిళ్లే. పై వర్గాల్లోనే ఎక్కువగా జరిగే ఇలాటి ఘటనల బాధితుల్లో మాజీ ముఖ్యమంత్రులు కూడా వున్నారు.

ఇక ఈ యువతీ యువకుల ప్రేమ ఆకర్షణ మాత్రమేనని కొందరు ప్రేమ నిపుణులు తీర్పులివ్వడం తమకు మాలిన పని. యుక్తవయస్కులైన ఎవరి ప్రేమపై ఎవరూ తీర్పరులు కాదు. పరాశరుడికి మత్స్యగంధిపై మోహం (ప్రేమ కూడా కాదు) కలగడంతో మొదలైంది మహాభారతం. ఎన్‌టిఆర్, నెల్సన్ మండేలా, దిగ్విజయ సింగ్ వంటివారెందరో అరవైలుదాటాక కూడా ఇష్టపడి జీవిత భాగస్వాములను తెచ్చుకోగా లేనిది ఈ నవయువత మాత్రం పరస్పరాకర్షణకు లోనుకారాదు. సినిమాలన్నిటిలో ప్రేమ మాత్రమే గాక అసభ్యతను కూడా గుప్పిస్తాం. పిల్లలు మాత్రం ఋష్యశృంగుల్లా వుండాలి! మీడియా వార్తల్లో రోజూ అంతులేని అత్యాచార పరంపరలు, అఘాయిత్యాలు, బడిపిల్లలపైనా కసికందులపైనా కామాందుల దాడులూ. ఈ దుష్ప్రభావాలతో దారితప్పిన అవారాలు యాసిడ్ దాడులు చేస్తే ఎన్‌కౌంటర్ల

## తన వాంగ్మూలం

- దారల విజయ కుమారి
9177192275

*ఉరి తాళ్ళు.. పురుగుల మందులు రహస్యాలు చెప్తున్నాయ్
మృతుల మరణ.. వాంగ్మూలం నమోదు చేస్తున్నాయ్*

*కట్టె రాలిపోక ముందు..ఆ..వేదన బరువెంతో..
ఆ కళ్ళు సంధించిన కోట్ల ప్రశ్నలు..*

*సమూహంలో ఒంటరైన వైనం ...
వెంటాడిన బ్రతుకు భయం...
ఉదాసీనత.. నిర్లిప్తతా.. చుట్టుముట్టి..కన్నవారు..
అయినవారి ఆశలు..కూలిపోతుంటే..*

*జ్ఞానం..నైపుణ్యం..ఆక్కరకు రాకుండా.. ఉరి కొయ్యలో...
అదృశ్యమౌతుంటే.. జీవి ఎంతగా పరితపించిందో...
మరలి వచ్చేందుకది అరణ్యవాసమో....
అజ్ఞాత వాసమో కాదే
వధ్యశిలా పాన్పుపై శాశ్వత నిద్ర ఎవరికిష్టం....*



*తనకు తెలుసు ..
కౌరవ సైన్యంలా ఆర్ద్రత లేని
గుండెలు..మనసు గాయాల్ని..
తడమని చేతులు..
ఎన్నుంటే ఏం లాభమని..*

*అయినా..సరే..
ఆ బాధల్నేవో పోల్చుకుని..
అనువదించు కోమని..
విద్యార్థుల.. అన్నదాతల..
జీవితాల్తో..
చెలగాటాలాపేయమని..
ఆఖరి కోరిక నివేదిస్తూ...* ♦

---

దాకా వెళతాం. ప్రేమించనందుకు ఒకడు యాసిడ్ పోస్తే ప్రేమించి పెళ్లి చేసుకున్నందుకు కన్నవాడే కడతేరుస్తాడు. కాప్ పంచాయితీలు పెట్టి ఇష్టానుసారం శిక్షలు వేస్తారు. దాన్ని అడ్డుకోవడానికి బిల్లు తేవాలంటే భయం. కులాలు దూరమవుతాయని. ఇప్పుడు కూడా అనర్గళ ప్రసంగాలు చేయగల ముఖ్యమంత్రి ఈ ఘాతుకాలపై పెదవి మెదపరు. పరివారంలో ఎవరూ పరామర్శించరు. కెటిఆర్ ట్వీట్ చేయగా పొరుగురాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రం ఖండించారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ రాసినట్టు ప్రధానంగా ప్రజాసంఘాలూ అభ్యుదయ వాదులూ తప్ప 'మహా'నేతలెవరూ అటువైపు చూసింది లేదు. సాధుసంతులు తొంగిచూడరు.

కులాల అంతరాలు, ధనం అంతస్తులు పెరుగుతున్న విద్యావిజ్ఞానాలు, స్వేచ్ఛాయుత కదలికలూ, సామాజిక చలనాలు పాత వ్యవస్థలను సవాలు చేయడం అనివార్యం. కుటుంబాలలోనే డజన్ల కొద్దీ కులాంతర వివాహాలు చూడటం అందరికీ అనుభవమే. నిజమైన నిలకడైన ప్రేమ వున్న చోట అక్షింతలు వేసి ఆశీర్వదించడం పెద్దల బాధ్యత తప్ప ప్రాణాలు తీస్తే ప్రతిష్ట నిలవదు. ప్రేమోన్మాదులన్న మాట ఎంత తప్పో వీటిని పరువు హత్యలనడం కూడా అంతే తప్పు. ప్రేమ ఏదైనా ప్రాణాలు బలికోరదు. ఏ యుగంలో ఎందరిని బలితీసుకున్నా ప్రేమ అంతరించదు. అది జీవలక్షణం. వెలిప్రేమ అనడమే గాని ప్రేమను ఎవరూ వెలివేయలేరు. కులాహంకారాలను ప్రేమే రాజ్యాంగ బద్ధంగా మానవీయంగా వెలివేస్తుంది. అందుకే అనాలి– హే మొహబ్బత్ జిందాబాద్. **(ఆంధ్రజ్యోతి గమనం– 21.9.18 సౌజన్యంతో).**

*ఈ వ్యాసం బాగుందంటూనే కొందరు తలిదండ్రుల పట్ల ప్రేమ గౌరవాలు ముఖ్యమనీ, పిల్లల ఆర్థిక భద్రత వారు కోరుకుంటారని ఏవేవో వ్యాఖ్యలు చేశారు. మొత్తం సందర్భం చూడకుండా ప్రణయ్‌కి విగ్రహం పెట్టాలా వద్దా అని చర్చలు చేసిన ప్రముఖులున్నారు. సోషల్ మీడియాలో మరింత భయానకమైన దారుణమైన వ్యాఖ్యలు భర్తను కోల్పోయిన అమృతపై అసభ్య పోస్టులు కనిపిస్తున్నాయి. వీటిలో చాలా భాగానికి వ్యాసంలోనే సమాధానాలున్నాయి. మరోసారి చెప్పాలంటే– తలిదండ్రులను గౌరవించడం వేరు, వారిలోని కుల దురహంకారాన్ని కాపాడటం వేరు. కూతురు చేసుకున్న కుర్రవాణ్ని కరకు కత్తులతో చంపించిన వ్యక్తిని తండ్రిగా గౌరవించాలని చెప్పడం కన్నా దారుణం వుండదు. భర్తను కోల్పోయిన ఆ యువతి బాధలో పాలుపంచుకోకపోయినా విష ప్రచారాలు చేయడం ఆమెను హత్య చేయడం కన్నా ఘోరం. చివరగా ఒకే మాట నిజమైన ప్రేమ మోసంచేయదు. నిజమైన పెద్దలెవరూ బిడ్డలను హత్యలు చేయించరు.*

**- తెర**

# అధికారం, ఆప్యాయతల మధ్య నలిగిన 'ఆమ్రపాలి'



- దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు
9493033534

ఆమ్రపాలి కథ రసభరితం. ఈ కథ సినిమాలుగా కూడా తీశారు. ఇంకా తీస్తున్నారు. ఆ కథలో అంత ఆకర్షించిన అంశాలేమిటి? ఇలా ఆలోచిస్తూ మన తెలుగులో ఎవరైనా ఆమ్రపాలి కథను రాశారా? అనుకుంటూ చూశాను. తెలుగులో చాలామంది బౌద్ధ మతేతివృత్తంతో వివిధ కావ్యాలను రాశారు.

గౌతమబుద్ధుని బోధనలకు ఆకర్షితులైన వాళ్ళలో వేశ్యలు కూడా ఉన్నారు. వేశ్యగా మారడానికి కారణాలెన్ని ఉన్నా, మరలా సాధారణ స్త్రీగా ఆమె తన జీవితాన్ని గడపాలనుకుంటే, ఈ సమాజం ఎంతవరకూ అంగీకరిస్తుందనేది ఒక పెద్ద ప్రశ్న! ఆ ప్రశ్నకు సరైన సమాధానమే బుద్ధుడు ఆమ్రపాలిని బౌద్ధమతంలోకి ఆహ్వానించడం. హిందూమతంలో అనాచారాలుగా కనిపించే చాలా వాటిని సంస్కరించే ప్రయత్నం బౌద్ధంలో కనిపిస్తుంది. సమాజ నిరాదరణకు గురయిన వాళ్ళనెంతోమందిని దరి చేర్చుకొని, తక్కువ కాలంలోనే విస్తృతంగా వ్యాపించ గలిగింది. సామాజిక నిర్బంధాల కారణంగా గణభోగ్యగా మారిన ఆమ్రపాలి కథ ఇంచుమించు అన్ని భారతీయ భాషలలోను ఎంతో ప్రాచుర్యం పొందింది. తెలుగులో చాలామంది ఈ కథను రాశారు. ఈ వ్యాసంలో ఇద్దరు రాసిన కావ్యాలను, మరొకరు రాసిన నవలను తీసుకొని, ఆ కథను ఆయా రచయితలు ఎలా తీర్చిదిద్దారో పరిశీలించే ప్రయత్నం చేస్తాను.

'ఆమ్రపాలి' బౌద్ధ జాతక కథను యస్.టి.జ్ఞానానంద కవి ఎనిమిది ఆశ్వాసాలుగాను, కరటూరి సత్యనారాయణ ఏడు సర్గలుగాను విభజించి 'ఆమ్రపాలి' అనే పేర్లతో కావ్యాలుగా రాశారు. జ్ఞానానందకవి శాంతాన్నీ, కరటూరి 'కరుణ'ను ప్రధాన రసాలుగా పోషించారు.

ఇరువురు కవులూ ఆమ్రవనంలో 'ఆమ్రపాలి' అనాథగానే దొరికినట్లు పేర్కొన్నారు. లల్లాదేవి మాత్రం పూర్తి భిన్నంగా కథను సామాజిక అంశాలతో పరిశీలించి రచించారు. ఆమ్రపాలి అసలు పేరు 'ఉదాయి'గా మార్పు చేసి, ఆమ్రవనంలో నివసించటం వల్ల 'ఆమ్రపాలి'గా మారినట్లు, ఆ పిల్ల పుట్టిన తరువాత తల్లిదండ్రులు చనిపోయినట్లు లల్లాదేవి మార్పులు చేశారు.

యస్.టి. జ్ఞానానందకవి తన కావ్యంలో పిల్లలు లేని మహానామునికి (శాక్య ధనికునికి) 'ఆమ్రపాలి' దొరకగా, కరటూరి కావ్యంలో ఆనందుడనే కొడుకు కలిగిన శాక్యధనికునికి ఆ పసిపిల్ల దొరికినట్లు చిత్రించారు.

ఆడపిల్ల పెళ్ళీడుకొస్తుంటే, పెళ్ళి చేయాలనే తపన

తండ్రికి ఎలా పెరుగుతుందో అది జ్ఞానానందకవి కావ్యంలో బాగా కనిపిస్తుంది. కానీ, కరటూరి, 'తండ్రి రాజ్య నిర్వహణా భారంలో పడి కూతురికి వివాహం చేయటం మరచిపోయినట్లు రాశారు. ఇటువంటి ప్రయత్నమేదీ లల్లాదేవి నవలలో కనిపించలేదు. ఆమ్రపాలి తండ్రి లిచ్ఛవుల మనస్తత్వాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారి వల్ల కూతురికి ఏ ముప్పు వాటిల్లుతుందోననే భయంతో ఉండేవాడనీ, కనుక సరియైన సమయంలో తగిన వరుణ్ణి చూసి వివాహం చేయాలని భావించి స్వయంవర సభను ఏర్పాటు చేసినట్లు జ్ఞానానందకవి వివరించారు.

గణతంత్ర రాజ్యాలలో అందమైన యువతి కనిపిస్తే, ఆ దేశ పాలకులు గణభోగ్యగా చేసుకొనే ఆచారం ఉంది. శాక్యధనికుడు గణతంత్ర రాజ్యానికి చక్రవర్తి అయినా, పాలకులంతా ఏకమయి తీర్మానిస్తే తన కూతురినయినా గణభోగ్యగా చేయవలసిందే! కానీ, 'స్వయంవరం' అనే ఒక సంప్రదాయం మాత్రం ఉంది. స్వయంవరంలో యువతికి నచ్చిన యువరాజుని పెళ్ళి చేసుకొనే స్వేచ్ఛ ఉన్నా, అది గణనాయకుడైన చక్రవర్తి చేతిలో ఉండదు. గణరాజ్యాలలో ఒక గణ పరిషత్తు ఉంటుంది. విధి, విధానాలను అన్నింటినీ ఆ గణపరిషత్తే నిర్ణయిస్తుంది.

అందుకనే స్వయంవర సభలో గణపరిషత్తులో సభ్యులైన లిచ్ఛవ రాజులు అందగత్తె అయిన ఆమ్రపాలి తమకే చెందాలని, ఇతరులకు చెందకూడదనీ పట్టుపడతారు. గణనాయకుడైన శాక్యధనికుణ్ణి, లిచ్ఛవులు తమ అభిప్రాయం ప్రకారం జరగకపోతే తీవ్ర పరిణామాలు ఎదురౌతాయని హెచ్చరిస్తారు. గణనాయకుడైనా తండ్రికి నామమాత్రమైన అధికారాలే ఉన్నాయని ఆ పరిస్థితిని గమనించి సభలోనే ఉన్న ఆమ్రపాలి 'గణభోగ్య'గా ఉండటానికి అంగీకరిస్తుంది. అందుకుగాను కొన్ని నియమ నిబంధనలను విధిస్తుంది. తండ్రితోపాటు మొదటినుండీ సభల్లోనూ, రాచకార్యాల్లోనూ ఆమ్రపాలి పాల్గొన్నట్లు జాగ్రత్తపడ్డారు జ్ఞానానంద కవి.

లిచ్ఛవుల్లో 'అభయుడు' అనే బలవంతుడైన మూర్ఖుడు ఆమ్రపాలి పట్ల వ్యామోహం పెంచుకుని, లిచ్ఛవులను రెచ్చగొట్టి, ఆమ్రపాలికి పెళ్ళి చేయకపోవటం వల్లనే రాకుమారులు రాజ్యంలో అశాంతిని సృష్టిస్తూ, ఒకరినొకరు చంపుకుంటున్నారని రాజైన శాక్యధనికునికి నివేదించినట్లు కరటూరి వర్ణించారు.

సభలో మహానాముడిని 'గణభోగ్య'గా ఆమ్రపాలిని చేయమని పట్టుపట్టడంతో తనకో ధర్మం, పరులకో ధర్మం పని చేయదని లిచ్ఛవులు రాజుని వ్యతిరేకించటం వల్ల మహానాముడే ఆమ్రపాలిని, ఆమె అంగీకారాన్ని కూడా తెలుసుకోకుండా 'గణభోగ్య'గా ప్రకటించాడు. ఆ విషయాన్ని, కూతురైన ఆమ్రపాలికి చెప్పటానికి బాధాతప్త హృదయుడై ఆమె భవనానికి వెళతాడు. వెళ్ళి కూడా అక్కడే మాట్లాడకుండా కూర్చుండిపోతాడు. తండ్రిని చూసి, ఆమ్రపాలి బింబిసారుని వల్ల మోసగింపబడిన విషయం ఎక్కడ తెలిసిపోయిందోనని, అందుకే ఎంతో ప్రేమగా పిలిచి ఆదరించే తండ్రి తాను చేసిన పనికి బాధపడుతున్నాడనుకొంటుంది. ఈ సన్నివేశం చక్కని నాటకీయతతో సాగింది. జరిగిన విషయాన్ని అంతటినీ తండ్రికి చెప్పేసి, శత్రురాజైన బింబిసారుడని తెలియదనీ, దేశద్రోహం చేయననీ, క్షమించమనీ ప్రాధేయపడుతుంది.

తండ్రి ఆమ్రపాలిని సముదాయించి, అనివార్యమైన పరిస్థితుల్లో గణభోగ్యగా చేయవలసి వచ్చిందని, సభా విషయాలను ఆమెకు తెలుపుతాడు. ఆ సందర్భంలోనే ఆమ్రపాలి తనకు ఆమ్రవనంలో దొరికిందనీ, స్వంత కుమారుడైన ఆనందుడినీ నిన్నూ ఒకేలా పెంచాననీ చెపుతాడు.

తెలిసిన విషయాలు ఇరువురికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఆమ్రపాలి దేశభక్తి (దేశంలో అల్లకల్లోలాలను ఆపడం కూడా దేశభక్తిగానే భావిస్తుంది.) దేశం కోసం దేనికైనా సిద్ధమవుతాననీ, బింబిసారుని చేతిలో మోసపోయినందుకు క్షమించమని అడుగుతుంది.

ఇది జరిగిన తర్వాత కూతురు గురించి బెంగ పెట్టుకొని తండ్రి కొన్నాళ్ళకు చనిపోతాడు. ఆనందుడు బౌద్ధ సన్యాసిగా మారిపోతాడు. ఆమ్రపాలికి పుట్టిన కొడుకు 'విమలకొండ'ను వేశ్య బిడ్డగా సమాజం గౌరవించదని ఆనందుడు చెప్పటం వల్ల బౌద్ధ సంఘంలో చేరటానికి తల్లి అంగీకరిస్తుంది. కానీ కొడుకు పట్ల పుత్ర వాత్సల్యం వీడలేకపోతుంది. ఏదో ఒక నెపంతో పుత్రుణ్ణి చూడాలనే బుద్ధుని దగ్గరకు వెళ్ళి, బుద్ధుణ్ణి, 'కొడుకుని తల్లి నుండి విడదీయడం ధర్మమేనా?' అని నిలదీస్తుంది. బుద్ధుడు జీవిత సత్యాన్ని, దుఃఖ నివారణను చెప్పటం వల్ల ఆమె బౌద్ధ సంఘంలో చేరగలుగుతుంది.

లల్లాదేవి రాసిన 'ఆమ్రపాలి' నవలలో కథను పరిశీలిస్తే 'ఉదాయి'కి తల్లిదండ్రులు చనిపోవడంతో, వైశాలినీ రాజ్యంలో

ఉన్న బంధువుల ఇంటికి మేనమామ ఆ పిల్లను తీసుకొని వెళుతుంటాడు. మార్గమధ్యంలో దొంగలబారిన పడటంతో మేనమామ చనిపోతాడు. భైరవుడనే మంచి దొంగ ఆ పసిపిల్లను చేరదీసి వైశాలినీ నగరానికి చేర్చి యశోదేవి దగ్గర విద్యాభ్యాసం కొనసాగేలా దోహదపడతాడు. గురువుగారి దగ్గర విద్యాభ్యాసం అభ్యసిస్తూ రాజుగారి అనుగ్రహం పొంది, వారి ఆదరణకు పాత్రమవుతుంది. ఆమె చేసిన నాట్యానికి మెచ్చి, నర్తకి పదవినిచ్చి ఒక ఆమ్రవనాన్ని కేటాయించి, దానిలో చక్కని భవనాన్ని నిర్మించాలని రాజు చేతనుడు ఆదేశిస్తాడు. ఆమె ఆమ్రవనంలో ఉండటం వల్ల 'ఆమ్రపాలిక'గా, తర్వాత 'ఆమ్రపాలి'గా పిలువబడుతుంది.

భవన నిర్మాణానికి వినియోగించిన శిల్పులలో లౌకిక విషయాలను పట్టించుకోని 'ఉదయునుడు' అనే శిల్పి ఏకాగ్రతతతో శిల్పాలను చెక్కుతుంటాడు. అతని శిల్ప నైపుణ్యాన్ని ఆమ్రపాలి అభిమానిస్తుంది. అతని దగ్గరే ఎక్కువసేపు గడుపుతుండేది. ఆమె కూర్చున్న భంగిమను ఒకసారి 'ఉదయుడు' చూసి చక్కని శిల్పాన్ని చెక్కుతాడు. ఆ శిల్పంతోపాటు, బుద్ధుని ప్రశాంతమైన విగ్రహాన్ని కూడా ఆమెకు బహూకరిస్తాడు. ఉదయునుడి పట్ల ఆసక్తిని పెంచుకోవడం గమనించిన రాజు ఆ శిల్పిని మరొక చోటికి పంపాలనుకొంటాడు. ఉదయునుడు ఒక స్వేచ్ఛాజీవి. ఎవరి నియమ నిబంధనలకు తలొగ్గనివాడు. రాజుగారి ఆజ్ఞ ప్రకారం మరోచోటికి శిల్పాలను చెక్కటానికి వెళ్ళమంటే ఇష్టపడక ఆ రాజ్యమే వదిలిపోతాడు.

బుద్ధుని ప్రశాంతమైన శిల్పాన్ని చూస్తూ బుద్ధుని గురించి, అతని ఆశయాలు, ధర్మాలను గురువుగారి సహాయంతో తెలుసుకొని, బుద్ధుణ్ణి దర్శించాలని తహతహలాడుతుంటుంది ఆమ్రపాలి. అదే సమయంలో ఒక బౌద్ధ భిక్షువు ఆ రాజ్యం వచ్చాడని తెలిసి తన భిక్షను స్వీకరించమని ప్రార్థిస్తుంది. ఆ బౌద్ధ భిక్షువు మొదట అంగీకరించి ఆమె ఇంటికి వెళ్ళి భిక్షను స్వీకరించాలనుకొంటాడు. అంతలో ఒక ధనస్వామి అనే ధనవంతుడు ఆ విషయాన్ని తెలుసుకొని ఆ బౌద్ధ భిక్షువుతో, 'ఆమె ఒక వేశ్య' అనీ, ఆ భిక్షను స్వీకరించవద్దనీ, మా ధనవంతుల దగ్గర స్వీకరించమనీ చెపుతాడు. ఆ బౌద్ధ సన్యాసి వెంటనే ఆమె పెట్టే భిక్షను తిరస్కరిస్తాడు. దానితో ఆమె ఎంతో బాధపడుతుంది. వేశ్య అంటే ఏమిటో, ఆ జీవితం ఎలా ఉంటుందో అని ఆలోచిస్తూ, తనకి తెలియకుండానే ఒక వేశ్యావాడలోని ఒక ఇంటికి నడుచుకుంటూ వెళ్ళిపోతుంది. అక్కడ 'ఆమ్రపాలి'ని కొంతమంది పట్టుకొని వేశ్యగా ముద్రవేసి, రాజు చేత ఆమెను నర్తకి పదవి నుండి తప్పించి, రాజ్య బహిష్కార శిక్ష వేస్తారు. బుద్ధుడు ఆ నగరం వచ్చేవరకూ ఏ తిండీ బట్టా పట్టించుకోకుండా నిరీక్షించి, బుద్ధుని కరుణ వల్ల బౌద్ధ సన్యాసినిగా మారటంతో కథ ముగుస్తుంది.

ముగ్గురు రచయితలూ మూడు విధాలుగా 'ఆమ్రపాలి' కథను తీర్చిదిద్దారు.

జ్ఞానానందకవి తండ్రి పాత్రను పోషించటంలో ఔన్నత్యాన్ని, నైతిక విలువలను పాటిస్తూ సమయోచితంగా, సందర్భోచితంగా వర్ణించినట్లు అవగతమవుతుంది. దీనికి ముందు నుండే కథను చక్కని ప్రణాళిక వేసుకొన్నారనిపిస్తుంది. రాచకార్యాల్లో పాల్గొనడం, ఆమ్రపాలికి ఏర్పాటుచేసిన 'స్వయంవర సభ'లోనే గణభోగ్య నిర్ణయం జరిగినట్లూ రాశారు.

కరటూరి కావ్యంలో అప్పటికే తప్పు చేసి ఉండటం వల్ల, తండ్రి అప్పటికే ఆమెను గణభోగ్యగా అంగీకరించటం వల్ల 'గణభోగ్య'గా ఆమె అంగీకరిస్తూ, పైకి దేశభక్తి పూత పూసినట్లు అనుకోవడానికి అవకాశం కలుగుతుంది. కానీ, కావ్యాన్ని చదువుతున్న పాఠకునికి ఆ నాటకీయత అబ్బురపరుస్తుంది.

జ్ఞానానందకవీ, కరటూరి వారూ ఇద్దరూ కూడా 'ఆమ్రపాలి' గణభోగ్యగా మారిన తర్వాత తండ్రి పాత్రను బాగా చిత్రించారు. జ్ఞానానందకవి, ఆమ్రపాలి తండ్రి పాత్రను కావ్యంలో మరలా ప్రవేశపెట్టకుండానూ, కరటూరి, ఆమ్రపాలి తండ్రి బెంగ పెట్టుకొని మరణించినట్లు బాగా రాశారు. జ్ఞానానందకవి 'ఆమ్రపాలి' గణభోగ్యగా మారిన తర్వాత కథను ఆమె నుండే చూశారు. పెంచిన తల్లిదండ్రుల కోణం నుంచి చూడలేదు. ఇది చక్కని కథన శిల్పం.

లల్లాదేవి నవలలో 'ఆమ్రపాలి' వేశ్యగా ముద్ర వేయబడుతుంది. ఆమెకు తెలియకుండానే వేశ్యావాడకు పోతుంది. అక్కడకొంతమంది యువకులు ఆమెను నిర్బంధించి వేశ్యగా మార్చినట్లు రాశారు. అక్కడ వేశ్య జీవితచిత్రణను వర్ణించటంలో లల్లాదేవి పరిశీలన చక్కగా వ్యక్తమవుతుంది. దొంగల గుంపుకి దొరికిన ఉదాయి అడవిలో పాడుపడిన దేవాలయం మీద ఉన్న నాట్యభంగిమలను చూసి, ఆమె నాట్యాన్ని అభ్యసించాలనుకొన్నది. సాధన వలన నాట్యాన్ని సాధించింది. ఆ నాట్యమే ఆమ్రవనాన్ని, నర్తకి పదవిని వచ్చేలా

చేసింది. అదే ఆమెను 'వేశ్య'గా అనుమానించేలా చేసింది. ఆ అనుమానంలో నుండి వచ్చిన అవమానమే ఆమెను బౌద్ధభిక్షువుగా మార్చి, సన్మార్గం వైపు పోయేటట్లు చేసింది.

యస్.టి. జ్ఞానానందకవి 'ఆమ్రపాలి' బింబిసారుణ్ణి ప్రేమించింది. బింబిసారుడూ ఆమెను కోరుకున్నాడు. తర్వాత ఇరువురిలో ఎవరిని ఎవరూ ద్వేషించుకోలేదు. బింబిసారుడు మాత్రం ఆరురోజులు ఆమె భవనంలో ఉండి, దొంగచాటుగా వచ్చిన అతని రాకను లిచ్ఛవులు పసికట్టడం, అతడిని జాగ్రత్తగా దాచటం, ఆమెను విడిచి వెళ్ళిపోయేటపుడు ఒక ఉంగరాన్ని ఇవ్వటం, ఒకవేళ కొడుకు పుడితే, ఉంగరమిచ్చి పంపమని చెప్పి వెళ్ళిపోతాడు. తన కోసం చిత్రించిన చిత్రపటంలో బింబిసారుణ్ణి ఆకర్షించి, ఆలోచిస్తుండగా చెలికత్తె ఆమె హృదయాన్ని పసిగట్టడం, రాయబారం నడపడం వంటివన్నీ చేస్తుంది. బింబిసారుని పాత్రను కావాలనే కావ్యనాయకునిగా, కవి తీర్చిదిద్దలేదేమో ననిపిస్తుంది. ఆమెను బింబిసారుడు అనుభవించటానికే ప్రయత్నించినట్లు తేలుతుంది. అయితే ఉంగరాన్ని ఇచ్చి, కొడుకు పుడితే, ఉంగరం చూపితే తన పుత్రునిగా స్వీకరిస్తానని చెప్పటం అతని స్వభావాన్ని తేటపరిచే విషయాలుగా గమనించే వీలుంది.

'గణభోగ్య'గా జీవితాన్ని గడుపుతున్న ఆమ్రపాలి తనలో తాను తీవ్ర సంఘర్షణకు లోనై ఒకసారి తాను దొరికిన ఆమ్రవనానికి ప్రశాంతత కోసం రావటంతో, అక్కడ తొలిసారిగా బుద్ధుని దర్శనమవుతుంది. ఆనాటి నుండే ఆమెలో బుద్ధుని ప్రవచనాలు లౌకిక విషయాల పట్ల కోరికను తగ్గించి, అలౌకిక విషయాల పట్ల ఆసక్తిని కలిగిస్తాయి. బుద్ధుని రాక కోసం నిరీక్షిస్తూ, తీరా బుద్ధునికి భిక్షను పెట్టాలని ప్రయత్నించినపుడు ఆ నగరంలోని ధనవంతులు వ్యతిరేకిస్తారు. బుద్ధుని దర్శనాన్నీ బుద్ధుని శిష్యుడు అడ్డుకుంటాడు. కానీ బుద్ధుని జోక్యం వల్ల ఆమెకు అతని దర్శనం కలుగుతుంది. బుద్ధునికి భిక్షను పెట్టి, తన సర్వవిద్యలనూ బౌద్ధ సంఘ వ్యాప్తికే వినియోగిస్తూ జీవితాన్ని గడపాలని నిర్ణయించుకొంటుంది.

జ్ఞానానందకవి 'ఆమ్రపాలి' కావ్యాన్ని చారిత్రక తత్త్వకావ్య లక్షణాలతో చక్కగా అన్వయించే ప్రయత్నం చేశారు. బుద్ధుని బోధనలు అడుగడుగునా కన్పిస్తుంటాయి. మరో విశేషమేమంటే, ఈ కావ్యంలో అన్ని పాత్రలూ ఆమ్రపాలి వైపు నడవగా, ఆమ్రపాలి బుద్ధుని ధర్మాలవైపు, బుద్ధుని వైపు పయనిస్తుంది. బౌద్ధమతంలోని ఆర్యసత్యాలనూ, త్రిరత్నాలనూ, అష్టాంగమార్గాన్ని కావ్యానికి అన్వయించి బౌద్ధ ధర్మేతిహాసంగా మలచగలిగారు.

జ్ఞానానందకవి 'ఆమ్రపాలి' కావ్యంలో మరికొన్ని విశేషాలు ఉన్నాయి. ఆమ్రపాలి గణభోగ్యగా జీవితాన్ని గడుపుతూ మానసిక ప్రశాంతత కోల్పోయి, సంఘర్షణ పడుతూ, తీవ్రవ్యథకు లోనై గుండెల్లో దుఃఖాన్ని పోగొట్టుకోవాలని తాను దొరికిన ఆమ్రవనంలోకి వస్తుంది. కరుణ హృదయుడైన బుద్ధుడు అక్కడ తపస్సు చేసుకుంటూ కనిపిస్తాడు. అతడిని ఆమె ఎవరో ముని అనుకొని ఆమెలో తీరని కోరికను నర్మగర్భితంగా వ్యక్తీకరించి అతనిని తన ఇంటికి రమ్మనమనీ, సర్వసౌఖ్యాలనూ సమకూరుస్తానంటుంది. బుద్ధుడు ఆమె మనోవాంఛను గమనిస్తాడు. చాలా మృదువుగా, ప్రశాంతంగా, జీవిత సత్యాలను వివరిస్తాడు. అంతేకాక ఆమె బౌద్ధ భిక్షువుగా మారిన తరువాత ఆమెతోపాటు బౌద్ధారామానికి వచ్చిన మిగిలిన ప్రజలకు నాలుగు ఆర్యసత్యాలను వివరిస్తాడు.

బౌద్ధధర్మ మూలసూత్రాలలో సర్వమూ క్షణికమనేది ఒక మూల సూత్రం. ఇది ప్రపంచం దుఃఖమయమనే దాన్ని స్పష్టం చేస్తుంది. పుట్టిన ప్రతివారికీ మరణం తప్పదు. అయినా ఆశలు పెంచుకుంటారు. ప్రపంచంలో దుఃఖం లేకపోవటంగాని, పుట్టిన జీవి మరణించకపోవటమనేది కనిపిస్తే ఎంతో సంతోషం కదా! అని బుద్ధుడు చెబుతాడు. మానవుని శరీరం వయః పరిణామాన్ని అనుసరించి క్షణక్షణం మారుతూ మట్టిలో కలిసిపోతుందనే విషయాన్ని కవి 'నాల్గు దశల మధ్య నవయుచు నున్నటి' అని వర్ణించారు. దృశ్యమాన ప్రపంచంలోని సర్వమూ అనిత్యమేనని దానివల్ల తెలుస్తుంది.

దుఃఖానికి కారణం కోరికలు అనేది బుద్ధుడు బోధించిన నాలుగు ఆర్య సత్యాల్లో రెండవది. ఇంద్రియాలకు ప్రియమైన విషయ సంపర్కం, వాటి స్మృతి, కోరిక(తృష్ణ)లకు కారణమవుతుంది. ఆ కోరికలు పూర్తి కాగా త్యజించ గలిగినపుడు దుఃఖం నివారింపబడుతుంది. ఇది మూడవ ఆర్యసత్యం.

ఆమ్రపాలి ఎన్నో కోర్కెలతో రగిలిపోతూనే బుద్ధుని ప్రథమ దర్శనం చేసుకొన్నది. బుద్ధుడు జీవితం క్షణికమైనదనే జీవిత సత్యాన్ని బోధించడం, తన తపస్సు పూర్తయిన తరువాత భిక్షను స్వీకరించటానికి వస్తానని చెప్పి పంపితే బుద్ధుని పునరాగమనం వరకూ భిక్షను సమర్పించటానికి

## కవిత

# ప్రెస్ క్లబ్, అనంతపురం

- ఈడుగ రాఘవేంద్ర
9494074022



ఒంటరిగాయం మాన్పుకున్న
సందర్భాలు అనేకం అక్కడే

నగరం మధ్యలో
ఒక వెలుతురువాక్యం

అక్కడి మాటలు
చెవికందే దూరంలోనే
మా ఆర్ట్స్ కళాశాల వసతిగృహం
డిగ్రీ చదువుతున్న రోజులవి

గుప్పుమన్న అక్షరాల వాసన
అలలై అడుగులెత్తిన పరిమళాలదండు
తడితడిగా గుండెలను తాకేవి

అటుగావెళ్లిన ప్రతీసారి
అక్షరాలు నీడలు పరుచుకొని
నావైపు తదేకంగా చూసేవి

పోగేసిన అక్షరాల్ని తోడుకొమ్మని
నన్ను సెలయేరును చేసి
అది నదిలా గుండె తలుపులు తెరిచేది
ఒక ప్రాక్తనా గీతమై ఆలపించేది

♦

ఒకటి మాత్రం నిజం
నేనక్కడ అడుగుపెట్టిన తొలి రోజు
నా మనోపతాకం కదిలిక చప్పుడు
మోహం నిండా రెప రెపలాడిన క్షణం
ఇప్పటికీ గుర్తు

కాలేజీకి వెళ్లేముందు
రెక్కలు కట్టుకున్న సీతాకోకచిలుకల్లా
అక్కడ ఉదయించి
దినపత్రికల్లో తలదూర్చి
వర్తమాన తూనీగల్ని
అతికించుకొనేవాళ్ళం

క్రికెట్ మ్యాచ్ వచ్చిందో
కాళ్ళను వేర్లను చేసి
గుమ్మంలో పాతుకుపోయేవాళ్ళం

♦

అది
అద్దం లాంటి కాలం
సాహిత్య శబ్దం నాలోకి పాదులు కట్టి
నాకో కొత్త పుట్టుక నిచ్చిన వేదిక
గుండె పెదాలకు కవిత్వపదాలల్లిన
మల్లె తీగ
ముక్కలైన స్వాభిమానాన్ని ప్రతీసారి
కూడదీసిన పందిరి

♦

చదువులతో పాటే
కాలం వేగంగా అడుగులు వేసింది

♦

ఇప్పుడు
ఉద్యోగరీత్యా సుదూరంగా వున్నా...
అప్పుడప్పుడు
నగరంలో అడుగిడిన ప్రతీక్షణం
గుండె వెనుక ఉద్వేగమేదో
పిలిచినట్లుంటుంది.

♦

---

ఎదురుచూస్తూనే ఉంది. అప్పటికి ఆమెలో కోరికలు నశించిపోయాయి. తాత్కాలికమైన లౌకిక భోగాల నుండి శాశ్వతమైన విముక్తి మార్గానికి సిద్ధమై ఉంది. దీనికంతటికీ కారణం ఆమెలో వివాహం చేసుకోవాలనీ, సర్వసౌఖ్యాలను అనుభవించాలనీ ఉన్న కోర్కెలన్నీ నశించటమే. కొడుకుని, తండ్రిని, సర్వస్వాన్నీ వదిలి బుద్ధుని శిష్యగణంలో చేరిపోతుంది. ఆమె దుఃఖం నుండి విముక్తి పొందుతుంది. ఈ విధంగా చారిత్రక తత్వ కావ్యంగా జ్ఞానానందకవి 'ఆమ్రపాలి' కావ్యాన్ని తీర్చిదిద్దారు.

బుద్ధుని బోధనలు సమాజం మీద ఎంత ప్రభావాన్ని చూపాయనేది తెలియజేసే కథలు ఎన్నో వస్తున్న నేపథ్యంలోనే 'ఆమ్రపాలి' కావ్యాలు, నాటకాలు, నవలలు కూడా వెలువడ్డాయి. మానవ విలువలను, మానవ సంబంధాలను పటిష్టపరచడంలో బౌద్ధేతివృత్త కావ్యాలు చాలావరకూ తోడ్పడ్డాయి. అలా నిరూపించే బౌద్ధజాతక కథలలో ఆమ్రపాలి కథ ఉత్తమమోత్తమ కథ. ఇంకా చాలామంది తెలుగు రచయితలు కూడా ఆమ్రపాలి కథను తీసుకొని వివిధ ప్రక్రియలలో రచనలు చేసినవారు ఉండవచ్చు. ♦




# సంఘాల పంతులు

**సురవరం ప్రతాపరెడ్డి**

అది కృష్ణాతీరము పల్నాటి సరిహద్దు. నిజాం ఇలాకా గ్రామము, పేరు రామసాగరం. ఆ గ్రామములో సుమారు 500 ఇండ్లు; 30 వర్తకులవి, 80 కాపువారివి, 100 మాదిగవారివి, తక్కినవి ఇతర జాతులవి. ఆ వూర్లో సర్కారీ నాకా (**Police station**) వున్నది; 12 మంది జవానులు, జవాను జవానుకు ఒక గుర్రము, ఒక అమీన్, ఒక జమేదారు. అమీనుకు రెండు పెద్ద గుర్రాలు. అమీనుకచ్చేరీ పక్కనే ఆమీనిల్లు. పోలీసువా రెన్నడున్ను చేతినుండి పైకమిచ్చి వస్తువులు కొనేది యెరుగరు పాపము! వెట్టికి మాదిగలున్నారు. సప్లైకి కోమట్లున్నారు. అయితే 30 కోమట్ల ఇండ్లలో వక్కడే దుకానుదారుడు. మిగిలినవారంతా స్వయంగా కృషి చేసుకొని బతికేవారు. అయితే యేం, వారి కులము కోమటికులం కాదా? ముప్పై ఇండ్ల వాండ్లంలా పోలీసువారికి కోరిందంతా సప్లై చేయవలసిందే. కోళ్లు, గుడ్లు, కట్టెలు మాదిగవాండ్ల జిమ్మా

♦♦♦

ఇట్లా వ్యవహారం మజాగా జరుగుతూవుంది. రైతు లొకరిలో వకరు లేరు. కృష్ణ అవతలి తీరము చూస్తారు. అది అంగ్రేజీ యిలాకా, అక్కడ జనులు సుఖంగా వున్నారు. ఏ యెట్టీ లేదు, ఏ దండుగలూ లేవు, ఏ తన్నులూ లేవు. కాని ఈ రామసాగరంవారు పెద్దలు సంపాదించిన భూములు, ఇల్లు, వాకిళ్లు, వృత్తులు వదులకొనిపోతే వారికిక జీవనమెట్లు?

ఒకనాడు ప్రొద్దున్నే ముసలిమాదిగది 70 ఏండ్లది చచ్చిందని వూరంతా వుడికిపోయింది. ఏం చస్తే? ముసలిదానికి చావు రాకూడదా అంటారేమో, ఆనాడు అమీన్‌పాబు పెండ్లాము. (ఆమెను బేగంసాహెబా అంటారా వూరి వారు) ముసలిదానిని వంటకు రేలకట్టెలమోపు తెమ్మన్నది. ముసలిది అడవంతా తిరిగింది. రేలకట్టెలు దొరకలేదు. తంగేడికట్టెలు కొట్టుకొన్నది. మోపు చేసుకొన్నది. బేగంసాహెబావద్దకి వచ్చేవరకు సాయంత్రమైనది. ప్రొద్దున్నుంచి కూడులేదు. ముసలిది ఎండకు కష్టించింది. మోపు తెచ్చి ఇంట్లో పడవేసింది. 'ఛినాల్, రేలకట్టె తీస్కోని రమ్మంటే ఇదేమి పుల్లల్ తెచ్చినావ్' అని డొక్కమీద నాలుగుతన్నులు తన్నింది. ముసలిది నీల్గింది. 'నికాలో ఈ పీనుగును' అంది బేగం. దాని శవాన్ని ఈడ్చి మాదిగగేర్లో పారేసినారు నలుగురు జవాన్లు.

♦♦♦

“లావ్ బాదం అక్రోట్ పిస్తా. కెవ్ లేదూ అంటావ్, హర్రామ్! ఏయ్‌రా నాలుగు జూతాలు'' అన్నాడు అమీనుసాహెబ్. వెంటనే వక జవాను తన హైద్రాబాదు జూతాను చేత బట్టి నాలుగు బదులు ఎనిమిది ‘ఏక్, దో’ అంటూ యెంచి పునుకమీద వాయించినాడు. కోమటికి కోపం వచ్చింది. ఏడ్పుకూడా వచ్చింది. ఏమిన్ని జవాబు లేదు. కోమట్లందరూ మాట్లాడుకున్నారు. కృష్ణ అవతలి అంగ్రేజి యిలాకానుండి వక కోమటిని పట్టుకొని వచ్చినారు. 1200 రూ. సాలీనా వానికి దుకాణము గుత్తాకిచ్చినారు. పోలీసు వారడిగినది ఇయ్యవలెను. వచ్చిన కొత్త కోమటి 2 నెలలు వ్యాపారం సాగించి లెక్క చూచుకునేవరకు 1000 రూపాయలు ఖర్చు అయిది. రాత్రిపూట యెవరికీ చెప్పకుండా కృష్ణా దాటుకున్నాడు. తుదకు పట్నమునుండి వక మార్వాడిని 1000కు మాట్లాడుకొని తెచ్చి గ్రామములో నిలిపినారు. వాడు వచ్చి నాలుగు నెలలైంది. ఇట్లే – పోరాడుతూ వున్నాడు.

♦♦♦

ఒకనాడు చీకటి వుండగానే పక్కవూరి నుండి బండి కట్టుకొని వక పెద్దమనిషి రామసాగరం వచ్చినాడు. వూరిబయట మాదిగవారి ఇండ్లు. ఎవడో ఎదురైనాడు. ఎంతపొద్దు అయుండవచ్చురా అన్నాడు పెద్దమనిషి “అప్పుడే కుక్కలు మొరిగినా యయ్యా! ఇంకా రెండు జాములు పొద్దుంది” అన్నాడు వాడు. “కుక్కలు మొరిగితే పొద్దెట్లు గుర్తుపడ్తుందిరా?” అన్నాడు పెద్దమనిషి. “అయ్యో, మా వూర్లో కోళ్ళన్నీ పోలీసువాళ్ళ ఫలారాలకే సరిపోయినవి. నెల్లాళ్లైంది. మావూర్లో కోళ్లు కూయవు. ఆ మారాజులు కుక్కలు తినరు. లేకపోతే అవికూడా మొరుగుతుండెనా! సామీ, మీ రేడికి పోతున్నారు?” అన్నాడు వాడు. “పటేలు పుల్లారెడ్డి యిల్లు ఎక్కడుంది?”

“ఈడ్నే వుందయ్యా! అదో అట్లా పొండి. వూరవాకిలి వద్దనే పెద్దది. రెండంతస్తుల దుండే, అదే రెడ్డిగారి యిల్లు, పోండి, మీరేమి ఆయనకు చుట్టాలా స్వామీ?”

ప్రొద్దున్నే వూరంతా తెలిసిపోయింది. ఎవరో పట్నంనుంచి సంఘాలపంతులు వచ్చినాడంటా అని. ఆయన ఎత్తైనమనిషి. మందంగా వున్నాడు. ఖద్దరు వేస్తాడు. వకీళ్ళలాగ రుమాలు కడ్తాడు. వెంట తోలు పెట్టె తెచ్చుకున్నాడు. దానినిండా పుస్తకాలు తెచ్చినాడు. పట్నంలో గొప్పగొప్ప వాళ్ళంతా ఆయనకు పరిచయమంట. మన కష్టాలన్నీ నివారిస్తాడంటా! మనపాలిటి దేవుడు వచ్చినాడురా అని అందరూ అనుకున్నారు. జనులకంతా యెన్నడు లేని ధైర్యము, ఉల్లాసము. ఇంటింటా అదే ముచ్చట. వూరంతా పెద్ద దేవర చేసినట్లు వుల్లాసముతో నిండిపోయింది. ఆవచ్చినాయన పేరేమో కాని అందరూ సంఘాలపంతులూ అనబట్టినారు. సాయంత్రం పటేలు ఇంట్లో మీటింగు. కోమట్లంతా వచ్చినారు. వారికి సంఘాలపంతులు ‘వర్తకస్వాతంత్ర్యము’ అనే పుస్తకాలు ఇచ్చినాడు. ‘మీరేమి మనుషులేనా? కృష్ణ అవతలితట్టు చూడండి. వారెట్లున్నారో, మీకెందుకు భయము? సర్కారువారు మిమ్ము రక్షించుటకా లేక భక్షించుటకా ఈ పోలీసులను పెట్టింది?” అని యేమేమో చెప్పినాడు. కోమట్లకు ధైర్యం వచ్చింది. ఒరే మనలో మనకు ఐకమత్యం లేనందున యీ గతి పట్టినాము. సరే అంటే సరే అన్నారు. వర్తక సంఘము స్థాపనైంది. అందరూ ‘నెంబర్లే’ 500 రూపాయలు నగదు వసూలు. మార్వాడీకి నోటీసు. యికముందు గుత్తా యిచ్చుట లేదు. మర్నాడే మార్వాడి! రూపాయికి 5 సేర్ల బియ్యం జవాను సాయెబు అన్నాడు “అరే నిన్న 15 సేర్లు. ఈవ్యాళ అయిదు సేర్లు. ఖబర్దార్ ” అన్నాడు. “ఖబర్దార్ లేదు గిబర్దార్ లేదు. ఈ వూర్లో సంఘము ఏర్పాటుందోయ్. సంఘాల పంతులు వచ్చినాడు. నీకూ తెలుసూ లేదూ” అన్నాడు మార్వాడి. “సంఘం! అరేమాకీ సంఘం! ఏమి సంఘం అచ్చా, చూస్తాం” అనుకొంటూ జవాన్లు పోయినారు.

♦♦♦

మర్నాడు ప్రొద్దున్నే సంఘాలపంతులు బహిర్భూమికి పోయివస్తున్నాడు. ఒక మాలది దూరంనుంచే సాష్టాంగ దండం చేసి గోడుగోడున యేడ్చింది.

“ఏం? ఏమికష్టం వచ్చింది చెప్పమ్మా!”

“అయ్యా! ఏమిచెప్పుదూ! నిన్న బేగముగారి పాయిఖానా బాగా సాపు చేయలేదని ఆమె మా అక్కకు చెంపమీద వాత వేసింది. మొన్న జమాదారు మా ఆయనను బాగా కాళ్ళొత్తలేదని డొక్కమీద తన్నినాడు. ఇంకా మంచం పట్టినాడాయన మేము బదుకలేము. మాగతేమి?”

“సరే, ఇవాళ సాయంత్రము మీపల్లెలోని మందిని అందరినీ పిలుచుకొని వూరుముందుండే రాగిచెట్టు కిందికి రమ్మను. నేను వచ్చి అంతా ఏర్పాటు చేస్తాను.

“సరే, మీరే మా దైవము, మీరే నారాయణమూర్తి నాయనా, చల్లగా నూరేండ్లు బ్రతుకు” అంటూ ఆ 50 ఏండ్ల మాలెత దండాలు పెడ్తూ దీవనలిస్తూ పోయింది.

సాయంత్రము అయిదారునూర్ల మంది జమా అయినారు వూరిముందు. సంఘాలపంతులు వారి కందరికీ వెట్టిచాకిరీ

తత్త్వము బోధించినాడు. ఫర్మానులు వినిపించినాడు. కూలి ఇయ్యనిది వెట్టి చేయకూడదని చెప్పినాడు ఇట్లా చెప్తూతూ వుండగానే అమీన్‌సాబు గుఱ్ఱమెక్కి ఎనిమిదిమంది జవాన్ల వెంటబెట్టుకొని రీకుతాకున వచ్చి కూర్చున్నాడు. 'పంతులూ గష్తీనిషాన్ 53 (నిజాం రాష్ట్ర వాగ్బంధన శాసనము) తెలుసునా?"

"ఓ తెలియకేమి? అది సియాసీజల్సాల (రాజకీయ సభల) కొరకేర్పడినది"

"సియాసీ అంటే?"

"సర్కారును దూషించుట, ఫర్మానులకు వ్యతిరేకముగా నడచుకొనుట."

"మరి నీవు చేసేది అదేపని గదా?"

"నేను గాదు, నీవు చేసేది. ఫర్మానులలో వెట్టి కూడదని వున్నది. కూలి ఇచ్చి పనిచేయించుకొనుమని వుంది. నీవెన్నడైన కూలి ఇచ్చినావా? మరి నీబేగం సాహేబాకు ముసలివాండ్ల తన్ని చంపుటకు, పడుచువాండ్ల చెంపలు వాతలు పెట్టుటకు, పాయిఖానా లూడ్పించుకొనుటకు ఏ ఫర్మానాలో హక్కిచ్చినారు?"

"నీవు ఖానూను చాలా మాట్లాడుతావు. అచ్చా, నీకు తగిన ప్రాయశ్చిత్తము చేస్తాన్ చూడు" అంటూ లేచిపోయినాడు.

వారముదినము లైంది. బేగంసాహెబా పాయిఖానా పూడ్చేవారు లేరు. వెట్టిచాకిరి మనుషులు రారు. కోళ్లు అసలే లేవు. బియ్యము రూపాయికి 4 పళ్ళే అయినవి. గుఱ్ఱాలకు గడ్డి చిక్కదు. పోలీసులకు కాలిమంట తల కెక్కింది. కల్లుమాత్రం వారికి సమృద్ధి. గ్రామస్థులందఱు కల్లు తాగమని ఒట్టు పెట్టుకున్నారు. ఇదివరలో అమీను కచ్చేరికి కుండెడుకల్లే ఉచితముగా సప్లై అవుతుండెను. ఇప్పుడు 3 కుండలు సప్లై. జవానులందరు అమీన్‌గారి అధ్యక్షతలో మీటింగు చేసుకున్నారు. సంఘాల పంతులను కచ్చేరికి పిలిచినారు. సంఘాల పంతులు పోయిన తర్వాత 30 కోమటి యువకులు, 40 మంది మాదుగులు లాఠీలతో బయలుదేరి నాకా వెనుక భాగములో కూర్చున్నారు. వారిట్లు తయారైంది పంతులుకు తెలియదు, జవాన్లకును తెలియదు. సంఘాల పంతులు లోపల పోయిన వెంటనే కైపెక్కిన జవాన్లకు మరింత కోపము వచ్చింది. 'అరేపట్టండి బొమ్మన్‌కు!' 'డాలో హత్కడీ, గోలీసే ఉడాదో. సంగెం సంగెం ఏం పంతులూ' 'నీదీ యేవూరు బే' 'నీకీ ఫాసీ వెయ్యాలా' 'అరే వీడూ మనకి నోట్లో మన్ను వేసినాడ్, రూపాయికి బియ్యం నాల్గాపళ్ళు మా తాతలనాడు కూడా ఇట్ల లేకుండె బే' 'వాడూ హుసేన్‌గాడు బేగారీ వుండలే. వాడికీ కట్టెల్ తెమ్మంటే కూలీలావ్ అంటాడు' 'క్యా దేఖ్తారే పకడ్ సంఘాల పంతుల్కీ'.... ఇట్లా కలకలము బయలుదేరింది. పంతులు శాంతముగా చూస్తూ నిలుచున్నాడు. ఏమిన్నీ జవాబీయలేదు. జవాన్లు పట్టుటకు దగ్గర వచ్చిరో లేదో బయటి సైన్యం మరులోపల ప్రవేశించి, టోపీలు ఎగురునట్లుగా కైపు దిగునట్లు జవాన్‌లను అమీనును మోదినారు. 'అరే మర్గయా', 'అరే మాఫ్‌కరో', 'అరే అల్లా, ఇంకా జోలికి రాంబే', 'పంతులూ! నీవన్నా చెప్పు' ఇట్లు ప్రార్థించినా వినక, వారికి దేహశుద్ధి అయ్యెను. నలుగురైదుగురికి మంచి గాయములు తగిలెను. అమీన్ మంచముకింద దాగుకున్నాడు. బయటలాగినారు. కట్టెలతో కొట్టితే లావుశరీరము నొచ్చునని తన్నులు తన్నినారు. కల్లుతిత్తివలె దొర్లినాడు.

వారము దినములకు మొహతెమీం వచ్చినాడు. పోలీసువారు తమకైన అవమానము చెప్పుకోలేదు. కాని, సంఘాలపంతులు వచ్చి అరాచకము చేసినాడనీ, పోటీ ప్రభుత్వము సాగిస్తున్నాడనీ, ఫౌజు పంపకుంటే గొప్ప ప్రమాదము జరుగుననీ వ్రాసుకున్నారు. మొహతమీం వచ్చిన వెంటనే రైతులను పిలిపించి విచారించినాడు.

"అయ్యా, ఈ చిట్టీలు చూడండి. వందలకొలది వున్నవి. ఎన్నడూ పైకమియ్యలేదు."

"సర్కార్! మాదిగెది ముసలిది బేగం సాహెబా తంతే చచ్చింది."

"మారాజా! మా అక్కకు ఇదిగో యీడ వాతవేసింది."

"మేము దేశమిడిచి పోతామయ్యా, ఈ యెట్టి మాతో గాదు."

అని వందలకొలది షికాయతులు చేసిరి. మొహమీయంతయు గుర్తించెను. అమీన్ బర్తరఫ్ (**Dismiss**). జమాదార్ తనజ్జుల్ (**Degrade**), జవాన్లందరికి 6 నెలలు మోతలు (**Suspend**). ఠానా బర్దాస్త్ (ఎత్తివేయుట). ఆ పూర్లో ఇంక నాకా (**Police Station**) అవసరము లేదని హుకుం అయిందని వింటూనే ప్రజల ఆనందానికి మేరయేలేదు. ఇంకా వారము దినాలకు హెూలీపండుగ. 'అరే, పండుగచేస్తాం' అని తీర్మానించుకున్నారు. వారముదినములా గ్రామంలో జల్సాలు (విందులు) జరిగినవి. ఏటి అవతలవారికి కూడా దావత్! ♦

# దండె కడియం

- తగుళ్ళ గోపాల్
9505057316



'చెవిపోగుకు తోడుగా
సగం కాల్చిన కానుగాకుసుట్ట
బతుకుకు కొప్పెర వెట్టినట్టు గొంగడి
నిలువెడు గుంజంత మనిష"ని
తాత బొమ్మను ఎవరైనా మాటల్తో గీస్తుంటే
ఎట్లుంటడో ఒక్కసారైనా చూడాల్నని
పానమంతా తండ్లాడేది.

నేను తొట్టెల్లో ఉన్నప్పుడే
నా పేరువెట్టి
నింగిలో చీకటిని మేస్తున్న
ఆ చుక్కలమందను కాసేటందుకు ఎల్లిపోయిండంట.
గోపిగా అని నోరారా పిలుపు వినబడితే
ఏ లోకంలోనో నిలవడి
మా తాతే దీవెనలు ఇస్తున్నట్టుంటది.

ఆరివారం గల్ల పుట్టువడి అని
నూరున్నొక మంది నిన్ను పొగుడుతుంటే
ఈ మట్టిపెయ్యి మీద
గడ్డిపూలు మొల్చినట్టుండేది.

ఆయన నిజాయితే
నలుగురుబిడ్డల పెండ్లీలు చేసిందని
కాలుకాలు గొట్టుకొని తిరిగిన గుట్టలన్నీ
బండ మీద కూసోబెట్టుకొని చెబుతాయి.
లేతలేత ఆకుల్ని, తుమ్మకాయల్ని తెంపి
మేకల ఆకలిని ఎట్లా తరిమేటోడే
ఇంట్లోని కమ్మలకత్తికి ఎరుకే.

ముక్కుకు బట్టగట్టుకోకుండ
మేక కడుపులో చేయిపెట్టి
సచ్చేపిల్లల్ని బతికించినపుడు
ప్రకృతికే పురుడు పోసినవని
నీ రుణం తీర్చుకోనీక
ఇంకిన్ని బొట్లు ఎక్కువ పాలిస్తది

ఒకే ఈతలో
మూడు పిల్లల్ని ఏసిన బట్టమేక
నీవు సదివిన వైద్యశాస్త్రాన్ని మెచ్చుకుంటది.

మేకకాలును నీ మోకాలు మీద వెట్టుకొని
ఇరిగిన తుమ్మముల్లును
నొప్పితెల్వకుండ తీసిన నీవు
కన్నబిడ్డల్ని ఎట్లా జూసుకున్నవో
వేరే చెప్పాలా తాతా!

పొద్దూకే జాములో
గొర్రెపిల్లను భుజాన వేసుకొని నడుస్తుంటే
నన్ను గూడ ఎత్తుకోమని
సూరీడు చేతులు చాచి ఎంటవడేటోడంట

తోడేండ్ల నుండి
మందను కాపాడేటందుకు
నీ కంటిదీపాలతో పాటు
మూడో కన్నుగా ఉన్న కుక్క
మాటిమాటికి నీతోపాటు నిద్రలేచేదంట

పదిమందిల తిరిగినప్పుడు
గొల్లపెద్దయ్య మనువడిని అని చెప్పుకోవడమంటే
నీ ముంజేతిని ముద్దాడిన దండె కడియాన్ని
ముద్దుపెట్టుకున్నట్టే ఉంటది. ♦

# సమాజ పరివర్తన కోరే కవి బంగార్రాజు






- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
9440222117

***"తరతరాలుగా అంతరాల తరగతి గదుల్లో/ బూజు పట్టిన భావావేశాల్ని/ ఎన్నాళ్ళని చదువుతాం/ భిన్నధ్రువాల బురద సంద్రాలు దాటుకుంటూ/ భేషజం లేని సరికొత్త సమానత దారుల్లో/ జీవితాంతం సరదాగా సంచరిద్దాం"***

వాస్తవికత నుండి స్వప్నంలోకి ప్రయాణమ్ కవిత్వం. ఉన్నది వాస్తవికత, ఉండవలసినది స్వప్నం. సామాజిక పరివర్తన కోరే కవులు కలలు కంటారు. ఈ కలలు పురోగమన కలలు, ప్రపంచాన్ని నిన్నటి కన్నా ఇవాళ, ఇవాల్టి కన్నా రేపు మరింత అందంగా తీర్చిదిద్దాలనుకునే వాళ్ళు ప్రగతి శీల కవులు. సమాజాన్ని వెనక్కు నెట్టే తిరో గమనవాద కవులకూ కలలు ఉంటాయి. కాని అది సాధ్యం కాదు. వాళ్ళవి పగటి కలలే అవుతాయి. పదిమంది సౌఖ్యం కోరేది తిరోగమన కవిత్వం. వందమంది సౌఖ్యం కోరేది పురోగమన కవిత్వం. బంగార్రాజు పురోగమన కవి.

బంగార్రాజు దృష్టిలో వర్తమాన సమాజం 'అంతరాల తరగతి గది! ఇది వాస్తవికత. ఆయన కల 'సమానత దారి'. ఇదే ప్రగతిశీల కవి లక్షణం. ఈయన కావ్యం బువ్వ. ఈ కవిత ఈయన కావ్యాన్ని నిర్వచిస్తున్నది. ఒక కావ్యలో ముప్పయ్యో, నలభయ్యో కవితలుంటే వాటిలో ఒకటి నాయకత్వ స్థానంలో ఉంటుంది. అది ఆ కవి గరిమనాభిలోంచి పుట్టుకొస్తుంది. గురజాడ 'దేశభక్తి', రాయప్రోలు 'జన్మభూమి', శ్రీశ్రీ 'దేశచరిత్రలు', జాషువ 'గబ్బిలం', దువ్వూరి 'కృషీవలుడు'.. ఇవన్నీ ఆయా కవుల ప్రాతినిధ్య కవితలు. 'బువ్వ' బంగార్రాజు ప్రాతినిధ్య కవిత. 'బువ్వ' మానవ ఉత్పత్తి. మనిషి తన అవసరం తీర్చుకోవడంకోసం తాను సృష్టించిన పదార్థం బువ్వ. బువ్వ సమాజ సమూహ సృష్టి. అది ఒకరి శ్రమ ఫలితం. మానవ జాతి మొత్తం శ్రమ ఫలితం. "కూడులేక జీవకోటి లేదు" అన్నారు వీరబ్రహ్మం. ఆ కూడు, ఆ బువ్వ సృష్టించబడిన తర్వాత పరాయీకరింపబడుతున్నది. బువ్వ తన సృష్టి కర్తల నుండి దూరమై, ఆ సృష్టితో సంబంధం లేని వాళ్ళ పరం అవుతున్నది. ఇది పరాయీకరణ. అసమసమాజ లక్షణం మానవ శ్రమ పరాయీకరింపబడటం. ప్రగతి శీల కవి ఈ పరాయీకరణను ఎత్తిచూపి, దానిని విమర్శకు పెడతారు. కడుపు నిండిన వారు మోక్షాన్ని కలవరిస్తుంటారు. కడుపు కాలేవారే బువ్వను కలవరిస్తుంటారు. బంగార్రాజు కడుపు కాలే వాళ్ళ కవి.

***"రోజూ అంబలితో పెనవేసుకున్న బాల్యం / ఎప్పుడో గాని బువ్వ పలకరించేది కాదు"*** అన్నది కవి 'వజ్రతుల్య జ్ఞాపకం'. కవి మూలాలను ఈ మాట గుర్తు చేస్తున్నది. కవి పేదరికంలో పుట్టి పెరిగారు. జీవితంలో స్థిరపడినాక జ్ఞాపకం చేసుకుంటే 'బువ్వ' కవిత పుట్టింది. కవికి పునాది పేదరికం. ఈ పునాదిమీద బంగార్రాజు కవిత్వ సౌధం నిర్మితమైంది.

బువ్వ నుండి దాని సృష్టికర్తను దూరం చేసి, దాని సృష్టితో సంబంధం లేని వాడు దానిని స్వాధీనం చేసుకోడానికి సృష్టింపబడింది భావవాదం, దైవవాదం. దైవవాదం వ్యవస్థీకృత

రూపం మతం. దీనికి మౌఢ్యం జీవలక్షణం. ఈ మౌఢ్యం వేలయేళ్ళుగా ప్రపంచమానవ జాతిని నడిపిస్తూ దోపిడి కొనసాగింపునకు సహకరిస్తున్నది. ఈ మౌఢ్యం నుంచి బయటపడమని ప్రగతిశీల కవి పిలుపునిస్తారు.

***"నిప్పును పుట్టించిన రాయిని/ దేవుడుగా కొలచిన వాడి తెలివి ముందు/ గుబురు గడ్డాల గారడీ స్వాముల్ని/ గుడ్డిగా నమ్మే నవనాగరికం తెల్లమొహం వేస్తుంటే/ మళ్ళీ సరికొత్త నాగరికతకు/ రూపుదిద్దాలని ఉంది"***

సమాజంలో సంఘర్షణ సృష్టించేది భావవాదం. ఇప్పుడు కూడా మనం చూస్తున్నాం. సామరస్యం సృష్టించేది భౌతికవాదం. సమాజంలో సామరస్యం కుదరాలంటే భౌతికవాదం విస్తృత సాధనం. బంగార్రాజు 'సరికొత్త నాగరికత' అన్నది భౌతికవాద దృక్పథంతోనే.

బువ్వ కవి బంగార్రాజు కవిత్వం నిండా బువ్వ సృష్టికర్తల కడగండ్లే వస్తువు. బువ్వ కోసం మనుషులు పడే అవస్థలే వస్తువు. బువ్వను సృష్టించడంలో భారతీయ సమాజంలో దళితులది కీలకపాత్ర. వాళ్ళ శ్రమ లేకుండా పొలం పండదు. అయినా వాళ్ళకు సామాజిక గౌరవం లేదు. మతం, భావవాదం చేసిన దుర్మార్గం ఇది. దళితులను వాళ్ళు సృష్టించిన బువ్వకు దూరం చేసి, దాని ద్వారా వాళ్ళ ఆత్మగౌరవాన్నే కాదు, సామాజిక గౌరవాన్ని కూడా నాశనం చేసింది భావవాదం. బంగార్రాజు ఈ కావ్యంలో దళితుల పరాయీకరణ మీద చాలా కవితలు రాశారు. బువ్వకేగాని గుండెకు పేదరికం లేని దళిత స్త్రీ 'నిమ్న దేవత'లా అనిపిస్తుంది. తెలుగు దళిత కవితలో ఈ 'నిమ్న దేవత' కవిత అగ్రభాగాన నిలుస్తుంది. దళిత స్త్రీలోని మహోన్నత మానవత్వ గుణాన్ని ఈ కవిత ఆవిష్కరించింది.

***"నల్లతల్లీ! నీ చలువ వల్ల/ వర్ణ ధర్మం వెన్ను విరుస్తూ/ క్షేత్రాన్ని వశీకరించుకుంటున్నా..."***

అన్న ఆత్మస్థైర్యం ఈ కవికుంది. ఇది ఎలాగ సిద్ధించింది. సమాజం మారడం వల్ల. సమాజం ఎలా మారింది. ఉద్యమాల వల్ల, వైజ్ఞానిక శాస్త్రపరిశోధనల వల్ల. మార్పు ఆకాశంలోంచి ఊడిపడదు. ప్రశ్నించే వాళ్ళద్వారా, పరిశోధించే వాళ్ళ ద్వారా మార్పు వస్తుంది. చంపేవాళ్ళ వల్ల మార్పు రాదు. చంపబడే వాళ్ళ వల్ల మార్పు వస్తుంది. బంగార్రాజు చంపబడే వాళ్ళ పక్షం.

బువ్వ సృష్టికర్తలు కేవలం శారీరక శ్రామికులే కాదు, గొప్ప కళాకారులు కూడా. ఇప్పటికే అనేకమంది తెలుగు రచయితలు దళితులలోని కళా ప్రపంచాన్ని చిత్రించారు. బంగార్రాజు 'డప్పు రామస్వామి' కవితలో ఈ పనే చేశారు. దళిత కళాకారుని సృజనాత్మకశక్తిని ఈ కవిత వెదజల్లుతున్నది. ఊళ్ళో దండోరా వేసే రామస్వామి మీద రాసిన కవిత ఇది.

***'మాసిన కండువ భుజానేసుకొని/ పిక్కలపైదాక గోచీనెగ్గట్టి/ మరోభుజాన డప్పు తగిలించుకుని/ రామసామి నడిచి పోతావుంటే/ దారిపొడవునా.. చైతన్యం వెదజల్లుతూ/ సిద్ధార్థుడు నడిచి వెళుతున్నట్టే వుంటుంది"***

మతం, భావవాదం అనుదాత్తుడుగా చిత్రించిన దళితుడని, ప్రగతిశీల దళిత కవి ఎంత ఉదాత్తస్థితిని తీసుకెళ్ళాడో చూడండి. దళితుడిని సిద్ధార్థునితో పోల్చడం ద్వారా కవి మనువాద వర్ణవ్యవస్థను పూర్తిగా తృణీకరించి తిరస్కరిస్తున్నాడు. మనువాద దోపిడీ వర్గానికి చర్మం పలచగా ఉంటే ఈ కవిత ముల్లుగర్రై గుచ్చుతుంది.

మతవాదుల ఆగడాలు ఎంత విస్తృతంగా ఉన్నాయో మనమిప్పుడు చూస్తున్నాం. వీళ్ళు విగ్రహాలను గురించి వగచినంతగా మనిషిని గురించి వగచరు. దళితవాదుల మీద దాడులు జరిగినప్పుడు ఏ 'ఆనందు'దూ నోరు తెరవలేదు. గరగపర్రు సంఘటన మీద ఏ ముసుగు వీరుడైనా నోరు తెరిచాడా? బంగార్రాజు 'దళితజెండా' ఎగురవేశారు.

***''అస్తమయమే ఎరుగని నీలి సూర్యుణ్ణి/ పంచాయతీ ..... పక్కన రాజేసి"*** అనడంలో గరగపర్రే ధ్వనిస్తున్నది

***''నన్ను వెలివేస్తున్నావని/ నువ్వనుకుంటున్నావు/ నిజానికి../ నాచే నువ్వు వెలివేయబడుతున్నావు"***

ఇదీ కవి గొంతులోని నిర్భయత. ఆత్మస్థైర్య గొంతుక బంగార్రాజుది. అంటరానితనాన్ని వికృతంగా ఆచరించే కుటిల సంస్కృతిని బంగార్రాజు, దేవుడు కావాలి. కవితలో విమర్శనాత్మకంగా చిత్రించి

***"నిజానికిప్పుడు/ జాతికి దళిత దేవుడు కావాలి/ అందుకు సిద్ధంకా'***

అని పిలుపునిచ్చాడు. దేవుడు కావాలి అనడం భావవాదపు పిలుపే అయినా, ప్రతిఘటన క్రమంలో ఇది అనివార్యం.

దళితులదాకా కలం కదిలించిన ప్రగతిశీల దళితకవి గిరిజనుల దాకా వెళ్ళకుండా ఉండదు. గిరిజనులు విశేషంగా ఉన్నప్రాంత కవికి గిరిజనులు వస్తువులు కాకుండా ఉండలేరు బంగార్రాజు 'గిరిపుత్రి' రాశారు. చలికాలంలో ఏజెన్సీ ప్రాంత చలికాలంలో గిరిజన స్త్రీ గుమ్మడి కాయల్ని సంతకు తీసుకుపోయే దృశ్యం ఈ కవిత. విశ్రాంతి వర్గానికి చలిగాని, శ్రామిక వర్గానికి చలేమిటి అంటారు కవి.

*"నీ శ్రమ జీవన సౌందర్యంలో/ సెల్ఫీ దిగుతాను/ ఆ బొమ్మను భూగోళం గోడ గుమ్మానికి/ వేలాడదీసి/ విశ్వాంతరాళ వేదిక మీద ఆవిష్కరిస్తాను"*

శ్రమను ఉదాత్తీకరించని వాళ్ళు ప్రజాజీవులు కాలేరు. శ్రమను అవమాన పరిచే భావవాదులు, తిని కూర్చుని వేదాంతం చెప్పేవాళ్ళు, ఈ కవిత చదివితే తమ విశ్రాంత వర్గ వేదాంతంలోని అబద్ధమేమిటో తెలిసివస్తుంది.

బంగార్రాజు కవిత్వంలో చిన్నపిల్లలకు మంచి స్థానమిచ్చారు.

అమ్మ కడుపులో ఉంటే శిశువు, చెత్తకుప్పలో పారేయబడిన అనాథ శిశువు, అప్పుడే పుట్టిన శిశువు, ఆయన కవితల్లో ఆర్ద్రంగా కనిపిస్తారు. తల్లి గర్భంలోని ఆడబిడ్డ అభ్యర్థన 'నాకు పుట్టాలని వుంది నాన్నా' ఈ కవిత పురుషాధిపత్య వ్యవస్థపైన కవి వేసిన మొట్టికాయ. బాల కార్మిక వ్యవస్థ మీద కవి అధిక్షేపమే 'రేపటి పౌరుణ్ణి'.

*"ముద్దు మాటల్ని పసితనం పొలిమేరల్లో పాతి/ఫ్యాక్టరీ సైరన్ కూతలతో వాదులాడుతున్న వాణ్ణి/ తిని వదిలిన పాత్రల మకిలిని/ బతుక్కి పులుముకుని/ పాచి ఇడ్లీతో పొట్టని ఓదారుస్తునవాణ్ణి"*

బాల శ్రామికుల ఈ కంఠస్వరం వింటే మన సమాజంలో శ్రమదోపిడీ ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. విశ్రాంతి వర్గ ప్రతినిధులు దేనిమీద ఆవేశ పడుతున్నారో, వాళ్ళు ఆవేశపడవలసింది దేనిమీదనో తెలుస్తుంది. కళ్ళకు మతం, కులం గంతలు కట్టుకున్నవాళ్ళకు ఈ దృశ్యాలు కనిపించవు. ప్రజాస్వభావం ఉన్న వాళ్ళకే కనిపిస్తాయి. చిన్న పిల్లల పుట్టుకలో బంగార్రాజు పారవశ్యం పొందుతారు. ఆయనలో ఒక పసిపాపడు ఇంకా సజీవంగా ఉన్నాడనడానికి 'నీకెలా కృతజ్ఞతలు చెప్పనూ', 'ఒక తార ఉదయించింది' వంటి కవితలు నిదర్శనాలు.

కవిత్వ కళాకారుడైన బంగార్రాజుకు ఇతర రకాల కళాకారుల మీద అపారమైన గౌరవముంది. కె.బాలచందర్, బాపులు మరణించినప్పుడు వాళ్ళ స్మృతిలో రెండు కవితలు రాశారు బంగార్రాజు. వాస్తవిక చిత్రాల దర్శకుడైన బాలచందర్ మరణించినప్పుడు 'ఎలా నేస్తం!' అని ప్రశ్నించారు. బాపు మరణించినప్పుడు.

*"ప్రాణాలకు రంగులద్ది/ కళకే కళతేవడం ఎవడితరం"*

అని ప్రశ్నించారు. ఈ రెండింటికన్నా, దేవుని బొమ్మలు గీసుకొని బతికే కళాకారుని గురించి 'దేవుళ్ళకే దేవుడు' కవిత రాశారు. ఇది చాలా ఆర్ద్రంగా ఉంది. గాంధీ వేషధారులు ఏ నగరానికి పోయినా కనిపిస్తారు. వాళ్ళమీద 'గాంధీ నవ్వుతున్నాడు' కవిత రాశారు బంగార్రాజు. దేవుళ్ళ గుడులు భిక్షాటన కేంద్రాలైనట్లే, గాంధీ వేషం ఇప్పుడు పైసల్ని అడుక్కోడానికి ఉపయోగపడుతున్నాయి. నిజానికి ఈ ప్రక్రియ ఏడు దశాబ్దాల స్వతంత్రం మీద నిరసనే.

*"చేతికర్రతో/ జాతి పునరుజ్జీవనం అణువణువూ/ శిలాఫలకం మీద విగ్రహంగా/ ఆ గాంధీ నవ్వుతుంటే/ ముందు జోలెపరిచి/ దారిద్ర్యం దారిలో/నేనెరుగని లోతుల్లేవంటూ/ జీవచ్ఛవమై.. ఏడవలేక/ ఈ గాంధీ నిజంగా నవ్వుతున్నాడు"*

మనసున్న మనుషులు కవులైతే అమ్మానాన్నల మీద కవితల్ని రాయకుండా ఉండరు. బంగార్రాజు 'మానాన్న' రాశారు. తన జీవితంలో ప్రతి మలుపులోనూ నిజమైన హీరో తన నాన్నే అని డిక్లేర్ చెయ్యగలిగిన గౌరవం ఈ కవికుంది.

*"నేను నిద్దరోయాక మాత్రమే/ ముద్దులు పెట్టే దొంగ ప్రేమికుడు/ నిద్దుర లేచాక కళ్ళముందు వెదిలే/ పెద్దపులవుతాడు......."*

తండ్రిలోని రెండు జీవితాలను ఇంత సులభంగా చిత్రించవచ్చు.

ప్రజా స్వభావం కలిగిన భారతీయ కవులందరి వలే బంగార్రాజు కూడా ప్రపంచీకరణను ఆమోదించలేదు. నోట్ల రద్దు వంటి ఆటలను ఆమోదించలేదు.

*"విదేశీ దివానంలో నౌకరీకోసం/ నానా తంటాలు పడుతున్నావే/ పెదకామందు చావిట్లో/ పేడకళ్ళు తీయడానికీ దానికీ / ఏమన్నా తేడా వుందా?"*

అనేది కవి ప్రశ్న. వేలకోట్ల రూపాయల అప్పును ఎగ్గొట్టి విదేశాల్లో విలాసంగా తిరిగే వాళ్ళను వదిలి, నల్లధనాన్ని అరికట్టడానికి నోట్లరద్దును చెయ్యడంలోని అసంబద్ధతను కవి నిలదీశారు.

బంగార్రాజు కంఠ కంఠంలో నిజాయితీ ఉంది. మన సమాజం బాగా లేదే అన్న ఆవేదన ఉంది. మనం సమాజం బాగా ఉండాలన్న తపన ఉంది. మన సమాజం బాగాలేక పోవడానికి కారణాలను వెతకడంలో నిబద్ధత ఉంది. మన సమాజం ఇప్పుడున్నట్టుగా ఎందుకుందో తెలుసుకోవాలన్న ఆతృత ఉంది. ఇదొక అన్వేషణ. ఈ అన్వేషణ ఇంకా లోతుకు వెళ్ళవలసి ఉంది.

నచ్చిన దానినే కాదు, నచ్చని దానిని కూడా ఎంత నాగరికంగా చెప్పవచ్చునో బంగార్రాజుకు తెలుసు. దేవుళ్ళ పేరమీద ఇటీవల మన రాష్ట్రాలతో జరుగుతున్న రభస చూస్తున్నాం. ఎన్ని తిట్లు! ఎన్ని శాపాలు! ఎన్ని హెచ్చరికలు! అదొక్కటే కాదు. చాలా వాటిలో అనాగరికత ఆవహిస్తున్న సమయంలో నాగరికత ఎలా ఉంటుందో 'బువ్వ' కావ్యం నిరూపించింది. ♦

**కవిత**

# అల్జీమర్స్

- షేక్ అహమద్ భాష
9440650943

ఇవ్వాళ ఒక పసిబిడ్డ అత్యాచారానికి గురై
కామంధుల చేతుల్లో నిర్దాక్షిణ్యంగా బలైపోతే......
మానవత్వపు విలువల మరుపు
దేశానికి చిక్కటి పంగ నామాలు పెట్టి
బ్యాంకులను దోచుకుని ఉడాయించిన
కోటీశ్వరులు.....దేశ ప్రగతి మరుపు



చిన్నచిన్న ఉద్యోగులు, పెద్దపెద్ద కాంట్రాక్టర్లు
తారతమ్యాలు లేక
కోట్ల కొద్దీ నల్ల ధనంతో దొరకడం....
నైతిక మతిమరుపు
దేశ సైనిక శక్తి అధిపతే
ప్రలోభాలకు లొంగితే..దేశభక్తి మరుపు

రాజకీయ స్వప్రయోజనాలకు
జాతిని కులమతాలుగా, ప్రాంతాలవారీగా
విడగొడితే....రాజకీయ విలువల మరుపు

దేవుడి సేవలో ఉద్యోగం చేస్తూ తరించే బదులు
ఆ దేవుడి ఆస్తినే కొల్లగొడితే.....దైవభక్తి మరుపు

సరస్వతీ కటాక్షం పేరుతో ప్రజలను దోచేసినా
పిల్లలో సృజనాత్మకతకు సాన పెట్టకపోతే...
విజ్ఞానపు మరుపు
చిన్నచిన్న వ్యాధులను భూతద్దంలో చూపించి
బీదసాదల నుంచి కూడా దోపిడీ చేసే....
వైద్య ఆశయాల మరుపు

ఒక వ్యక్తికి మతిమరుపు వస్తే అల్జీమర్స్ అంటారు
ఫరవాలేదు, సమజానికి పెద్ద నష్టం లేదు
సమాజానికే మతిమరుపు వస్తే
నువ్వు ఒక మనిషిగా స్పందించవా?? ♦

---

# మనం

- రవి నన్నపనేని.
9963671531

అంత తేలిగ్గా మనిషికి దూరమైతే ఎట్లా?
మనుషులు తొందరపడి
మాట తూలటం
కొన్నాళ్ళు మొకం చాటేయటం
ఎక్కడైన ఉన్నదేలే
అయితే మాత్రం అంతరాత్మ లోపల నుంచి అంత
సులువుగా పోగొట్టుకుంటామా పరిచయమైన మనిషిని ?
మంచిని ?



ఎవుడూ మరొకడిలా ఉండడు
ఇంకొకడు నువ్వనుకున్నట్లూ జీవించడు
ప్రతి వ్యక్తీ ఒక ప్రత్యేక సముదాయం అని
తెలుసుకోకపోతే ఎట్లా ?

అలల సెలయేరులా అలరించిన అవతల మనిషి
కడలి కెరటమై ఇవతల మనిషిని పడదోయనీగాక...
ఏదో ఒకనాడు తడి వొడిలో కూర్చోమంటాడు తన
ఒడ్డున –అది ఎవ్వరైతేనేం !
మనిషి బతుకంటేనే విడిపోయిన దేహాలు
హృదయాలు హృదయాలై
కలిసిపోవటం

నీ వద్ద కొమ్మలు విరిచే పెనుగాలైన ఆ మనిషి
అతని వద్ద
చిగురాకుల్లో కదిలాడే పిల్లగాలై
సంభాషించడం
మలయ మారుతమై మాట సేదదీర్చటం
దర్శించకపోతే ఎట్లా ?

అంత తేలిగ్గా మనిషిని వదిలిపోతే ఎట్లా ?
ఒక దయామయి
ద్వేషరాహిత్య ప్రపంచంలో
మనుషులు ప్రేమ పూలై గుభాళించకపోతే ఎట్లా?
అనుమానపు చీకటికీ సందేహ కిరణాలకీ భేదం
ఎరక్కపోతే ఎట్లా
మనిషంటేనే
మరో మనిషిని వెతుక్కోవటం
వెళ్ళిపోతున్న మనిషిని వెనిక్కి పిలవటం ♦

# యుగపురుషుడు



కందుకూరి వీరేశలింగం నార్ల వెంకటేశ్వర రావు

- నార్ల వెంకటేశ్వరరావు

ఈనాడు వీరేశలింగం "స్వీయచరిత్రము"ను ఎంత మంది చదువుతున్నారనే విచికిత్సతతో నేను అబ్బురపడుతుంటాను. నేనా పుస్తకాన్ని మొట్టమొదటగా నా యౌవనారంభదశలో చదివాను. నేను ఇప్పటికీ పదే పదే చదువుతూండే బహుకొద్ది తెలుగు పుస్తకాల్లో ఇదొకటి. విస్పష్టంగా చెప్పాలంటే – ఈ పుస్తకం గాంధీ, నెహ్రూల ఆత్మచరిత్రలవంటి మహోన్నత సారస్వత శకలం కాదు, గాంధీ ఆత్మకథలోని సరళత, సూటిగా చెప్పడం వీరేశలింగం "స్వీయచరిత్రము"లో కూడా వున్నదనడానికి సందేహం లేదు. కాని దాని సమానాంతర ప్రవాహగతి, విశాలత్వం, ప్రగాఢత ఇందులో లేవు. నెహ్రూ ఆత్మకథలోని మానసిక సంఘర్షణలు, నిశితమైన ఆత్మపరిశీలన, భావుకత్వపు విలువలు కూడా ఈ పుస్తకంలో లేవు.

అయినా దీన్ని పదే పదే చదివినకొద్దీ, ఆంధ్రులమైన మనం ఈనాడున్న స్థితికిగాను వీరేశలింగంగారికి ఎంత ఋణపడివున్నామో మరింత ఎక్కువగా అవగాహన అవుతూంటుంది. శ్రీరాజగోపాలాచారి : 'వీరేశలింగం ఉద్భవించి సముత్తేజపరచకపోతే ఆంధ్రదేశమూ ఆంధ్రులూ ఈనాటివలె వుండేవారు కాదు. ఆయన నిశితమైన అంతర్‌దృష్టి. మహా ధైర్యము, సంచలనాత్మక శక్తిగల భారతీయ మహాపురుషుల్లో ఒకరు. హెర్క్యులస్ అంతటి ఉద్దండతతో అసత్యాన్ని ఎదిరించారు. అభ్యుదయకరమైన కృషిని పరిరక్షించారు" అన్నమాటలు నిజం.

"హెర్క్యులస్ అంతటి ఉద్దండత" – నిజంగా వీరేశలింగం వ్యక్తిత్వాన్ని గ్రహించడానికి ఈ పదమే కీలకం. ఆయన చిన్నవయసులోనే మాతృత్వం వహించిన స్త్రీకి ఏకైక పుత్రుడు. పుట్టుకనుంచీ దుర్బలుడు. పసినతంలోనే రెండుసార్లు చచ్చి బదికినవాడు. ఆయన దీర్ఘజీవితంలో ఏదో ఒక జబ్బులేని రోజంటూలేదు. అందులో ఆస్తమావ్యాధి శత్రువులా వెంబడించేది. ఎడతెగని అనారోగ్యం, అందువల్ల ఏర్పడిన శారీరక దుర్బలతా ఆయన ప్రకృతిని వికలం చేశాయి. ఆయన చీటికీమాటికీ చిరుబురులాడే ముక్కోపిగా తయారయ్యాడు. అతి స్వల్ప విషయానిక్కూడా కస్సుమనే ఈ ధోరణిని అదుపులో పెట్టుకోవాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా ఆయన చేత కాలేదు.

ఆయన్ని కించపరిచిన మరోలోపం అత్యల్ప విషయాల్లో కూడా తన ఇష్టమే కొనసాగాలనే పట్టుదల. ఎదటివారు తన ప్రాథమిక సిద్ధాంతాలతో ఏకీభవించిదే చాలదు, వారు ప్రతి సూక్ష్మాతిసూక్ష్మ విషయంలో కూడా తనను అనుసరించాలనే పట్టుదల చూపేవాడు. ఏ విషయం మీద, ఏ మూలనుంచీ, ఎందరు వ్యతిరేకించినాసరే ఆయన వెంటనే కోపావేశ వివశు

డై పోయేవాడు. అనేక విపరీత హేళన రచనలూ, చురకలు వేసే వ్యంగ్య రచనలూ చేసినవాడైనా ఆయనకు హాస్యాన్ని ఆనందించే మనస్తత్వం లేదు. తనను చూచి తాను నవ్వుకునే సంగతలా వుంచండి – ఎదుటి వారిని చూచినవ్వే ధోరణైనా లేని అతి కోపిష్ఠి. ఏదిఏమైనా – తనలోని ఈ లోపాల్నీ తదితర లోపాల్నీ కూడా దృఢ సంకల్పంతో అనేక సుగుణాలుగా మార్చుకోగలగడమే శ్రీ వీరేశలింగం గొప్పతనం. ఆయన తనకుగల ముక్కోపాన్ని సమకాలిక సంఘంలో గల చిలిపి అంధ విశ్వాసాల మీద, కరుడుగట్టిన మూర్ఖత మీదా అసహనంగా మార్చుకున్నాడు. ప్రతిదాంట్లో తన మాటే నెగ్గాలనే వ్యసనాన్ని – తన ప్రత్యేక పద్ధతిలో, ప్రతిభావంతమైన ధోరణిలో విజయసాధన కుపయోగించుకున్నాడు. తుకతుకలాడే తన కోపంతో భుగభుగమండే ఖడ్గాన్ని రూపొందించి – మర్యాద, సామ్యతలను భంగపరుస్తున్న ప్రతి అన్యాయ, అమానుషాలపైనా పోరాడ్డానికి వినియోగించాడు. తన కఠోర తీవ్రదృష్టి, తలచిన పనికే అంకితమయ్యే ధోరణులనుండి హెర్క్యులస్ వంటి శక్తిని ఆవిష్కరింపజేసుకుని తన దోవకు అడ్డువచ్చిన ప్రతి ప్రతిబంధకాన్నీ అవలీలగా నెట్టివేయగలిగాడు.

బడుగుదేహం; అందునా అనారోగ్యం. అయినా వీరేశలింగం తోటి మానవులందరికంటె మహోన్నతుడు. ఆయన చిత్రాన్ని చూడండి : అదొక నిరుపేద తెలుగు పండితుని ప్రతిబింబం. ఆయన వాస్తవంగానే తెలుగు పండితుడు. ధోవతి, నిలువునా గుండీలు పెట్టిన కోటు, తలపాగా మాత్రమే ధరించే పండితుడు. ఆ కోటు నలిగి, ముడతలుపడి, శరీరానికి దిగవేసిన గంతలా వదులుగా వుంటుంది. ఆ పైన అస్తవ్యస్తంగా నిర్లక్ష్యంగా చుట్టుకున్న తలపాగా, అయినా – ఈ అన్నింటి వెనుకా ఇతరుల కష్టాలను తనవిగా చేసుకున్న మహనీయుని హుందాతనం. రాబర్ట్‌బర్న్ వేనోళ్ళ వర్ణించినట్టు : తన వ్యక్తిత్వ ప్రత్యేక ముద్రను "సర్వశక్తి సంపన్నుడైన భగవంతుని నుంచే సరాసరి సంక్రమింపజేసుకున్న' వాడు. నిర్మొహమాటంగా, నిర్భీతంగా, నిశితంగా బరపే చూపులు – స్పష్టంగా కళ్ళక్కడుతూనే వుంటాయి.

ప్రజాస్వామిక రాజ్యాంగం. అది ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, బహుముఖ సంఘ సంస్కరణల నుద్దేశించిన చట్టాలూ గల స్వతంత్ర భారతదేశంలో పుట్టిన వారికి – వీరేశలింగం తన సుదీర్ఘ సంక్షోభాత్మక జీవితంతో ఎంతటి బలవత్తర క్రూర జీమూత శక్తులతో పోరాడవలసి వచ్చిందో గుర్తించడం చాలా కష్టం. ఆ రోజుల్లో ప్రతి ఇంటా ఏమూలను చూచినా ఓ దయ్యం. ఏ వీధిలో చూచినా ఓ భూతవైద్యుడు. ఓ స్త్రీకి చదువు చెప్పించడం – మెదడు సక్రమంగా వున్న ఏ పురుషుడూ చేయరాని దుస్సాహసం. ఎందువల్లనంటే 'చదువుకున్న భార్య ప్రియుల్ని ఆకర్షించడానికి వుత్తరాలు రాయదటో.

ఆ రోజుల్లో బాల్య వివాహాలు సర్వసాధారణం. తరచుగా – చంక విడువలేని చంటివాళ్ళకే పెళ్ళిళ్ళుచేసే వారు. పుట్టబోయే బిడ్డలకూడా సంబంధాలు ఖాయం చేసుకోడం కద్దు. బహిరంగ వేలంతో ఆడపిల్లను కొనుక్కుని పెళ్ళాడడం సర్వసామాన్యం. ఊరు పొమ్మంటుంటే, కాడు రమ్మంటున్న వృద్ధుడు కూడా ఏ దురదృష్టపు పసిబిడ్డ తండ్రికో లంచమిచ్చుకో గలిగితే చాలు .రెండో పెళ్ళి, మూడో వివాహం, నాలుగో కళ్యాణమైనా నిస్సంకోచంగా, నిరభ్యంతరంగా చేసుకోవచ్చు. కాని ఏ స్త్రీ అయినా భర్తను కోల్పోతే ఇక ఏ పరిస్థితుల్లోనూ పునర్వివాహం చేసుకోకూడదు. ఆమె యింకా వ్యక్తురాలు కాని పసిదే కావచ్చు. అయినా నిర్బంధ వైధవ్యాన్ని అనుభవించి తీరవలసిందే.

పెళ్ళిళ్ళ సంతలో దళారీగా వ్యవహరించడం పూర్తిగా గౌరవనీయమైన వృత్తి, వేశ్య నుంచుకోవడం గౌరవ స్థాయికి గుర్తు భోగం మేళం లేనిదే ఏ శుభసందర్భమూ తృప్తికరంగా పూర్తయినట్టు కాదు. వర్ణాంతరులే కాదు ఒకే కులంలోని వివిధ శాఖలవారైనా కలసికట్టుగా భోంచెయ్యడం మహాపాపం. విదేశాలకు వెళితే సంఘవెలికి బలికావలసిందే. తోటివారిలో కొందర్ని తాకితేచాలు అపవిత్రత చుట్టుకుంటుంది. సూక్ష్మంగా చెప్పాలంటే నాటి సంఘానికి హృదయం లేదు. నైరాశ్యం, క్రూరత, వికృత లక్షణాలతో ఆత్మనే కోల్పోతున్న సంఘం అది. దాని ఆలోచనల్లో, ఆచరణల్లో ద్వంద్వరీతి. నీతి విధానాల్లో కూడా పురుషుల కొకటైతే. స్త్రీల కింకొకటి, పెద్ద అనిపించుకునే కొద్దిమంది అదృష్టవంతుల కొకటైతే, మిగతా అందరికీ మరొకటి. అసలు ఆ సాంఘిక వాతావరణమే దౌర్జన్యపూరితం. వాస్తవంగా కుళ్ళుకంపుకొడుతూ స్వతంత్ర భావాల్నీ, మానవత్వ సంచలనాల్నీ గొంతు పిసుకుతున్న వాతావరణం. ఇలాంటి సంఘ శాపాల్నీ, కర్కశత్వాన్నీ ఎదుర్కొంటూ శ్రీ వీరేశలింగం పోరాడవలసి వచ్చింది.

వీరేశలింగం ఇంతటి మహావీరుడు కాగలడని ఊహించతగ్గ లక్షణాలు ఏవీ అతని బాల్యంలో కన్పించేవి కావు. అయిదేళ్ళ వయసురాగానే తండ్రిని కోల్పోయాడు. ఏకాకిగా మిగిలిన వితంతుమాత అతన్ని అపురూపంగా పెంచింది. రాజమండ్రిలో వారి పూర్వీకుల గృహంలో ఒక భాగంమీద వచ్చే నెలసరి అద్దె నాలుగు రూపాయలు. అదే వారి ఆదాయం.

అయినా ఆ రోజుల్లో జీవనవ్యయం అత్యల్పంగా వుండేదిగనుక అదే ఆ తల్లీబిడ్డల అత్యవసరాలకు లోపం లేకుండా సరిపోయేది.

ఈడుకు మించిన తెలివితేటలు. అద్భుత ధారణశక్తి గల వీరేశలింగం ప్రతి తరగతిలోనూ మెరిట్ స్కాలర్ షిప్పులు (ప్రజ్ఞను బట్టి లభించే ఉపకారవేతనాలు) సాధించుకుంటూ, ఒక్కొక్కమెట్టే పైకెక్కాడు. బడిలో విజయాలు సాధించడం. కొన్నాళ్లు జబ్బుతో తీసుకోవడం వెలుగు, నీడల్లా వెన్నంటుతున్న ఆ కాలం ఆ తల్లీబిడ్డలకు సుఖప్రదమైనదనే అనాలి. ఆ దశలో అతనిలో విస్పష్టంగా కన్పించిన మరో గొప్ప లక్షణం. సత్యసంధత, త్రికరణ శుద్ధిగా సత్యాచరణ. అంతేగాని వీటికెదురీదే విప్లవ మనస్తత్వపు సూచనలే లేవు.

ఆ కాలపు అందరి పిల్లల్లానే అతనికీ చిన్నతనంలోనే పెళ్ళయింది. పైగా ఆ పెళ్ళి బోగంమేళాల్తో సహా తల్లిగారొక మేళం. మామగారొక మేళం పెట్టించారు. రంగరంగ వైభోగంగా జరిగింది. ఆ తర్వాత విగ్రహారాధనకు విరోధియైన వీరేశలింగం, చిన్నతనంలో మనస్ఫూర్తిగా విగ్రహ పూజ చేస్తూ, నిర్మోహ పరిత్యాగ దృష్టితో కఠోర నియమ వ్రతదీక్షలతో మహాశ్శక్తులను సాధింపవచ్చుననే ఊహాలోకంలో గడిపేవాడు.

అయితే – వీరేశలింగం ఏ వయసులో క్రమబద్ధమైన పూరాచారానుష్ఠాన ధోరణినుండి మలుపు తిరిగాడో విప్లవబీజాలు అతనిలో ఎలా నాటుకున్నాయో? ఈ అంశాలు అతని జీవితంలోనే కాక, ఆంధ్ర చరిత్రలోనే గొప్ప మలుపులనేమాట అక్షరాలా నిజం. కానీ, ఆయన తన స్వీయచరిత్రలో ఎక్కడా ఈ పరిణామానికి తగు కారణాలను ఉటంకించలేదు. అక్కడక్కడా కొన్ని స్వల్ప సూచనలు గోచరిస్తాయి. ఆయన యథాలాపంగా కేశవ చంద్రసేనుని ఉపన్యాసాల గ్రంథం చదవడం తటస్థించిదని. అప్పటినుంచీ సంఘామోదం గల అనేక విశ్వాసాలు, ఆచారాలపట్ల ఆయనలో సంశయాలు రేకెత్తాయనీ సూచనాత్మకంగా గ్రహించవచ్చు. ఆ తర్వాత కొద్ది కాలానికే పొరుగూరునుంచి రాజమండ్రికి బదిలీ అయిన ఒక ఉపాధ్యాయునితో వీరేశలింగానికి సాన్నిహిత్యం ఏర్పడింది. ఆయన ప్రభావంతో వీరేశలింగం– రాజా రామమోహన రాయ్, దేవేంద్రనాథ టాగోర్, కేశవచంద్రసేన్ వంటి బ్రహ్మసమాజ మహానాయకుల బోధల్లోగల అంతరాన్ని, లోతును గుర్తించసాగాడు. కొత్త విశ్వాసాలు ఉత్తేజాన్ని రేకెత్తించడంలో ఆయనా. మరికొందరు ఆ సమావేశాల్లో తమతమ అభిప్రాయాలను చర్చించుకునేవారు. ఈ రహస్య సమావేశాల్లో ఇంకేమేమి జరిగేనో మనం చెప్పలేం. కాని, ఆ తెరవెనుక నుంచే ఆధునికాంధ్ర నిర్మాతగా వీరేశలింగం ఉద్భవించాడు.

ఒక కొత్తదోవ తొక్కింతర్వాత, మళ్ళీ వెనక్కి తిరగడమనేది వీరేశలింగం నిఘంటువులో లేదు. ఆయనకు ముందుకు నడవడం మాత్రమే తెలుసు. బయలుదేరినప్పుడే తన ప్రయాణం బహుదూరమనీ. కష్టతరమనీ, ఎన్నో ప్రతీశక్తుల్ని ఎదుర్కోవలసి వస్తుందనీ ఆయనకు తెలుసు. తన పోరాటం మనుషులతో కాదని. తరతరాలుగా ఆత్మవంచనకులోనై బూజుపట్టిన వారి హృదయాలతోనేనని, తన కింక ఎన్నటికీ శాంతి. విశ్రాంతి అనేవి లభించవని కూడా ఎరుగును. ఇవన్నీ తెలిసినా ఆయన తన లక్ష్యాన్ని సడలించక, తన పోరాటాన్ని కొనసాగించి అన్ని అడ్డంకుల్నీ అధిగమించాలనే వజ్రసంకల్పాన్ని పాదుకొల్పుకున్నాడు. ఒకేసారి బహుముఖంగా పోరాటం నలుపుతూ నిర్దాక్షిణ్యంగా ముందుకు సాగిపోయాడు.

ఈ విప్లవ యాత్రకు కొన్ని సంవత్సరాల క్రితమే సంఘాచారబద్ధుడుగా వున్న కాలంలోనే శ్రీవీరేశలింగం రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించి, అనేక సంప్రదాయిక రచనలు చేశాడు. వాటినిగురించి ఒక్క మాటలో చెప్పాలంటే సంప్రదాయిక కవితారీతుల్లో పాండిత్య ప్రకర్షకు, కఠినతర ఛందోవిధానాలపై గల అధికారానికి నిదర్శనాలు. ఏమైనా మన అదృష్టవశాత్తూ అది ఒక తాత్కాలిక ప్రలోభదశ మాత్రమే అయింది. ఆయన తనకుతానుగా ఆలోచించి ప్రారంభించిన క్షణంనుంచీ, అప్పటికి అధిక జనామోదం పొందుతున్న జీవితపు విలువలను సవాలు చేయనారంభించినప్పటి నుంచీ ఆయనకు సాహిత్యం పట్ల గల దృక్పథం కూడా స్పష్టంగా మారిపోయింది.

కొత్తతరానికి విషయంలో, విధానంలో కూడా కొత్తదనం గల సారస్వతం అవసరమని ఆయన భావించాడు. స్వతస్సిద్ధమైన శక్తి, కూలంకుషత్వాలను జొనిపిన సారస్వతాన్ని విరివిగా సృష్టించసాగాడు. వేగంగా రచించే అలవాటున్నవాడే. ఇక చేయవలసింది ఆ వేగాన్ని ఏ కొత్త రీతుల్లో ఉపయోగించాలనే నిశ్చయం మాత్రమే. సారస్వతంలో కొత్త రీతులగ్గాను ఆయన ఆంగ్ల సారస్వతం వేపు అప్పుడప్పుడూ సంస్కృత గ్రంథాలవైపు కూడా మళ్ళవచ్చు. కాని తెలుగులో తనకుతానై ఒక వచన రచనా విధానాన్ని సృష్టించవలసి వుంది. వున్న వచనశైలి కృత్రిమంగా, ఊబిలో దిగబడినట్లుగా, నోరు తిరగనట్టిదిగా వుండేది. కొత్తరీతి ఇందుకు భిన్నంగా వుండాలి. ఈ నూత్నసృష్టిలో ఆయన చిరకాలం కీర్తినిచ్చే విజయాన్ని

సాధించాడు. ఆయన ప్రవేశపెట్టి వచనశైలి సరళంగా, స్పష్టంగా, సులభ గమనంతో వుంటుంది. నేటి శ్రోతలకు ఆ శైలిలో వైవిధ్యం, పటుసంచలనం, ఒకానొకపట్ల లయకూడా లోపించినట్లు తోచవచ్చు. అయినా అది గతకాలపు సారస్వత రీతినుంచి, ఎంతో చక్కటి, విష్పష్ట, హేతుబద్ధమైన పుంతలు తొక్కింది. ఒక జీవితాన్ని మహోన్నత కీర్తి శిఖరాలెక్కించడానికి ఆ సారస్వత సృష్టి ఒక్కటే చాలు. ఈ ఘనతకు తోడు తెలుగు సారస్వతంలో మొట్టమొదటిసారిగా ఆయన ప్రవేశపెట్టిన అనేక రచనా రూపాలను జోడించింది. అప్పుడుగాని రచయితగా వీరేశలింగం చేసిన కృషిలోని గొప్పదనం. ఠీవీ మనకర్థం కావు.

వాస్తవంగా, ఆయన ఆధునిక తెలుగు సారస్వతానికి దోవ చూపిన ఆదిపురుషుడు. డాక్టర్ కట్టనుంచి రామలింగారెడ్డి చెప్పినట్టు ; "ఆయన సారస్వతరంగంలో పండిత శైలితో ప్రవేశించి, కమనీయ, సహేతుకతలుట్టిపడే విస్పష్ట, సరళవచనా శైలిని సురుచిర సుందరంగా మహోదాత్తంగా మలచడం వరకూ పరిణమించిన రచయిత. శ్లేష, చిత్ర కవితా రీతులతోను, వికృత కృత్రిమ లక్షణాలన్నింటితోను కుప్పిగంతులు వేసే ప్రబంధ స్రష్టగా బయలుదేరిన ఆయన – తెలుగు నవల తెలుగు సాంఘిక వ్యంగ్య రచన. తెలుగు నాటకం ( అందునా సాంఘిక వర్గం). విజ్ఞానశాస్త్రం, శాస్త్రీయ జీవిత కథ, తెలుగులో స్వీయచరిత్రల సృష్టికర్తగా పయనించారు."

వీరేశలింగం రచనల్లో అనేకం యిప్పుడు కాలదోషం పట్టినట్టుండేమాట నిజమే. ఆ రచనలు సృష్టించబడిన కాలంలో పాఠకులను అలరించిన 'నవనీత' ఇప్పుడుండదు. వాటిని రచించేప్పుడు ఆయనలో వుండిన హడావుడి, వ్యసనతర ఆవేశధోరణుల కారణంగా – శ్రేష్ఠగుణం దెబ్బతింది కూడా. ఆయన మొట్టమొదట ఏదివ్రాస్తే అదే ఖాయపుప్రతిగా చెలామణిచేశాడు గాని, దాన్ని మరోసారి చదవడం, సవరించడం, సాపువ్రాయడం వంటివి ఎరుగడు. ప్రతి పేజీనీ – చివరి పంక్తి మీద సిరా అన్నా ఆరీ ఆరకముందే అచ్చుకు పంపించడంకద్దు. ఆయన మేడమీద కూర్చుని రాస్తూ, కిందిభాగంలో వున్న అచ్చాఫీసులోకి ఎప్పటికాయితం అప్పుడే జారవిడవడానికి వీలుగా ఓ కంత చేయించాడు. ప్రపంచంలో మరే రచయితైనా ఇలాంటి పనిచేశాడని నేనింతవరకూ వినలేదు.

ఆయన ఒకోసారి ఎంతవేగంగా, ఎంత తీవ్రావేశంతో రచనలు సాగించేవాడో తెలుసుకోడానికి ఆయన స్వీయ చరిత్రలోనే ఒక కథవుంది. పిల్లల్లేని పెద్దమనిషొకాయన వీలునామా వ్రాయకుండానే చనిపోయాడు. అతని బంధువులు శవంచుట్టూ చేరి, ఆయన కెవరు తలగొరువు పెట్టాలనే విషయమై కాట్లకుక్కల్లా కొట్లాడుకోవడం ప్రారంభించారు. ఎవరు శ్రాద్ధకర్మలు జరిపితే వారే వారసులనే ముద్రపడి, మరణించినవాని ఆస్తిపాస్తులు చట్టరీత్యా పొందవచ్చుననే తాపత్రయంతోనే ఇదంతా. ఈ సంగతి పంతులుగారి చెవిని పడింది. అప్పటికప్పుడు పచ్చిస్వార్థంతో జుగుప్సాకరంగా ప్రవర్తిస్తున్న ఈ గుంపును విమర్శిస్తూ సునిశితంగా దెబ్బకొట్టే వ్యంగ్యనాటిక నొకదాన్ని వ్రాసి, అచ్చువేయించి, శవం చుట్టూ చేరిన బంధువులు ఆ పోట్లాట ముగించకముందే ఊరంతా పంచిపెట్టించాడు. వీసమెత్తు సంశయంమైనాలేని మహామేథావియైనా సరే. ఇంతటి విద్యుల్లతావేగంతో రచనలు చేస్తే, వాటిలో లోపాలూ, అపభ్రంశాలూ ఉండకతప్పదు. వీరేశలింగానికి ఈ విషయం బొత్తిగా తెలియదనుకోలేము. తన స్వీయచరిత్రలో తన సారస్వత కృషిని సమీక్షిస్తూ తాను సాంఘిక, మత విషయ సంస్కరణలలో మునిగివుండకపోతే, రచయితగా మరింత రాణించి వుండేవాడినేమోనని రాసుకున్నారు. తన రచనల్లో ఎలాంటి లోపాలున్నప్పటికీ. అవి ప్రప్రథమ ప్రయోగాల వంటివనీ. తన తరువాతివారు ఆ రీతుల్ని మరింత పురోగమింపజేయగలరని కూడా రాశారు. తనమట్టుకుతాను దోవాతెన్నూ తోచని కీకారణ్యంలావున్న ప్రదేశంలో భావితరాల వారి ప్రయాణ సౌలభ్యంకోసం తానొకచక్కని దోవనేర్పరచగలిగానని సంతృప్తిపడ్డాడు.

సృజనాత్మక రచయితగా ఆయనలో వున్న లోపమే సంస్కరణ ప్రబోధకుడుగా ఆయనకు పట్టుగొమ్మ అయింది. సంస్కణోద్యమానికి నిర్విరామ రచనా శక్తి అవసరం. అనుక్షణం వేయి కళ్ళతో చూస్తూ, నిశితంగా పరిశీలిస్తూ, ఎదుటివార్ని ప్రేరేపిస్తూ, కలాన్ని సదా చేపట్టి వుండాలి. ఆ కలం భావ సౌకుమార్యాన్ని గాని, నొప్పించరాదనే సంశయాన్ని గాని గుర్తించరాదు. ఎదుటివార్ని గాయపరచడానికి ఇష్టపడ్డమే గాక ఖండించడానికి క్యూడా వెనుకంజ వేయకుండా వుండాలి. అవసరమైతే చిట్టంకట్టిన బుర్రల్ని బ్రద్దలు చేసే సుత్తి కూడా ఉపయోగపడాలి. వీరేశలింగంగారి కలానికి ఈ లక్షణాలన్నీ వున్నాయి. అంతకంటే ఎక్కువ గుణాలు కూడా కద్దు.

ఆ కలంతోనే ఆయన పత్రికలు, కరపత్రాలు, సంభాషణలు, హాస్యనాటికలు, వ్యంగ్యరచనలు, ప్రచార రూపాలు సృష్టించారు. ఎంతటి అలజడి రేకెత్తించిన ఉద్యమం అది. అది ఎన్ని రంగాల్లో కొనసాగింది. ఆ ఉద్యమం గమనం

స్త్రీ విద్యనుంచి నిర్గుణ నిరూ ఏకేశ్వరోపాసన వరకూ కొనసాగింది. ఈ మధ్యలో దయ్యాలంటే భయపడే అల్పత్వాన్ని ఎగతాళి చేసింది. విగ్రహారాధనను ఖండించింది. బాల్య వివాహాల తప్పిదాన్నీ మూర్ఖత్వాన్నీ బట్టబయలు చేసింది. వితంతు పునర్వివాహాల్ని ప్రబోధించింది. బోగం మేళాలను తూర్పారబట్టింది. వర్ణాంతర సహపంక్తి భోజనాల పద్ధతిని ప్రోత్సహించింది. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రసరింపజేసింది. అధికారోద్యోగ బృందంలో గల లంచగొండితనాన్ని రూపుమాపింది. ఇంకెన్నో ముఖాల విజయం సాధించింది. ఒక్క వాక్యంలో చెప్పాలంటే తెలివిడి, స్వచ్ఛందత గల పరిపూర్ణ జీవితాన్ని గడపవలసిందని ప్రజానీకానికి చేసిన పటుతర విజ్ఞప్తే ఈ ఉద్యమం.

ఛాందసాచార, మౌఢ్యశక్తుల ప్రతినిధులు ఎంతో దృఢంగా, నిశితంగా, రాక్షసంగా ఎదిరించినప్పటికీ శ్రీవీరేశలింగంగారి నిరంతర ప్రబోధం క్రమక్రమంగా విజయాలు సాధిస్తూ ఆంధ్రదేశంలో 'విజ్ఞాన రేఖల యుగాన్ని' ప్రభవింపజేసింది. ఇది సహాయ సంపత్తులులేని ఒకే ఒక్క వ్యక్తి కృషి. అయినా దీన్ని వోల్టేర్ నుంచి కన్‌డోర్‌సెట్ వరకూ గల ఫ్రెంచి విప్లవకారులంతా కలసి సాధించిన (అంతటి ప్రపంచ పరివ్యాప్తి ప్రాభవం లేకపోయినా) మహత్త్వంతో పోల్చవచ్చు.

వీరేశలింగం కార్యశూరతగల ఆదర్శవాది. అందువల్ల తన ప్రబోధాలను ఆచరణలో పెట్టి బలిష్ఠం చేసేవాడు. విద్య, విజ్ఞానాలు వ్యాపింపజేయడానికి విద్యాలయాలు ప్రారంభించాడు. అప్పటి కాచరణలో వున్న పద్ధతిని వదిలి హరిజనుల్ని కూడా తన విద్యాలయాల్లో చేర్చుకున్నాడు. దురదృష్టవంతులైన బాలవితంతువులు తమ తల్లిదండ్రుల నిర్దాక్షిణ్య పంజరాలనుంచి తప్పించుకుని స్వతంత్రులు కాదలచినప్పుడు, పునర్వివాహితులు కాదలచినపుడు వారి కాశ్రయ మిచ్చేందుకు వితంతు శరణాలయం నెలకొల్పాడు. తనకు బిడ్డల్లేనందువల్ల తన సహాయాన్నర్థించే ప్రతి ఒక్కరికీ దత్తు తండ్రి అయ్యాడు.

ఆయన ఒక పురమందిరం కట్టించాడు. తన పుస్తకాలన్నీ దానంచేసి ఒక గ్రంథాలయ స్థాపనకు కారకుడయ్యాడు. పుస్తక పఠనాన్నీ చర్చలనూ ప్రోత్సాహించాడు. చివరికి తన ఆస్తిపాస్తులన్నింటినీ తను స్థాపించిన సంస్థల నిర్వహణార్థం విరాళంగా ఇచ్చివేశాడు. వీరేశలింగం తన కార్యక్రమాలకుగాను ఇతరుల నుండి స్వీకరించిన పెద్ద మొత్తం ఒకే ఒక్కటి. పిఠాపురం రాజావారిచ్చిన ఆ మొత్తంతో రాజమండ్రిలో తను స్థాపించిన హైస్కూలుకు భవనాలు కట్టించాడు. ప్రజోపయోగానికై తాను నిర్మింపజేసిన ఇతర భవనాలకూ, నెలకొల్పిన సంస్థలకూ వెచ్చించిన ధనంలో హెచ్చుభాగం తన పుస్తకాల మీద వచ్చిన ఆదాయమే.

ఆయన జీవితం నిరాడంబరమైంది. అసలు ఆయనకి స్వంతానికిక్కావలసింది చాలా స్వల్పం. వ్యక్తిగత ఖర్చు విషయంలో ఆయన దాదాపు పిసినారిగా వుండేవాడు. ఆయన 'విలాసంగా ఖర్చు పెట్టా'డని చెప్పుకోదగ్గవి ఒకే ఒకటుంది. అది రాజమండ్రిలో తాను ఏర్పరచిన 'ఆనందోద్యానం'. ఆ తోటకు మాత్రం ఎక్కువగా ఖర్చు పెట్టేవాడు. భారతదేశంలో ప్రతి ప్రాంతంనుంచీ రకరకాల మొక్కలు సేకరించి, ఈ వనంలో నాటించి, తండ్రిలా పెంచేవాడు. ఆయన వృద్ధాప్యంలో ఈ వనంలో కూర్చుని అందలి నిత్యవసంత శోభనూ, నును లేచివుళ్ళ సౌందర్యాతిశయాన్నీ ఆస్వాదిస్తూ గంటల తరబడి కాలం గడిపేవాడు. బహుశా తాను కలలుగన్న 'ఆదర్శ సాంఘిక వ్యవస్థ' నిత్య నూతనత్వాన్ని సంతరించుకోవడం ఆ వనలక్ష్మిలో దర్శించుకునేవాడేమో.

ఆయన ధర్మపత్ని శ్రీమతి రాజ్యలక్ష్మమ్మను గురించి క్లుప్తంగానైనా చెప్పకపోతే వీరేశలింగంగారికి మనం సమర్పించే శ్రద్ధాంజలి పరిపూర్ణం కాదు. సమకాలిక సంఘంతో నిత్య సంఘర్షణపడుతూ, విగ్రహారాధనా వ్యతిరేకియైన భర్తతో కాపురం చెయ్యడం అంత తేలికక్కాదు. ఆయన్ని ఉత్తేజపరిచిన విశ్వాసంగాని, ఎన్ని అవాంతరాలు వచ్చినా అంతిమ విజయం మాత్రం మనదేననే ఆత్మవిశ్వాసపు పట్టుదలగాని ఆమె ప్రకృతిలోలేవు. ఆమెకున్న విద్య అంతంత మాత్రం, పుట్టి పెరిగిన వాతావరణం పూర్తిగా పూర్వాచారసంపన్నం. నిమ్మకు నీరెత్తినట్టు మిన్నకుండే మనస్తత్వం ఆమె కీర్తి ప్రచారాలకోసం ప్రాకులాడలేదు. అయినా భర్త చెప్పేదాన్నీ, చేసేదాన్ని సంతోషంగా సమర్థిస్తూ, ప్రతి విషయంలోనూ ఆయనకు దన్నుగా నిలబడింది. ఒక విధంగా చూస్తే వీరేశలింగం భరించిన కష్టనష్టాలకంటె, ఆమె సహించినవే గురుతరాలు. తనను శరణుజొచ్చిన ప్రతి బాలవితంతువుకూ ఆశ్రయమివ్వడం ఆయనకు సులభమే. కాని రాజ్యలక్ష్మమ్మ అలా చేరిన వారికందరికీ తిండీతిప్పలూ చూడాలి. గుడ్డల దగ్గర్నుంచీ అన్నీ సమకూర్చాలి. వాళ్ళ తల్లుల్ని మరపించే ప్రేమ. వాత్సల్యాలతో సాకాలి. ఇదంతా సాధారణ స్త్రీలు చెయ్యగల పనేమీ కాదు.

ఆమె వంటవాణ్ని పెట్టుకుందామన్నా సాంఘిక కట్టుబాట్ల భయం కారణంగా ఎవరూ ఆ ఛాయలకు వచ్చేవారు కాదు.

ఇతర పనిమనుషులైన దొరికేవారు కాదు. ఇంట్లో చేరే ఆశ్రితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండేది. అందునా పరస్పర పరిచయం లేని వివిధ ప్రాంతాల నుంచీ వచ్చే, విభిన్న మనస్తత్వాలు గల వారినందర్నీ తన బిడ్డల్లా సాకాలి. ఆత్మధైన్యంతో కుములుతూండే ఒక్క వితంతువును సంబాళించాలన్నా తలప్రాణం తోకకొస్తుంది. అలాంటి వితంతువుల్ని అనేకమందిని ఆమె తృప్తిపరచవలసి వుండేది. నానాయాతనా పడి ఆ బాల వితంతువులకు పునర్వివాహం చేసి కాపురానికి పంపించిన తర్వాత కూడా, కొందరు పదేపదే ఈ దంపతుల సహాయం కోరుతూ ఇబ్బంది పడుతుండేవారు. వాళ్ళు ప్రత్యేక సంసారం పెట్టుకోడానికి ప్రాథమిక సహాయాలన్నీ చేసినా తృప్తికపడక తమకు నెలసరిబత్తాలు కావాలనీ, కొత్తబిడ్డ పుట్టినప్పుడల్లా తమకింకా ఎక్కువ సహాయం చెయ్యాలనీ అడుగుతూ ఈ దంపతుల్ని దుంపతెంపుతూండేవారు. ఎవరి మేలుకోసం తాము నానాయాతనలూ పడి, సమాజానికి దూరమూ, త్యాగాలు చేస్తున్నారో వాళ్ళే కృతఘ్నులై, కఠిన దుర్భాషలాడుతూంటే ఈ పుణ్య దంపతులు సహించవలసిన సందర్భాలు కూడా చాలా వున్నాయి.

ఆమెవలె ఆత్మస్థైర్యమూ, భర్తను పూర్తిగా ఆరాధించే తత్త్వమూ లోపించిన మరే స్త్రీ అయినా సరే ఈ కష్టనష్టాల తాకిడికి, గుండె పగిలిపొయ్యేది. వీరేశలింగం ఎంతటి సాధారణ ఉదాత్తస్వభావాలు గలవాడో రాజ్య లక్ష్మమ్మ అణగి మణగియుండే తన సహజ ధోరణిలో అంతకంటే అసాధారణ ఉదాత్తత గల సాధ్వి.

అంతకుముందు తరంవారైన రెనడే. విద్యాసాగరుల వలె వీరేశలింగం కూడా రాజకీయ దృక్పథంలో మితవాది. అంటే, ఆయన రాజకీయ స్వాతంత్ర్యాశయాన్ని విశ్వసించలేదని కాదు. బ్రిటిష్ వారితో గల సంబంధం మొత్తంమీద భారతీయుల జీవిత విధానాల్ని ప్రభావితం చేసి బాగుపరచగలదని ఆశించేవారు. మన సంస్కృతి, నాగరికత బూజుపట్టి ఊబిలో కూరుకుపోయిన తరుణంలో బ్రిటిష్‌వారి సంస్కృతీ ప్రభావం కొంత స్వతంత్ర, సహేతుకతల్ని అందిస్తున్నదని ఆయన దృఢవిశ్వాసం. మనం పొందే రాజకీయ స్వాతంత్ర్య ఫలాన్ని మనం పూర్తిగా అనుభవించాలంటే అంతకుముందే సాంఘిక, విద్యారంగంలో సంస్కరణలు పాదుకొనాలని ఆయన ఉద్ఘాటించారు. అజ్ఞానంలో ఛాందసాలు, మూఢవిశ్వాసాలతో మునిగి తేలుతున్న జాతి తనకు తానుగా విజ్ఞతగల ప్రభుత్వ విధానాన్ని అమలు జరుపుకోలేదు. సర్వతోముఖాభివృద్ధిని సాధించలేదని ఆయన వాదం. జాతీయ కాంగ్రెసు మొదటిరోజుల్లోనే అందులో సభ్యుడుగా చేరారు. ఒక వార్షిక సమావేశానికి ప్రతినిధిగా కూడా హాజరైనారు. సామ్రాజ్యవాద ప్రతినిధియైన లార్డ్ కర్జన్ ఉత్తర్వుల ప్రకారం బెంగాలు విభజన జరిగిన తర్వాత, కాంగ్రెసు ఆధ్వర్యాన తలెత్తిన 'వందేమాతరం' ఉద్యమంతో వీరేశలింగం ఏకీభవించలేకపోయాడు. అందువల్ల ఆ కాలపు యువకుల్లో ఆయనపై కొంత విముఖత ఏర్పడింది. అయినా ఆయన తన విశ్వాసాన్ని సడలించుకోక, సహజ ధైర్యాన్ని ప్రదర్శించాడు. తన రాజకీయాభిప్రాయాన్ని విడవకుండా, విద్యా సాంఘిక సారస్వత రంగాల్లో తనకృషిని మరింత శక్తిమంతంగా కొనసాగించాడు.

'సమగ్రంగా పరిశీలిస్తే, వీరేశలింగం ఈ ఆధునిక యుగపు ఆంధ్రుల్లో అగ్రగణ్యుడు. ఒక నూతనయుగాన తరుణ పరిణామాల్ని ఆయన తన జీవితంలో క్లుప్తంగా ప్రతిబింబించారు.. అనేకమంది తామున్న యుగంమీద ఎలాంటి కాంతినీ ప్రసరించకుండానే బ్రతికి పోతారు. వారికి వెలుగునివ్వడంగాని, వెలుగును పొందడంగాని చేతగాదు. నిత్యనవోత్తేజాన్ని పొందుతూ, నవనవోన్మేషతను సృష్టించేవాడే మహాపురుషుడు. నిరంతర పరిణామ, పురోగమనాలనే ఫలభరిత సూత్రమే నవోత్తేజం. అదిలేని జీవితం వర్ధి చెత్తగా, జడపదార్థంగా, అవాంఛనీయంగా తయారవుతుంది. వీరేశలింగం ఈ నవయుగ నిర్మాతల్లో ఒక స్రష్టగనుక. ఈ యుగభావాలను ప్రతిబింబించాడు. ఒక వేళ ఆయన ఈ యుగకర్త అయితే, అది తానీ యుగసృష్టిలో ఒక వ్యక్తి కూడా కావడంవల్లనే. యుగధర్మంచేత ప్రభావితం కావడానికి సిద్ధపడిన వారు మాత్రమే యుగధర్మాన్ని సృష్టించగలరు."

డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి చెప్పిన ఈ మాటలతో కొద్దిగా వ్యతిరేకిస్తున్నాను. వీరేశలింగం ఆంధ్రదేశంలో నవయుగ 'నిర్మాతల్లో ఒక స్రష్ట' మాత్రమే కాదు, ఆయన నవయుగానికి ఏకైక సృష్టికర్త అని నా అభిప్రాయం. రాజారాం మోహన్ రాయ్‌కి రవీంద్రనాథ టాగోర్ సమర్పించిన ప్రశంస ధోరణిలో, నేను వీరేశలింగాన్ని 'ఆంధ్రదేశంలో మొట్టమొదటి ఆధునికవ్యక్తి'యని అభివర్ణిస్తున్నాను. శత్రువులకు సింహస్వప్నం, అనేక తీవ్ర యుద్ధాలలో విజయుడు, స్వతంత్ర భావుకత నిర్భయ కార్యాచరణలకు మురువుబొట్టు. అభ్యుదయ విజ్ఞానాలకు వైతాళికుడు, సారస్వతస్రష్టగా, విద్యావేత్తగా, సంఘసంస్కర్తగా ఎంతటి మహత్తర వ్యక్తో మానవుడుగా అంతకంటె మహాన్విత మనీషి. ♦

## సంతాపం

- పొగడదొరువు
7382168168



ఛ్ఛీ.
ఛ్చ..ఛ్ఛ!
ఎంత ఘోరం
ఎంత అన్యాయం!!

అయ్యో..
అయ్యయో!!
ఇంత దారుణమా
ఇంత రాక్షసత్వమా!!

ఎందుకీ కన్నీళ్లు?
ఎవరికోసమీ సంతాపం
సానుభూతి సందేశాలు

ఆకాశంలో సగాన్ని
అవమాన ఘనంగా
మార్చింది నీవు కాదూ?
అసహాయ శూరను
నిస్సహాయ బేలగా
చేసింది నీవు కాదూ?

వీరయై, ధీరయై
సివంగిలా ముందుకురికి
మనుషుల మందను
మునుముందుకు నడిపించింది
ఆమె కాదూ!

కావాలంటే చరిత్ర చూడు
కాలం చెత్తబుట్టలోకి విసరిన
పరిణామ క్రమాన్ని చూడు
పడుతూ లేచిన మనిషి నడక చూడు

అప్పుడు ఆమె
ఆకాశంలో సగం కాదు!
ఆకాశమే ఆమె!
నడక నేర్పింది
నడత నేర్పింది
సబలై, సవ్యసాచై
పోరుచేసింది, నీ కడుపు
కింత కూడైంది!
ఆమె లేనిదే నీ వెక్కడ
నీ వికాసమెక్కడ!

నీవేం చేశావు?
మనువయ్యావు
మనిషిగా మాయమయ్యావు
ఆకాశానికి ఆంక్షలు పెట్టావు
స్వేచ్ఛా రూపికి
బానిసత్వాన్నే బతుకు చేశావు
అత్యాచారాల, అకృత్యాల
ఆటబొమ్మగా మార్చావు
సుభద్రను అభద్రగా చేశావు
భద్రతెక్కడంటూ భోరుమంటున్నావు!

సంతాపం ఆమెకు కాదు..
సానుభూతీ ఆమెకు కాదు
భద్రత లేనిది ఆమెకు కాదు
నీకే ... నీ భవితకే! ♦

## ప్రేమ 'కులం'

- వారణాసి భానుమూర్తి

ఎన్ని కలాలు రాసినా
ఎన్ని గళాలు విప్పినా
కుల రహిత సమాజం ఎడారిలో ఎండ మావేనా?
ప్రేమికుల ' ప్రేమకులం ' గాలిలో పెట్టిన దీపమేనా?
కులాల అంతరాలు ప్రేమికుల పాలిట శాపాలేనా?

'అమృత వర్షిణి' ఎదలో పుట్టిన ప్రేమ
కులాల అడ్డు గోడలు తెంచుకొని
అన్నీ వదులుకొని తానే అన్నీ అయి
ప్రణయ వర్షాన్ని కురిపించింది ' ప్రణయ్ ' కోసం
సమాజం మారనీ మారక పోనీ
వెలి వెయ్యనీ ...చెడు చెయ్యనీ
కులం పట్టింపులు మనకొద్దని
రెండు జీవితాలు పెనవేసుకొని
ఆశల రెక్కలతో
విహరించిన ప్రేమపక్షులు 'అమృత ప్రణయ్'
నడిబజార్లో కరుణ లేని ముష్కరుడు
చేతిలో ప్రేమ బలి అయింది
సమ సమాజం సిగ్గుతో తల వంచింది
ప్రేమకు అక్కడ సమాధి కట్టింది
పరువుకు, అభిజాత్యానికి , ధన బలానికి
ప్రేమ పక్షుల జీవితం ముక్కలయింది.



సమ సమాజం , కుల రహిత సమాజం కోసం
ఈ బలిదానం అంకురార్పణ కావాలి
ప్రేమికులకు కుల మత రహిత సమాజాన్ని ఇవ్వాలి
వాళ్ళ బ్రతుకుల్లో పున్నమి వెలుగులు పూయించాలి
కలాలు గళాలు విప్పి కవులు గర్జించాలి
భావి తరాల ప్రేమ నదులు ప్రవాహమై ముందుకు ఉరకాలి!

**( ఇటీవల మిర్యాల గూడలో జరిగిన సంఘటన. కులాంతర వివాహం చేసుకొన్న ఒక ప్రేమ జంటకి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ రాసిన కవిత)**



# నీలిమ

- డా॥ ఎం. ప్రగతి
9440798008

నా పేరు నీలిమ. "నీ రంగుకు తగినట్టే పేరు పెట్టింది మీ అమ్మ." అంటూ నెత్తి మీద మొట్టేది మా అమ్మమ్మ. ఆవిడ చేత్తో మొట్టింది, చేత్తో ముట్టకుండా అనేక మొట్టికాయలు నా నెత్తిన నా చిన్ననాటి నుంచీ పడుతూనే ఉన్నాయి, నా రంగును గుర్తు చేస్తూ. ఇప్పుడెందుకు ఈ సంగతి చెబుతున్నానంటే అలా మొట్టిన కొన్ని చేతులు నన్నో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించాయి. వెళ్ళాలా, వద్దా అన్నది నా సమస్య. ఆ సంగతి తర్వాత చెప్తా కానీ, ముందు నాకెంతో ఇష్టంగా నీలిమ అని పేరు పెట్టుకున్న మా అమ్మ చెప్పే కథ వినండి, అహ, చదవండి. అన్నట్లు అమ్మ పేరు చెప్పలేదు కదూ, శ్వేత....

◆◆◆

ఒక స్త్రీ ముఖం వెలిగిపోయేది రెండు సందర్భాలలో: ఒకటి ప్రేమలో పడినపుడు, రెండు తల్లి కాబోతున్నప్పుడు. ఏదో సినిమా లో డైలాగిది. నా ముఖం ఇప్పుడు రెండోసారి వెలిగిపోతోంది. అవును, నేను తల్లిని కాబోతున్నాను. "అబ్బ అసలే తెల్లగా ఉండే నీ ముఖం ఈ కొత్త కాంతితో మరింత మెరిసిపోతోంది శ్వేతా!" మురిసిపోయేవాడు నా భాగస్వామి. అమ్మ ఎండుమిర్చి, ఉప్పు ముఖం చుట్టూ తిప్పి దిష్టి తీయడం మరచిపోయేది కాదు యేరోజూ. "నీకు యాపిల్ పండు లాంటి కొడుకు పుడతాడు చూస్తుండు." అనేవాళ్ళు బంధు జనమంతా. ముందే తల్లినవుతున్నాననే ఆనందం, మరోవైపు ఈ మాటలతో ఉబ్బితబ్బిబ్బయ్యేదాన్ని నేను. నెలలు నిండి, బిడ్డ పుట్టి తల్లినయ్యాను నేను. కానీ పుట్టింది యాపిల్ పండూ కాదు, అబ్బాయీ కాదు. తక్కువ ఛాయతో, సన్నగా పీలగా ఉన్న ఆడపిల్ల. కానీ నాకు తల్లినయ్యాననే ఆనందం తప్ప ఇంకేవీ తెలీదు. ఒక బిడ్డకు జన్మనివ్వడం అద్భుతంగా అనిపిస్తోంది నాకు. నా పాప నాకు అపురూపంగా కనిపిస్తోంది. "ఏంటే ఇది, ఈ పిల్ల ఇంత నల్లగా ఉంది." అమ్మ మాటలు నా చెవులకు నచ్చలేదు. బలహీనంగా ఉన్న నా పాపను గుండెకు హత్తుకున్నాను.

నెల రోజులు తిరిగేసరికి పాప కాస్త పుంజుకుంది. ఆపైన ఎప్పుడూ ఇక బలహీనంగా మారే పరిస్థితి రాలేదు. బొద్దుగా, చురుగ్గా, ఆరోగ్యంగా ఎదుగుతున్న నా కూతుర్ని చూస్తే నాకు సంతోషం. పాపకు 'నీలిమ' అని పేరు పెడతానన్నా. "అవున్లే, సరైన పేరు." అమ్మ నిరసనగా అన్నది. "అవును, అన్ని వర్ణాలను తనలో నిలుపుకుంటుంది, అన్ని ఇక్కట్లనూ అధిగమిస్తుంది." బదులుకు బదులిచ్చి అదే పేరు పెట్టాను. నీలిమ అంటే నలుపే కాదు, నీలం కూడా. నీలాకాశమంత విశాల దృక్పథం, నీలి సంద్రమంత లోతైన ఆలోచన ఉండేట్లుగా నా కూతురు ఎదగాలని ఆ పేరు పెట్టాను. పాప

ముఖంలో కళ, శరీరంలో చలాకీదనం నన్నే కాదు చూసే వారందరినీ ఆకట్టుకునేవి. అయినా సరే, మేని ఛాయ గురించి ప్రస్తావించకుండా వదిలేవారు కాదు. "ఆ రంగు కాస్త తెల్లగా ఉంటే ఇంకా బాగుండేది." "వాళ్ళమ్మ రంగులో సగం కూడా రాలేదు." ఇలాంటి వ్యాఖ్యానాలు ఆరోగ్యంగా, ఆనందంగా ఎదుగుతున్న నీలిమ జీవితానికి ఇదో సమస్య అన్నట్లు తయారు చేస్తున్నాయి. జనాల మాటలు అర్థం కాకపోయినా ఆ మాటల్లో తేడా ఆ చిన్నారి మనసుకు తగలక పోలేదు. 4–5 ఏళ్ళ వయసులో తన చిట్టి చేతులతో నా చెంపలు నిమరడం, బుగ్గలు లాగడం చేసేది. మరికొంత పెద్దయ్యాక "నేనెందుకు నీలా లేను?" అంటూ ప్రశ్నించేది. "ఎందుకంటే నువ్వు నాకంటే ఆరోగ్యంగా, ఇంటలిజెంట్‌గా ఉండాలి కాబట్టి." నా రెండు చేతుల్లోకి తన ముఖాన్ని తీసుకొని మురిపెంగా అన్నాను. తనకు నా సమాధానం సంతృప్తి నివ్వలేదు కానీ ఏమీ మాట్లాడలేదు.

పదేళ్ళ వయసులో అనుకుంటా... "ఫలానా సబ్బు వాడితే తెల్లగవుతారంటమ్మా, అత్త చెప్పింది. తీసుకురామ్మా." గోముగా అడిగింది. "ముఖానికున్న జిడ్డు పోవడానికి సబ్బు వాడతారు. సబ్బుతో రంగు మారదు. ఇలాంటి మాటలు వినకు." నా మాటలు తనకు రుచించలేదు. "నువ్వెప్పుడింతే." కోపంగా వెళ్ళిపోయింది. ఈ మేని ఛాయ క్రమంగా మా మధ్య శత్రుత్వాన్ని తెచ్చిపెడుతుందా అని నాకు భయమేసేది. నీలిమ నాపట్ల అసూయను, ద్వేషాన్ని పెంచుకుంటుందా? చర్మం రంగు పట్ల అపోహను పోగొట్టి, తనను తాను ప్రేమించుకోవడం నీలిమకు ఎలా నేర్పించాలి? పెద్దగవుతున్న కొద్దీ అందరూ తన రంగు గురించి మాట్లాడుతుంటే నీలిమకు కోపం వచ్చేది, మాట్లాడేవాళ్ళతో పాటు నామీద కూడా. "నువ్వెందుకు నీ రంగు జీన్స్ ను నా కివ్వలేదు? నీలా ఉండాలంటే ఏం చెయ్యాలి?" ప్రశ్నలతో నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేది. దానికితోడు పత్రికలలో బోలెడు చిట్కాలు, టీవీ చానళ్లలో దిక్కుమాలినన్ని ప్రకటనలు. "అమ్మా ఈ ఫెయిర్ నెస్ క్రీము వాడితే తెల్లగవుతారట." అంటూ ఏదో క్రీము తెచ్చుకొని వాడింది. దాంతో కొద్ది రోజులకు ముఖం మీద ఇన్ఫెక్షన్ వచ్చింది. డెర్మటాలజిస్టు దగ్గరికెళ్ళి ఆ ఇన్ఫెక్షన్ తగ్గించుకోవడం పెద్ద పనయింది.

ఇక స్కిన్ కాంప్లెక్షన్ గురించి వివరించాల్సిన సమయం వచ్చిందనిపించింది నాకు. అనుకోకుండా ఓసారి బజారులో ఫారినర్స్ కనిపించారు. వాళ్ళను చిత్రంగా చూస్తూ అడిగింది నీలిమ, "వాళ్ళ చర్మం రంగేంటి అంత తెల్లగా ఉంది?" "వాళు ్ళ వేరే దేశం వాళ్ళు, అలాగే ఉంటారు." చెప్పాను. "ఇతర దేశాల వాళ్ళందరూ అలాగే అంత తెల్లగా ఉంటారా?" సందేహం తీరలేదు. "లేదు, కొన్ని దేశాల ప్రజలు చాలా నల్లగా ఉంటారు." "నా లాగానా?" అనుమానంగా అడిగింది. "కాదు, ఇంటికెళ్ళాక చెప్తాను."

ఇంటికెళ్ళాక తనకంటే ముందు నేనే మొదలు పెట్టాను. క్రికెట్ ఆడుతున్న వెస్టిండీస్, జింబాబ్వే ఆటగాళ్ళను టీవీలో చూపించాను."ఇదేంటి ఇంత నల్లగా ఉన్నారు? వీళ్ళు కూడా ఫారినర్సే కదా!" అమాయకంగా అడిగింది. "చర్మం రంగును నిర్ణయించేది అందులోని మెలనోసైట్లు అనే కణాలు విడుదల చేసే మెలనిన్ అనే ప్రోటీను. సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల నుండి శరీరాన్ని రక్షించడానికి ఈ మెలనిన్ ఉపయోగపడుతుంది. ఆయా దేశాల శీతోష్ణస్థితిని బట్టి అక్కడి ప్రజల చర్మంలో మెలనిన్ తయారవుతుంది. శీతల దేశాలలో ఎండ ప్రభావం తక్కువ కనుక మెలనిన్ తక్కువ తయారవుతుంది కనుక తెల్లగా ఉంటారు. ఎండ ఎక్కువగా ఉండే దేశాలలో మెలనిన్ ఎక్కువ ఉత్పత్తవుతుంది కనుక నల్లగా ఉంటారు. ఇది ప్రకృతి సిద్ధంగా చర్మం తనకు తాను చేసుకునే సంరక్షణ విధానం. మన దేశ శీతోష్ణస్థితికి తగినట్లుగా మరీ తెల్లగా కాకుండా, నల్లగా కాకుండా మధ్యస్తంగా ఉంటారు. ఎక్కువ బయట ఎండలో పని చేసేవారికి సహజంగా ముదురు రంగులోకి చర్మం మారుతుంది. సుఖంగా నీడన పెరిగిన వారి ఛాయ తెల్లగా ఉండొచ్చు. తల్లిదండ్రుల నుంచీ జన్యుపరంగా చర్మపు రంగు నిర్ణయింపబడవచ్చు. అయితే ఉత్పరివర్తనల (మ్యుటేషన్స్) వల్ల భిన్నంగా కూడా రావచ్చు. మన శరీరం ఎలా ఉన్నా మనం యాక్సెప్ట్ చేయగలగాలి. మనకు మనం నచ్చకపోతే మిగితా వాళ్ళకెలా నచ్చుతాం? మనం వాడే ఫెయిర్ నెస్ క్రీములు చర్మంలో మెలనిన్ తయారు కాకుండా ఆపుతాయి. దానివల్ల చర్మం తెల్లబడొచ్చు కానీ చర్మ వ్యాధులు, క్యాన్సర్ వంటివి వస్తాయి. ఇప్పుడు చెప్పు, ఈ క్రీములు పూసుకోవడం మంచిదేనా?" నీలిమలో కొద్దిగా ఆలోచన మొదలయింది. "మరి టీవీల్లో అన్ని ప్రకటన లెందుకు? అవి మంచివి కావని తెలిసినా అందరూ ఎందుకు వాడుతున్నారు?" ప్రశ్న లడక్కపోతే నీలిమ కాదు గదా! "ప్రకటనలు వాళ్ళ ఉత్పత్తులు అమ్మి లాభాలు సంపాదించుకోవడానికి, వాళ్ళే

తెల్లగా ఉంటేనే అందం అనే అపోహను జనం మధ్య ప్రచారంలో పెడతారు. అది తెలియని జనం మోసపోతుంటారు." నీలిమ ముఖంలో మార్పు గమనిస్తూ చెప్పాను. "ఒక వ్యక్తి స్వంత వ్యక్తిత్వంతో ఎదిగి, మంచి పనులు చేస్తే అప్పుడు ఆ వ్యక్తి గొప్పతనం, మంచితనం గురించి మాత్రమే గుర్తిస్తారు తప్ప ఆ మనిషి శరీరం రంగు, ఆకారం గురించి మాట్లాడరు. ఆ గుర్తింపు ఇచ్చే వెలుగులో ఆ మనిషి ముఖం బ్రైట్‌గా ఉంటుంది. ఇది ఏ మేని ఛాయకూ చాలదు. నీ ముఖంలో కూడా అలాంటి బ్రైట్ నెస్ కనిపించాలి." నా మాటలు నీలిమకు ఏ మేరకు అర్థం అయ్యాయో తెలియదు. కానీ ఇక రంగు గురించి పెద్దగా పట్టించుకోకూడదని, పట్టించుకున్నా ఉపయోగం లేదనేది నీలిమకు స్పష్టమైంది.

తొమ్మిదో తరగతి చదువుతున్న రోజుల్లో ఓసారి "స్కూల్లో కల్చరల్ ప్రోగ్రామ్స్ ఉన్నాయి, నేను కూడా డ్యాన్స్ చేస్తాను." అంది. తన కోరికను నేను కాదనలేదు. "బాగా ప్రాక్టీస్ చెయ్." ప్రోత్సహించాను. రెండు రోజుల తర్వాత ఓ సాయంత్రం స్కూలు నుంచి బిక్కమొహమేసుకొని ఇంటికొచ్చింది. "ఆ టీచర్ చూడమ్మా ఏమంటుందో? డ్యాన్స్ లో అంతా ఏంజెల్సే నంట, అందరూ తెల్లగా ఉండే వాళ్ళే కావాలంట. నేను నల్లగా ఉన్నానంట, పనికిరానంట." ఏడ్చేసింది. "ఏడవకు నీలిమా, నేను మాట్లాడతాను మీ టీచరుతో." వివక్ష చూపించిన టీచరు మీద నాకు చెప్పరాని కోపం వచ్చింది. నీలిమ వద్దని అడ్డు పడింది. "వద్దులేమ్మా, మళ్ళా నన్ను సతాయిస్తారు." "పోనీ నువ్వు వేరే డ్యాన్స్ చెయ్, నేను నేర్పిస్తా." దానిక్కూడా ఒప్పుకోలేదు నీలిమ. ఇక ఆ విషయం వదిలేసింది. కానీ తనలా చిన్నబుచ్చుకోవడం నాకు బాధగా అనిపించింది. ఆ టీచర్ని నిలదీద్దాం అనుకుంటే అది మనసులో పెట్టుకొని, నీలిమను మరింత ఇబ్బంది పెడతారని ఊరుకుండి పోయాను.

ఆ తరువాత అనుకోకుండా ఒకసారి కొంతమంది స్నేహితులు ఏర్పాటు చేసిన వేసవి బాలల శిబిరంలో నీలిమ కోరిక తీరే మార్గం కనబడింది. కొద్దిమంది పిల్లల్ని పోగేసుకొని 'ఆడపిల్ల' అనే పేరుతో నీలిమ తయారు చేసిన నాటిక చిన్న చిన్న లోపాలున్నా మొత్తం మీద బాగుంది. ఇలా అప్పుడప్పుడు బయట జరిగే కార్యక్రమాల్లో నీలిమ తన అభిరుచిని తీర్చుకోగలిగింది. ఇలా అసంతృప్తులు, అవహేళనలను అధిగమిస్తూ నీలిమ కాలేజీ చదువుల కొచ్చింది. తనకెంతో ఇష్టమైన ఆర్కిటెక్చర్ కోర్సులో చేరింది.

♦♦♦

విన్నారుగా అమ్మ చెప్పిన మాటలు. నన్ను నేను చిన్నబుచ్చుకునే స్థితి నుండి బయటపడి నేనో వ్యక్తిగా ఎదగడానికి అమ్మ ఎంత తాపత్రయపడిందో! అక్కడితో కథ అయిపోలేదు. ఆర్కిటెక్చర్ కోర్సులో చేరిన తర్వాత జరిగిన విషయాలు అమ్మ నేరుగా చూడలేదు కదా, అవి నేను చెబుతాను. చదువులు పెరిగే కొద్దీ బుద్ధి చిన్నగయిపోతుందట. ఇక్కడ కూడా అనేక రకాల వివక్షలు, పెడబుద్ధులు. వాటిలో వర్ణ వివక్ష కూడా ఒకటి.

ఓరోజు సాయంత్రం నా రూమ్మేట్ వర్ష అందంగా ముస్తాబై ఎక్కడికో బయలుదేరింది. "ఇవ్వాళ నా బాయ్ ఫ్రెండ్ తో కలసి ఔటింగ్. మాల్లో షాపింగ్, ఆ తర్వాత సినిమా, ఆ పైన డిన్నర్. బై." అడక్కుండానే గర్వంగా చెప్తూ వెళ్ళింది. నాకు ఏమీ తోచక పక్క రూమ్ లోని నా క్లాస్మేట్ అఖిల దగ్గరికెళ్ళాను. తను ముఖానికంతా ఏదో ప్యాక్ దట్టంగా పట్టించి, మాట్లాడకుండానే కూర్చొమ్మని సైగ చేసింది. ఓ అరగంటయ్యాక ప్యాక్ తీసేసి, ముఖం కడుక్కుని నా ముందు కూచుంది. "ఈ ఒంటి రంగెలా మార్చాలో, ముఖం నునుపుగా ఎలా తయారు చేయాలో అర్థం కాక చస్తున్నాను. ఈ తెల్లతోలు సుందరాంగులున్నారే, వాళ్ళే పెద్ద అందగత్తెలని మహా టెక్కు. ఈ మగవెధవలూ అంతే, తెల్లతోలు కనిపిస్తే చాలు, చొంగ కార్చుకుంటూ వెనకాల కుక్కల్లా ఊరేగుతారు." అక్కసుగా అంది. "ఇప్పుడు నీ బాధేంటి, తెల్లగా లేవనా, బాయ్ ఫ్రెండ్స్ లేరనా?" నవ్వాను నేను. "రెండూను. మన వెనకాల ఎవరో ఒకరు బాడీగార్డ్‌లా తిరుగుతుంటే అదో ఆనందం. నల్లగా ఉన్న వాళ్ళకు, లావుగా ఉన్నవాళ్ళకు, పొట్టిగా లేదా మరీ పొడుగ్గా ఉన్న వాళ్ళకు, అన్నిటికీ మించి నోరెక్కువున్న మనలాంటి గయ్యాళి గంపలకు అలాంటి ఆనందం దక్కే అవకాశం చాలా తక్కువ. ఏం చేద్దాం, మన రాతంతే." బొటనవేలుతో నొసటి మీద అడ్డంగా గీస్తూ పెదవి విరిచింది అఖిల. "చొంగ కార్చుకోవడం కాకుండా మనల్ని చూసి గౌరవిస్తే బాగుండదా?" నా ప్రశ్నకు ముఖం చిట్లించింది అఖిల. "ముందా ముసలి ఆలోచనల నుండి బయటపడు. గౌరవం కాదు, మనల్ని కనీసం పట్టించుకోరు కూడా." మేమిలా మాట్లాడుతుండగానే ఇంకో ఫ్రెండ్ శ్యామల వచ్చింది. తన ముఖం నిండా చర్మం కమిలిపోయి, బొబ్బలతో ఉంది. "ఏమయింది?" అడిగాను. "ఏముందీ, తనదీ మనజాతే కదా.

బ్యూటీపార్లర్ కెళ్ళి ఏదో ఫేషియల్, బ్లీచింగు చేయించుకుంటే, అదికాస్తా వికటించి ఇలా తయారయింది." శ్యామల బదులు అఖిల చెప్పింది. చర్మం రంగు ఈ అమ్మాయిలకెన్ని చిక్కులు తెచ్చిపెడుతోంది. అమ్మ చెప్పిన పాఠాలు వీళ్ళకెలా చెప్పాలి?

నాకో దారి చూపుతున్నట్లు ఫ్రెషర్స్ డే వచ్చింది. నాలా వివక్ష నెదుర్కొనే వాళ్ళతో పాటు, నా ఆలోచనలతో ఏకీభవించే స్నేహితులను పోగేసి, ఓ కార్యక్రమం రూపొందిద్దామని చెప్పను. "వర్కవుట్ అవుతుందా?" కొందరు అనుమానించారు. కొందరు ''ఖచ్చితంగా అవుతుంది. కొత్తదనాన్ని కోరుకుంటోంది ఇప్పటి ప్రపంచం." అంటూ ముందుకొచ్చారు. మిగిలిన వాళ్ళు కూడా కన్విన్సయి మాతో కలిశారు.

మేమేదో కార్యక్రమం చేయబోతున్నామని తెలిసిన వర్ష అడక్కుండానే సలహా పడేసింది. "బ్యూటీపార్లర్ కెళ్ళి వైటనింగ్ ట్రీట్మెంట్ చేయించుకోవచ్చు కదా!" శ్యామల అనుభవం చెప్పాను. "ఆ... తనేదో లోకల్ పార్లర్ కెళ్ళి ఉంటుంది డబ్బుకు కక్కుర్తి పడి. ఫలానా ఫేమస్ పార్లర్ కెళ్తే అక్కడ ఇంటర్నేషనల్ బ్రాండెడ్ ప్రోడక్ట్స్ వాడతారు. ఖచ్చితంగా ఫలితముంటుంది." నన్ను ఎడ్యుకేట్ చేసే పని పెట్టుకుంది. "పర్లేదు, నేనిలాగే బాగున్నాను." ఖచ్చితంగా చెప్పేసరికి దిమ్మెర పోయింది. "అంతేలే, దేవుడిచ్చిందానికి నువ్వు మాత్రం ఏం చేస్తావు?" సానుభూతి వచనాలు పలికింది.

ఫ్రెషర్స్ డే రానే వచ్చింది. మేని ఛాయ పట్ల ఉన్న అపోహలను ఎండగడుతూ, అందాల ఉత్పత్తుల వెనుక మోసాన్ని బయట పెడుతూ మేం ప్రదర్శించిన నృత్య రూపకానికి ఊహించని, స్పందన వచ్చింది. మా టీమ్ కు క్యాంపస్ లో ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఆ రోజొచ్చిన ముఖ్య అతిథి మా కార్యక్రమాన్ని కొద్దిగా మార్చి యూట్యూబ్ లో అప్లోడ్ చేయమని సలహా ఇచ్చాడు. నా స్నేహితుల సంతోషం మాటల్లో చెప్పలేను. వెంటనే ఆ పనిలో పడిపోయారు. మొత్తం కార్యక్రమాన్ని యూట్యూబ్‌లో కెక్కించేదాక ఎవరూ నిద్రపోలేదు. దానికొచ్చిన స్పందనలు, ప్రోత్సాహాలతో మేం ఇంకా అనేక కార్యక్రమాలు, షార్ట్ ఫిలిమ్స్ చేయగలిగాము. అన్నిటికీ మించి చాలా మందిలో గూడుకట్టుకున్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ స్థానంలో ఆత్మవిశ్వాసం చేరింది. అలా మూడేళ్ళలో మేం చేసిన కార్యక్రమాలకు బోలెడన్ని అప్లాజస్.

ఓ రోజు అమ్మతో మాట్లాడాను. "నా అవసరం మరోచోట ఉందనిపిస్తోందమ్మా. ఈ చదువుతో టైం వేస్టయిపోతోందేమో!" అమ్మ ఒక్క క్షణం నిశబ్దంగా ఉండి, ఆ తరువాత నెమ్మదిగా అన్నది. "నీకు ఇప్పుడొస్తున్న ప్రశంసలు, చప్పట్లను బట్టి అలా అనిపించి వుండొచ్చు. కానీ నీ ఆత్మ సంతృప్తితో పాటు, ఆత్మా రాముణ్ణి కూడా సంతృప్తి పరచాలి కదా. ఇంకెంత? ఓ సంవత్సరం గడిస్తే నీ చదువు అయిపోతుంది. ఆదాయానికి గ్యారంటీ లేని రంగాన్ని నమ్ముకొని ఈ చదువును అర్థాంతరంగా వదిలేయడం సరైనదేనా ఆలోచించు. చదువయ్యాక ఏం చేసినా నీ ఇష్టం." అమ్మ సలహా సరైనదేనని అనిపించింది నాకు. ఏడాది తిరిగే సరికి జయప్రదంగా ఆర్కిటెక్చర్ కోర్సు పూర్తి చేశాను.

అటుపైన నాకున్న పరిచయాలతో థియేటర్ ఆర్ట్స్ లో చేరి, శిక్షణ పొందాను. అదే సమయం లోనే విభిన్నమైన అంశాలతో, కథనం, టేకింగ్ లో నాదంటూ ముద్ర ఉండేలా షార్ట్ ఫిలిమ్స్ తీసి యూట్యూబ్ లో ఉంచసాగాను. కొత్తగా లఘు చిత్రాలకు అవార్డులు ప్రకటించారు. నా చిత్రాలు విమర్శకుల ప్రశంసలు పొందడంతో పాటు, అవార్డులు కూడా సాధించగలిగాయి. ఈ గుర్తింపు ఓ క్రియేటివ్ దర్శకుడితో పనిచేయడానికి అవకాశాన్నిచ్చింది. ప్రముఖ పత్రికలలో నా గురించి కథనాలు, ఇంటర్వ్యూలు వచ్చాయి. నేను పుట్టిపెరిగిన ఊళ్ళో స్థానిక పేజీలలో నా గురించి గొప్పగా రాశారు.

నేను చదివిన స్కూల్లోనే టీచర్లుగా పనిచేస్తున్న అప్పటి నా సహాధ్యాయులు, ఇంకా అప్పటి టీచర్లు కొందరు స్కూలు వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ ఆహ్వానం గురించే నా సంశయం వెళ్ళాలా, వద్దా అని. నిర్ణయం తీసుకోవడానికి పెద్ద ఇబ్బంది పడలేదు. వెళ్లి తీరాలి. అమ్మను చూడాలి కదా! అమ్మను చూడటానికే కాదు, అమ్మ నేర్పిన పాఠం నా జూనియర్లకు చెప్పడానికికూడా!

♦♦♦

వార్షికోత్సవ సంబరాల్లో నన్ను గొప్పగా పరిచయం చేశారు. స్కూల్లో ఉండగానే నేను గొప్పగా టాలెంట్ కలిగిన దాన్నని, ఇక్కడే నా ఎదుగుదలకు పునాదులు పడ్డాయని– ఇంకా ఏమేమో! నన్ను మాట్లాడమంటూ మైక్ చేతికిచ్చారు. "నా ఎదుగుదలకు పునాదులు వేసిన ఈ పాఠశాలను నేనెప్పుడూ మరచిపోలేను. దేవదూతల ప్రదర్శనలో నేను నల్లగా ఉన్నా సరే, నా పెర్ఫార్మెన్స్ చూసి డ్యాన్స్ చేయడానికి అవకాశం ఇచ్చారు." మాట్లాడుతూ అప్పటి టీచర్లకేసి, స్నేహితులకేసి

## అక్షరాంజలి

- నీలం వెంకటేశ్వర్లు
9502411149



అతడు..
అద్దంలో చందమామై
వినీలాకాశంలో వెన్నెల కురిపిస్తూ
చీకటిపూలు వెదజల్లుతున్నాడు
అతడు..
వంకర టింకరైన ఓ బతుకును
యాభై రెండు అక్షరాలతో ఏర్చి కూర్చి
ఆరు గ్లాసులతో
సాహిత్య రాశులుగా కుమ్మరిస్తున్నాడు
అతడు..
చివరి మనసులో
గుత్తులుగా రాలిన అక్షరాలతో
హృదయవీణ మీటుతున్నాడు
అతని అక్షరాలు
అణగారిన బతుకుల ఆశాదీపాలు
అతని అక్షరాలు
అవినీతి వ్యతిరేక ఆయుధాలు
అతని అక్షరాలు
కరువుసీమ కన్నీటిధారలు
భూమిపుత్రా...
నీవు ఆగినా నీ అక్షరం ఆగదు
ఇపుడు...
నీ అక్షరాల ఆత్మీయ స్పర్శ
అమ్మ బుగ్గ గిల్లినట్టు
మిత్రుడు భుజం తట్టి లేపుతున్నట్టు
మా గుండెలను పెనవేసుకుంటున్నాయి
నిరంతరం....
మమ్మల్ని గమ్యం వైపు
నడిపించే మీ అక్షరానికి
ఇవే మా అక్షరాంజలులు...

*(18 అక్టోబరు చిలుకూరి దేవపుత్ర వర్ధంతి సందర్భంగా)*

---

## పొలంలో...అమ్మా...! నాన్న...!

- ఆది ఆంధ్ర తిప్పేస్వామి
7780263877



నిన్నటి నాగటి చాలులో
చెమట బిందువై తళుక్కున మెరిసిన నాన్న
నేడు ఊరికి ఉత్తరాన
కన్నీటి దీపమై సమాధికి వెలుగు నింపాడు

చెమట చుక్కతో జతకట్టి
ఆరుగాలం కంటికి రెప్పల్లే కాపాడిన అమ్మ
కొడిగట్టిన కన్నీటి దీపానికి చమురయింది
అనంతవాయువుల్లో కలిసిపోయిన
వెలుగు దివ్వెలు అమ్మా..నాన్నలు..!

కలవని తీరాలకు కదిలివెళ్లిన
కావడి కుండలు
కంటి రూపాల్ని 'అనాథలు'గా
చేనుగట్టుపై
తుమ్మచెట్లకు ఆనవాలు అమ్మా..నాన్నలు..!

---

చూశాను. మౌనంగా తల దించుకున్నారు. ఒక్క నిమిషం ఆగి కొనసాగించాను. "మా అమ్మ ఎప్పుడో చెప్పింది భౌతికంగా కనిపించే నీ రూపానికాదు, నీ వ్యక్తిత్వానికి గుర్తింపు తెచ్చుకొనే విధంగా ఎదగాలని. ఎన్ని రకాలైన అవహేళనలు ఎదురైనా నాలో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించింది. మీ కందరికీ నేను చెప్పేదొక్కటే. శారీరకంగా అచేతనంగా ఉన్న స్టీఫెన్ హాకిన్స్ ఎంత గొప్పగా జీవించారో ఒక్కసారి చదవండి. అవయవ లోపాలున్న వారు సైతం అద్భుతాలు చేస్తుంటే, రంగు, ఎత్తు, ఆకారం వంటి చిన్న చిన్న విషయాలకు ప్రాధాన్యత నిచ్చి మిమ్మల్ని మీరు చిన్నబుచ్చుకోవద్దు. మీరెలా ఉన్నా సరే ముందు మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. మీకు మీరు నచ్చకపోతే మిగితా వాళ్ళకెలా నచ్చుతారు? బాహ్య సౌందర్యాన్ని కాకుండా అంతః సౌందర్యాన్ని మెరుగుపరుచుకోండి. మీ వ్యక్తిత్వాన్ని మీరే తీర్చిదిద్దుకోండి." ప్రేక్షకులలో ముందు వరుసలో కూర్చున్న అమ్మ కళ్ళలో చెమ్మ నా హృదయాన్ని తాకింది.



# గిరిజనుల జీవితాలలోని దోపిడీని ప్రశ్నించిన కథలు

- మందరపు హైమవతి
9441062732

సమాజంలో పేదలు, ధనికులు ఉన్నట్లే రచయితల్లో రెండు రకాలు వుంటారు. పీడితులు తాడితుల పట్ల నిలచి పెట్టుబడిదారుల కుట్రలు బయటపెట్టి, తమ అక్షరాలనే అగ్నికణాలుగా రగిలించే వారు. కుళ్ళిపోయిన సమాజంలోని అంగాంగాలకు శస్త్ర చికిత్స చేసే కత్తులుగా తమకలాలకు పదును పెట్టే రచయితలు కొందరు.

పాలకవర్గాల కొమ్ము కాస్తూ, వారెక్కే అధికార పల్లకీలను మోసే బోయీలు, తాము సృష్టించిన సాహితీ శిశువులను రూపాయిల ఊయలలో ఊపుతూ ఆనందించే రచయితలు కొందరు.

ఈ రెండింటిలో మొదటి వర్గానికి చెందిన బంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవి.

తరతరాలుగా రాజకీయంగా, సాంఘికంగా మోసగించబడుతున్న గిరిజనుల, ఆదివాసీల వ్యధాభరిత జీవన చిత్రాలకు భాష్యం చెప్పిన రచయిత్రి ఆమె.

అడవుల్లో దొరికే కాయలు, పళ్ళను సంతలో అమ్ముకొంటూ నిరాడంబరంగా జీవిస్తారు ఆదివాసులు. అడవుల్లో దొరికే కుంకుళ్ళు, చింతపండు, తేనె మొదలగు వాటిని అమాయకులైన గిరిజనుల దగ్గర చౌకగా కొని నగరాల్లో అధిక ధరలకు అమ్ముకొని కోటీశ్వరులైన మైదాన ప్రాంతాల వారెందరో వున్నారు.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో గాంధీ, నెహ్రూ పేర్లు వినిపిస్తాయి కానీ ఆదివాసీల నాయకుడు బిర్సాముండా మొదలగువారి పేర్లెక్కడా కనిపించవు.

మనదేశానికి స్వాతంత్ర్యం రాకముందు బీహార్, బెంగాల్, ఒరిస్సా సరిహద్దుల్లో వుండే "ముండా" జాతి గిరిజనులు బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులకు వారి తొత్తులకు వ్యతిరేకంగా తమ ప్రాణాలొడ్డి పోరాడారు. అలా పోరాడిన నాయకుల్లో బిర్సాముండా ఒకడు.

"అరణ్యేర్ అధికార్" (ఎవరిదీ అడవి) నవలరాసి బిర్సా ముండా లాంటి గిరిజన నాయకుని గొప్పదనాన్ని నాగరికులకు పరిచయం చేశారు మహాశ్వేతాదేవి. ఒకప్పటి మన దేశ ప్రధాని రాజీవ్‌గాంధీ బిర్సాముండా పేరిట అవార్డును తీసుకొన్నాడంటే గిరిజన నాయకుడు బిర్సాముండా ఎంత గొప్పవాడో పాఠకులు తెలుసుకోవచ్చును.

మన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అల్లూరి సీతారామరాజు, కొమరం భీము కూడా అలా పోరాడిన వారే. ఐనా చరిత్ర వారిని కేవలం గిరిజనులనే కారణంతో విస్మరించింది. వారిని

ప్రాంతీయ నాయకులుగా మాత్రమే ప్రస్తావించింది తప్ప జాతీయ నాయకులుగా గుర్తించలేదు.

అడవితల్లి ఒడిలో పుట్టి, అక్కడ పెరిగిన వారికి అడవిలో రాలిపడిన ఆకులు ఏరుకోవడానికి, ఎండిపోయిన కొమ్మలు తీసుకోవడానికి హక్కులు లేవు. అటవీ హక్కుల పరిరక్షణ చట్టంకింద అడవిలోని గార్డులు వారిని బెదిరించి, శిక్షిస్తారు. ఈ నిజాయితీపరులైన ఉద్యోగులు రాజకీయ నాయకుల అండదండలతో కోట్లాది రూపాయిల విలువచేసే చందనం దుంగల్ని అడవి సరిహద్దుల్ని దాటిస్తుంటే కళ్ళుండి లేని శిలా విగ్రహాల్లా నిలబడిపోతారు.

ఇప్పుడు గిరిజనులు నివసించే విశాఖపట్నం మొదలగు ప్రాంతాల కొండల్లో బాక్సైటు గనులున్నాయని కొండల్ని తవ్వే కార్యక్రమాలు మొదలైనాయి. దీని వలన పర్యావరణం ధ్వంసమైపోతుందనీ తెలిసినా ఎవరూ పట్టించుకోరు. ఎక్కణ్ణుంచో వచ్చిన బహుళ జాతి కంపెనీలకు ఇక్కడి గిరిజనుల ఆస్తుల్ని ధారాదత్తం చేసి కోట్లాది రూపాయిలు గడిస్తుంది ప్రభుత్వం. ప్రస్తుతం ఇక్కడ ప్రజల వ్యతిరేకత వలన గనుల తవ్వకాన్ని ఆపేసింది.

అరకులోయ మొదలగు గిరిజన ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పి అక్కడి స్త్రీలను వ్యభిచార వృత్తిలోకి దింపుతుంది ఘనత వహించిన ప్రభుత్వం. మైదాన ప్రాంతాల వారు గిరిజన యువతులను ప్రేమ పేరుతో పెళ్ళి చేసికొని వారి భూములను, ఆస్తులను, ఇళ్ళను తమ పేర రాయించుకొంటున్నారు. ఇలాగే జరుగుతుంటే కొన్నేళ్ళకు గిరిజనుల భూములన్నీ మైదాన ప్రాంత వాసుల చేతిలోకి వెళ్ళి పోతాయనడంలో ఎంతమాత్రం ఆశ్చర్యం లేదు.

గిరిజనుల జీవితాలతో చైతన్యం తీసుకువస్తామని నక్సలైట్లు (అగ్నలు) అడవుల్లో ప్రవేశించారు. అన్నల ఉనికి చెప్పమని పోలీసులు మధ్యలో ఆదివాసీలను హింసిస్తున్నారు. ప్రశాంతంగా జీవించే తండాలు ఇప్పుడు హింసకు పర్యాయపదాలుగా మారిపోయాయి. ఒకప్పుడు నిర్భయంగా పైరగాలిలా హాయిగా, స్వేచ్ఛగా జీవించే ఆదివాసీలు ఇప్పుడు పోలీసులు ఎప్పుడు వస్తారో, అన్నలు ఎక్కడ వస్తారోనని ఇద్దరి మధ్య నలిగిపోతూ గుండెల్ని గుప్పెట్లో పెట్టుకొని బతుకుతున్నారు.

గిరిజనుల జీవితాలలోని దోపిడీని, అన్యాయాన్ని తన కథల్లో, నవలల్లో అక్షరమక్షరం చిత్రీకరించింది మహాశ్వేతాదేవి. రాకాసికోర, ఒకతల్లి కథ, ఎవరిదీ అడవి మొదలగు నవలల్లో భూస్వాముల పెత్తందారీ తనాన్ని దళితులపై అణచివేతతో గూడిన ఆధిపత్యాన్ని కళ్ళకు కట్టినట్లుగా ఎండగట్టింది. భూస్వాముల నిరంకుశ పాలన కింద నలిగిపోతూ అంతులేని పేదరికంతో బానిసలుగా నిస్సహాయంగా మిగిలిపోయిన గిరిజనుల స్వభావానికి అద్దం పట్టిన కథలు 'శనీచరి'లోని కథలు.

అందరికీ ప్రాథమికావసరాలైన చదువు, తిండి, నీళ్ళు గిరిజనులకు ఎలా విలాస వస్తువులుగా మారిపోయాయో ఈ కథలు వివరిస్తాయి. సంఘంలోని అసమానతలను ఎత్తిపట్టి చూపిస్తాయి.

ఈనాడు బాలకార్మికుల చట్టం వచ్చింది. బాలకార్మికులను పనిలో పెట్టుకొంటే యజమానులను అరెస్టు చేస్తారు. ఐనా బాలకార్మిక వ్యవస్థ ఎక్కడ రూపుమాసింది! పలకాబలపం పట్టుకోవాల్సిన ఈడులో చేతిలో కర్ర పట్టుకొని గొడ్లను తోలే బుడ్డోళ్ళు, హోటళ్ళలో టీ కప్పులందించే పాలబుగ్గల పసివాళ్ళు, ఫేక్టరీల్లో పనిచేసే ముక్కుపచ్చలారని చిన్నారులు, గోరుముద్దలు తినాల్సిన చిట్టి చేతుల్తో ఆరిందాల్లా అంట్లు తోమే పిల్లలు మన కళ్ళఎదుట కనిపిస్తూ మనశ్శాంతి లేకుండా చేస్తారు.

మనం తిని పడేసిన వేరుశనగకాయ తొక్కల్ని, అరటిపండు తొక్కల్ని ఊడ్చి శుభ్రం చేసి చిల్లర నాణేల కోసం మనముందు చాపిన చేతుల్ని చూసీ చూడనట్లే నటిస్తాం. మన మధ్య తరగతి పెద్ద మనుషులం.

రోజంతా రెక్కలు ముక్కలు చేసుకొన్నా సాయంత్రానికి పిడికెడు మెతుకులు దొరకని తనం, గిరిజనుల కటిక పేదరికం, చదువులేక పోవడం వలన దొరల చేతిలో మోసపోతున్న గిరిజనుల జీవితాలను 'శనీచరి'లో రూపుకడతారు రచయిత్రి.

ఒక ముండాజాతి బాలకుడు తన చదువుకోసం ఎంత యుద్ధం చేయాలో "ఒక భీకర యుద్ధం తర్వాత'లో బొమ్మ కట్టిస్తారు. ఈ కథా నాయకుడు పతిత్. 10, 11 ఏళ్ళ ముండాజాతి కుర్రాడు. పశువుల కాపరిగా ఉదయంతో మొదలై సాయంత్రంతో పూర్తవుతుంది అతని దినచర్య.

ప్రతిరోజు అతడు 'దులం'నదీ పాయని దాటి, మైదానాన్ని చేరుకుంటాడు. పశువుల్ని అక్కడ మేతకు వదిలి సువర్ణరేఖానదిని దాటి అడవిలో అడుగు పెడతాడు. ఆ నదిలో వలవేసి "నేనీరోజు చేపల పులుసు తింటానని కలలు కంటాడు. అక్కడ ప్రవహించే నదికి, ఎగిరే పిట్టలకు "అప్పుడు గొప్ప యుద్ధం జరిగింది" అని చెప్తాడు. రోజూ అతడు పశువుల్ని మేపడానికి వెళ్ళే దారిలో బేసిక్ ప్రైమరీ స్కూలు వుంటుంది.

అక్కడకు వెళ్ళేసరికి మాస్టారు భారతంలోని యుద్ధకథలు, సిపాయిల తిరుగుబాటు కథల గురించి చెప్తుంటాడు. ఆ కథలు వింటున్నపుడు ఆ కుర్రాడి మెరిసే కళ్ళను గమనిస్తాడు మేస్టారు. మేస్టారు తనను చూడడం గమనించగానే అక్కణ్ణుంచి పరుగు తీస్తాడు.

పొద్దున్నే సూర్యునితోపాటు నిద్రలేచే పతిత్ దొరగారి భవనాన్ని శుభ్రంచేసి వాకిలి ఊడ్చి, కళ్ళాపు జల్లి పనులన్నీ చేసి పశువులను కాయడానికి బయటకు వస్తాడు. భుజం మీద గోనె సంచీతో ప్రారంభమౌతుంది అతని ప్రయాణం. ఆకుకూరలు, చేపలు, ఎండు చిదుకులు ఏది కనబడితే వాటిని సంచిలో వేసుకొని ఇంటికి వెళ్తాడు. పొద్దస్తమానం పనిచేసినందుకు వాడికి దక్కేది ఇంత పాచి అన్నం, రెండు పిడికెళ్ళ వేయించిన శనగలు.

ఆ తర్వాత మళ్ళీ పశువుల్ని కొట్టంలో కట్టేసి వాటికి కుడితినీళ్ళు పెట్టి తన ఇంటికి వస్తాడు. పతిత్‌కు తల్లిదండ్రులు లేరు. తాతయ్య మతిరాం వాణ్ణి పెంచుతుంటాడు. ఒకసారి పోలీసులు పతిత్ తల్లిదండ్రులతో కలిపి 36గురు ముండాలని తీసుకువెళ్లారు. కారణమేమిటి అంటే ఒకరోజు వాళ్ళు నాట్లు వేస్తున్న భూమి తమ యజమానిది కాదు. భూస్వామి తన పొలాన్ని వేరే వాళ్ళకు అమ్మేస్తాడు. కొత్త భూస్వామి ఫిర్యాదు మేరకు వాళ్ళను అరెస్టు చేసి సాయంత్రం వదిలేస్తారు. వదిలేసాక ఇంటికి వస్తూ పతిత్ తల్లిదండ్రులు తిరునాళ్ళలో తిండికి వాచిపోయి పాచిపోయిన అన్నం తినడంతో హరీ అంటారు. అప్పటినుంచి తాతయ్యే పతిత్‌కు తల్లీ తండ్రి సమస్తమూ.

తాతయ్యా ఓ భూస్వామి ఇంట్లో పశువులకాపరి. ఆ భూస్వామి మనవణ్ణి కూడా పనిలో పెట్టమంటాడు. తాతయ్య దానికి ఒప్పుకోడు. మనవణ్ణి చదివిస్తా నంటాడు.

అప్పుడు యజమాని "మీ పిల్లలు బడికివెళ్తే మా పనులెవడు చేస్తాడ"ని ప్రశ్నిస్తాడు. తాతకు చదివించాలని, మనవడికి చదువుకోవాలని ఎంతో కోరిక వున్నా తాతకు జబ్బు చేయడం వలన యజమాని దగ్గర పశువుల కాపరిగా చేరక తప్పలేదు.

మేస్టారు గూడా పతిత్‌ను బళ్ళో చేరమని అడుగుతాడు. ముండాల పేటలో మధ్య వయస్కురాలు ఆలోమణిని పతిత్‌ను బళ్ళోకి పంపించమని అంటాడు. "అప్పుడామె ఈవేళ మా పిల్లలు పశువుల్ని కాస్తారు. ఆ తర్వాత రైతు కూలీలవుతారు. అంతే ఇలాగే మా బతుకులు తెల్లారిపోతాయి. చదువుకోవడం మంచిదే, కానీ ఇప్పుడు కడుపుకెవరు చూస్తారు? పశువుల్ని మేపితే కామందుపెట్టే ఇన్ని సెనగలు, యింత పాచి తిండయినా తినచ్చు గదా? నెలయ్యేసరికి చేతికి కరుకుల్లాంటి ఐదు రూపాయిలు వస్తాయి. ఇలాగే ఏళ్లు గడిపేస్తుంటాం". అని అమాయకంగా అంటుంది.

ఇక్కడ కామందు ఇంట్లో పనిచేస్తే శనగలొస్తాయని అనుకొంటారు గానీ, రోజంతా పనిచేస్తే ఈ శనగలే ఇవ్వడమేమిటి? నెలంతా పనిచేస్తే ఐదు రూపాయలే ఇవ్వడమేమిటి? మా శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని ఎదిరించరు బాధపడరు ఈ గిరిజనులు.

మాస్టారు పతిత్‌కి బిర్సా భగవాన్ ఫొటో చూపిస్తాడు. "ఈయన మీ ముండా జాతివాడు. యుద్ధంలో ఆరితేరినవాడు. యుద్ధంచేస్తూనే మరణించాడు" అంటాడు . ఆ రోజు ముండా జాతి సభకి వెళతానని, నాగాపెడతానని యజమానితో పతిత్ అంటాడు "మీరంతా అడవి భూతాలు. మీకు సభలేమిటి? సమాజమేమిటి? నా మొహం" అంటాడు యజమాని. అతడు వద్దన్నా ముండా సభకు వెళ్తాడు పతిత్. ముండా సభకి వెళ్ళి వచ్చిన దగ్గరనుంచి కామందు ఇంటికి వెళ్ళడం మానేస్తాడు. బడికి వెళ్ళడం మొదలుపెడతాడు. బడి వదిలాక పతిత్ నదినీళ్ళమీద వెల్లకిలా పడుకుని "యుద్ధం జరిగింది. గొప్ప యుద్ధం.." అంటాడు. నది, దానిమీద వంగిన ఆకాశం "ఒక భీకర యుద్ధంలో విజయుడయి కూడా ఈ విషయం తాను తెలుసుకోలేక పోయాడు చూడండి" అనుకొంటాయి.

ఈ కథ చదివాక భూస్వాముల దురంహంకారం, గిరిజనుల అమాయకత్వం మన కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. ప్రాథమికావసరాల్లో ఒకటైన చదువు గిరిజనులకు ఎలా విలాసవస్తువైందో, చదువుకోవడానికి గిరిజనుడు ఎంత యుద్ధం చెయ్యాలో అర్థమౌతుంది.

అన్నం కథ– అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు. అన్నం లేకపోతే మానవుడు జీవించలేడు. అన్నగతప్రాణి మనిషి. కూటికోసం కోటి విద్యలన్నట్లు దొంగతనం చేసినా, హత్య చేసినా మనిషి అన్నం కోసమే చేస్తాడు. వ్యాసుడంతటి మహర్షే మూడు రోజులు అన్నం దొరకలేదని కాశా నగరానికి శాపమివ్వబోతాడు. విశ్వామిత్రుడు ఆకలికి ఆగలేక కుక్కమాంసం తిన్నాడంటారు.

రెక్కాడితే గాని డొక్కాడని కొందరు పగలంతా పనిచేసినా, వారికి ఒక ముద్ద అన్నం పెట్టాలంటే యజమానులు

బాధపడిపోతారు. గొప్పింటివాళ్ళ విందు భోజనాల్లో తిన్నంత తిని మిగిలింది వదిలేస్తారు. ఆ ఎంగిలి విస్తరాకులకోసం కుక్కలతోపాటు మనుషులూ పోటీ పడే దృశ్యాలు మనకు చిరపరిచితమే.

"అన్నం' కథలో ఉచ్చవ్‌కి చాలా రోజులనుండి తిండి వుండదు. ఒక ధనవంతుల ఇంట్లో పనిచేస్తే దాసి, ఉచ్చవ్‌ని తను పనిచేసే ఇంటికి తీసుకువెళ్తుంది. ఆ ఇల్లుగల యజమానికి వచ్చే ప్రాణం, పోయే ప్రాణంగా వుంది. ఆ ఇంట్లో యజమాని క్షేమంకోసం హోమం చేయిస్తున్నారు. ఐదు రకాల అన్నాలు వండుతుంటారు. ఉచ్చవ్ వంట చేయడానికి కట్టెలు కొడుతుంటాడు. ఎంతపని చేసినా అతనికి అన్నం పెట్టరు. వంటలైపోయాయి. కానీ అంతలోనే యజమాని ప్రాణం పోతుంది. చచ్చిపోయిన ఇంట్లో వండిన అన్నం మైలపడిపోయిందని పెద్ద పెద్ద దేగిశాలలో వండిన అన్నాన్ని బయట పారవేయడానికి నౌకర్లు తీసుకెళ్తుంటారు. ఉచ్చవ్ ఆ అన్నాన్ని చూసి ఏం చేయాలో మనసులో అనుకొంటాడు.

ఒక అన్నం దేగిసా తన కివ్వమని చెప్పి దాన్ని తీసుకొని పరుగెత్తుతాడు. వాసిని వచ్చి "శవం లేచిన ఇంట్లో అన్నం తినగూడదంటుంది. అతడు అవేమీ లెక్క చెయ్యడు. దేగిసాతో రైల్వే స్టేషన్ చేరుకొంటాడు. అక్కడ కరువుతీరా అన్నం తింటాడు. అంతకు ముందే వరదల్లో మరణించిన భార్యా కూతురికి కూడా "ఇంద ఈ బువ్వతిను" అని తినిపిస్తాడు.

చాలాకాలం తర్వాత అన్నం తిన్న మీదట అతనికి మత్తుగా నిద్ర వచ్చేస్తుంది. అన్నం దేగిసాని గుండెలకి హత్తుకొని నిద్రపోతాడు. మర్నాడు ఉదయం ఇత్తడి దేగిసాని ఎత్తుకుపోయాడని దొంగతనం నేరంమీద ఉచ్చవ్‌ని పోలీసులు అరెస్టు చేస్తారు. పెద్దపెద్ద హత్యలు చేసిన నేరస్థులు బెయిల్ మీద తప్పించుకొచ్చి పెద్ద మనుషుల్లా తిరుగుతుంటారు. ఆకలేసి అన్నం తిన్నందుకు దొంగతనం చేసాడని అరెస్టు చేస్తారు. ఇదే మన ఘనత వహించిన దేశంలోని న్యాయవ్యవస్థ. రచయిత్రి ఎక్కడా ఏ కథలో ఇది న్యాయం, అన్యాయం అని సూచనాప్రాయంగా కూడా చెప్పదు. కానీ కథ చదివాక పాఠకుని మనసులో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. ఈ సమాజం ఇంత క్రూరంగా వుండడానికి కారణమేమిటి? ఈ పేదవాళ్ళ ఆకలి ఎప్పటికీ తీరదా అని వేదన కలుగుతుంది. రోజంతా రెక్కలు ముక్కలయ్యేలా పనిచేసినా దళితుల కష్టాలకి ప్రతిఫలం దక్కదా. ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో అని ఆవేశం కలుగుతుంది.

కోట్లకి కోట్లు అక్రమార్జన నిల్వలను నిక్షిప్తం చేసుకొనే వాళ్ళను ఏమీ చేయలేని ప్రభుత్వం ఇలాంటి దళితులపై తన ప్రతాపం చూపెడుతుంది. భూస్వాములు దళితులకు నీళ్ళివ్వకుండా చేసే రాజకీయాలను బట్టబయలు చేసిన కథ 'నీళ్ళు'. తిండి లేకపోయినా జీవించవచ్చును. కానీ నీళ్ళు లేకపోతే మనుగడ సాగించలేరు. నీళ్ళున్న చోటే నాగరికత వుంటుందంటారు. అన్నం లేకపోతే గ్లాసెడు మంచినీళ్ళైనా తాగి బతకవచ్చును. నీళ్ళే లేకపోతే ప్రాణాలు పోవడం ఖాయం.

గ్రామాల్లో భూస్వాములు బలవంతులు. గ్రామాల్లో భూములమీద, కాలువల మీద అన్నిటి మీద పెత్తనం వాళ్ళదే. కింది కులాల వాళ్ళు, గిరిజనులు అందరూ వాళ్లు చెప్పినట్లు వినాల్సిందే. బాకులీ గ్రామానికి నీటి ఎద్దడి ఎక్కువ. వ్యవసాయ యోగ్యమైన భూమి కంతటికీ యజమాని లక్ష్మణ సామంత్. ఆ భూమిని కౌలికి తీసుకొని 19 కుటుంబాల వారు కౌలుచేస్తుంటారు. వాళ్ళతో గోకుల్ దాసు ఒకడు. అక్కడ చెరువున్నా నీళ్ళులేక ఎండిపోయింది. కాలువ వుంది. కాలువకి ప్రభుత్వం నీళ్ళు ఇస్తానన్నా లక్ష్మణ్ వద్దంటాడు. అక్కడ కౌలు చేసేవాళ్ళకి కాలవ నీళ్ళే ఆధారం. ఆ నీళ్ళు లేకపోతే పంటలు పండవు. ప్రభుత్వం కాలువనీళ్ళు ఇస్తానంటుంటే యజమాని తీసుకోడు. దానికి కారణం తన కొడుకు శరదిందుకు "కాలువ నీళ్ళు తీసుకోక పోతే పంటలు పండవు. అప్పుడు పది గ్రామాల రైతులకు 2500 అప్పిస్తాను. వడ్డీ వసూలు చేస్తాను. అలా వచ్చిన వడ్డీతోనే మన ఆస్తి ఇలా పెరిగింది. అందువల్ల నాకు తెలవదా కాలువలోని నీళ్ళు వున్న సంగతి" అని చెప్తాడు.

కాలవనిండా నీళ్లుంటాయి. ఐనా నీళ్ళు అందని కారణంగా పొలంలోని పంట పొలంలోనే ఎండిపోతుంది. కాలువ నీళ్ళు ఎందుకు తీసికోవు? అని గిరిజనుడు గోకుల్‌దాస్ యజమాని నడిగితే "మీరు తీసుకోండి. నాకంత శక్తి సామర్థ్యాలు లేవు. నీటి తీరువా కోసం కట్టాల్సిన డబ్బు కూడా పోగుచెయ్యి. అప్పుడు నేను పట్నం వెళ్ళి ఆఫీసులో ఇచ్చి వస్తాను" అంటాడు.

"భూమి మీదీ, నీటి తీరువా కట్టాల్సింది మేమూనా?" అంటే

"దేవుడు వర్షాలు కురిపించడం లేదని, దేవతని నువ్వు తప్పుడు కూత కూసావు'' అంటాడు. గ్రామంలో గొడవలవుతాయని కొడుకుని ఊరు విడిచి వెళ్ళి పొమ్మంటాడు. కొడుకు పట్నంలో వుండగానే వాళ్ళ ఇంటికి నిప్పెట్టారని తండ్రి మరణించాడని కబురు వస్తుంది.

గోకుల్‌దాన్ భార్య సరయూ ఊరొదిలి వెళ్ళి పోదామంటుంది. సరయూ మామ నిర్భర్‌సార్ ఒకసారి వూరొదిలి వెళ్తే అడుగు పెట్టలేము. యజమాని కొడుకు శరత్ కొత్తవాళ్ళని దింపుతాడు అంటాడు. "ఐతే వర్షం కురిపిస్తారా" "ఆ.. కురిపిస్తారు" "దానికి నెత్తురు కావాలి" ఇస్తానంటుంది సరయూ. వృద్ధుడు చేతిలోని చాకుతో సరయూ వక్షాన్ని చీల్చేస్తాడు. పాత్రని రెండు చేతులలో పట్టుకొని రొమ్ములకింద పెట్టుకుంటుంది సరయూ. "నీళ్ళివ్వు దేవుడా నీళ్ళివ్వు దేవుడా" అని తెల్లవార్లు అరుస్తుంటుంది. ఐనా వాన కురవదు.

సరయూ ఊరొదిలి వెళ్ళిపోతూ "గోకుల్‌ని పట్టిచ్చిన వాళ్ళు బతికి బయటపడలేదు. రొమ్ములు చీల్చి నెత్తురు ఇచ్చా. ఐనా వాన రాలేదు. గోకుల్‌నెందుకు పట్టించారు. నేనెందుకు నెత్తురు కార్పించినట్లు" అని ప్రశ్నిస్తుంది.

ఈ కథ చదువుతుంటే అందరికీ చెందాల్సిన భూమిని, నీటిని అగ్రవర్ణాల వాళ్ళు, అధికారులు ఎలా స్వాధీనం చేసికొని దుర్వినియోగయం చేస్తున్నారో, తోటివారు గొంతు తడుపుకోవడానికి నీటి చుక్క ఇవ్వకుండా ఎంత అమానుషంగా ప్రవర్తిస్తున్నారో రాజ్యం అలాంటి భూస్వాముల పట్ల ఎలా అండగా వుంటుందో వంశపారంపర్య కుటుంబ రాజకీయాలు ఎంత కుటిలంగా వుంటాయో హృదయవిదారకంగా చిత్రీకరిస్తుంది ఈ కథ.

ఈ కథ చదివిన చాలాకాలం దాకా చీల్చిన సరయూ రొమ్ముల కింద నుంచి రక్తం కారే భయంకర దృశ్యం మనను వెంటాడుతునే వుంటాయి.

జీవిత ఖైదీ– సంత్రాల్ గిరిజనుడు మాగన్ ఓ జీవిత ఖైదీ. భార్యను హత్య చేసినందుకు అతనికి యావజ్జీవ కారాగార శిక్ష పడతుంది. అతని సత్ప్రవర్తనకు మెచ్చి 14 ఏళ్ళ తర్వాత జైలు నుంచి విడుదల చేస్తారు. ఆ బేడీలతోనే అతనికి నడవడం అలవాటై పోతుంది. వాటితోనే జైల్లో అన్ని పనులు చేసేవాడు. జైలరుగారి ఇంట్లో డ్యూటీ చేసేవాడు. జైలునుంచి విడుదల అయ్యాక ఇంటికి వెళ్తే అక్కడ ఇల్లు వుండదు. అతని తాలూకా మనుషులెవరూ వుండరు. మళ్ళీ పోలీసుస్టేషనుకి వెళ్తాడు. ఎస్ఐ తన బావమరిది ఇంట్లో పనికి వుంచి వెళ్తాడు. వాళ్ళింట్లో మాగన్ అన్ని పనులు చేస్తుంటాడు. జైలునుంచి వచ్చినా తన జీవితం మారలేదని అనుకొంటాడు. కాళ్ళకు వేసిన బేడీలు తెగ్గొట్టలేదు. చిన్న చిన్న అడుగులు వేస్తూ ఆనకట్ట నుంచి కావడితో నీళ్ళు మోసుకొస్తాడు. కూరగాయ మొక్కల్ని పెంచుతాడు.

ప్రతిరోజూ ఇంటి పనంతా ఐపోయాక వాళ్ళింటికి దూరంగా వున్న రక్షిత అడవిలోకి వెళ్ళేవాడు మాగన్ అక్కడ మాత్రం పెద్దపెద్ద అడుగులు వేసుకొంటూ నడుస్తాడు. అక్కడకు రాగానే పెద్దపెద్ద అడుగులు ఎందుకు పడుతున్నాయో అతనికి అర్థం కాదు. అడవిలో ఫారెస్టు ఆఫీసరు కనిపించి "సంతాల్ వాళ్ళు ఈ అడవిలోకి వచ్చి చెట్లు నరుకుతారు. నువ్వు వాళ్ళని పట్టుకో" అంటాడు. "అలాగే"నంటాడు. జైలునుంచి వచ్చిన దగ్గర నుంచి తన వాళ్ళని కలుసుకోవాలని అంతని కోరిక. జైలునుంచి వచ్చినా అతని నడకలో మార్పులేదు. జైల్లో ఈడుస్తూ నడవడం అలవాటై పోయి అలాగే బయల కూడా నడుస్తుంటాడు. మాగన్‌కి తానిప్పుడు ఖైదీని కానని గుర్తుండదు అప్పటినుంచి అడవిలోకి వెళ్తుంటాడు తన వాళ్ళని కలుసుకోవాలని. ఎవరో వస్తారు కానీ అంతలోనే వెళ్ళిపోతుంటారు. రాత్రి ఏమూడో ఝాములోనో వచ్చి చెట్లు కొట్టుకొని వెళ్ళిపోతారు. 'వాళ్ళని పట్టితెస్తే జైల్లో పెడతారా?" అని అడుగుతాడు మాగన్. వాళ్ళ చేతిలోని గొడ్డలో ఏదో తీసుకొని జరిమానా వేసి విడిచి పెడ్తాం అంటాడు. చివరికి ఒకరోజు తన జాతి వాళ్ళను కలసికొని వాళ్ళతో వెళ్ళిపోతాడు.

ఈ కథ చదువుతుంటే బేడీలు వేసిన కాళ్ళతో ఈడ్చుకొంటూ వెళ్తున్న ఒక సంతాల్ గిరిజనుడు మన కళ్ళ ముందు కనిపించి ప్రశాంతత లేకుండా చేస్తాడు. వాళ్ళదైన అడవిలో కట్టెలు కొట్టుకొన్నందుకు రాజ్యం వాళ్ళను ఎలా నేరస్థులుగా చేస్తుందో, దొంగలుగా ముద్రలు వేస్తుందో మనకు తెలుస్తుంది ఈ కథ వలన.

ఈ కథలన్నింటిలో గిరిజనులు ఎంత అమాయకులైనా తామున్న పరిస్థితుల్లో అలాగే వుండడానికి ఒప్పుకోరు. ఆ పరిస్థితులనుంచి తప్పించుకోవడానికి పోరాడతారు. ఆ ప్రయత్నంలో విజయం సాధిస్తారు.

ఈ కథల్లో గిరిజనుల వ్యక్తిత్వం, రాజ్యం హింసా స్వభావం, పోలీసుల క్రూరత్వం అన్నీ మన కళ్ళముందు కదలాడతాయి.

ఈ కథ సంపుటిలోని కథలన్నీ మన బూటక ప్రజాస్వామ్యం విలువలను సూటిగా ప్రశ్నించిన బాణాలు. స్వాతంత్ర్యం వచ్చి ఏడుపదులు దాటినా గిరిజనులు ఎందుకింకా అణచివేయబడుతున్నారు. నాగరికులకు, గిరిజనులకు అందరికీ ఒకటే హక్కులు కావా? అనే ప్రశ్నలు పాఠకుల మెదళ్ళను తొలిచేస్తుంటాయి. నిద్రపట్టని రాత్రులను మిగుల్చుతాయి. ♦

## కవిత

# అసుంటసుంట

- రతన్ రాజు బందిలి
9490263115



అవసరం తీరాక నేనలుసైపోయి... నీ కంట్లో నలుసైపోయానెందుకో..!?
కడుపులో ఉండగా మీ అమ్మ ఉమ్మనీరుమింగి నువ్వు ఉక్కిరిబిక్కిరైపోతే..!!
కడుపట్టుకొని కదల్లేక అల్లకల్లోలమైపోయింది పాపం...! అర్ధరాత్రి అపరాత్రీ చూడకుండా ..
మీ ఇంటికొచ్చిమీ అమ్మకి పురుడోసిన అంటరాని మంత్రసాని మాయమ్మమ్మే..!!

పుట్టి చాలాసేపైనా నువ్వు క్యార్ క్యార్‌మని గుక్కెట్టి ఏడ్వలేదని దిక్కుతోచని.
మీ నాన్న... నిలువుగుండడిపోయి, నెత్తీ నోరూ కొట్టుకుంటుంటే... చూస్తూ ఊరుకోలేక
ఆ కటిక చీకట్లో రాళ్లూ రప్పలూ తన్నుకుంటూ అమాంతం మా అయ్య తన
రెక్కట్టుకొని ఈడ్చుకొచ్చినా పల్లెత్తు మాటనని పచ్చిబాలింతరాలు మాయమ్మ..!!

అడ్డాల్లో బిడ్డణ్ణి ఉయ్యాల్లో ఒంటరిగా వదిలేసొచ్చే సేనన్న ఇంగితం లేకుండా
రక్తపు మడుగుల్లో పసిగుడ్డువి.. నిన్ను సాకి తల్లడిల్లిపోయి అటూ ఇటూ తిప్పి..
సహజ వైద్య పద్ధతుల్లో నిన్ను స్పృహలోకి రప్పించింది... కేరింతలు పెట్టించిందీ మాయమ్మే
అంత చలిలోనూ కోక గజ్జల్లోకి ఎగ్గొట్టుకొని ఉడుకుడుకు నీళ్లల్లో నీకు తొలి తానం ఆడించిది మాయమ్మే

పదకొండ్రోజుల నీళ్లపోత నాడు, మీ ఐనవాళ్లంతా నిన్నెత్తుకొని ముద్దాడుతుంటే..
పెరటి గుమ్మంలో ఆకేసి పట్టడన్నంపెట్టి, ముష్టి పీతుల్ల చీర మొహాన కొట్టి...
ఎంత బొడ్డుకోసి అడ్డాల్లో వేసుకుంటే మాత్రం పొత్తిళ్లలో బిడ్డని ఎవళ్లుబడితే వాళ్ళని
ముట్టుకోనిస్తారేంటి? పో పొమ్మని.. అవమానించినా పల్లెత్తు మాటాడని సంస్కారి మాయమ్మ!!

బాలింతగా ఉన్నప్పుడే మీ అమ్మకి జబ్బు చేస్తే.. అది నీకెక్కడ సోకుతుందోనని
తన చనుబాలిచ్చి నిన్ను పెంచి, వట్టి గంజినీళ్లతో నా కడుపునింపేసిందీ మాయమ్మే మీ ఆయమ్మ
నీ ఒళ్లంతా నలుగెట్టి కసరత్తులు జేయించి ఒట్టికాళ్లమీదేసుకుని తలత్తానాలాడించింది
ఇద్దూరమేంటంటే...ఊళ్లో మీరు పెద్దింట్లోళ్లని గొప్పగా సర్దిసెప్పిన మానవతావాది మా నాన్న

మరి నీ అన్నప్రాసన కోసం... అమ్మమ్మ మిద్దెమీద భద్రంగా దాచిన పాతబియ్యమ్మొటిచ్చింది
నీ ఉగ్గుగిన్నెలోకి ఆవునెయ్యి వెచ్చబెట్టేప్పుడు తన చీరకి నిప్పంటిచుకుందీ మాయమ్మే
సీమిడి ముక్కేసుకుని సింకిరి గుడ్డలతో మీ గేదెలెనక తోకలా పాలికాపుజ్జోగం నాది
ఆరుగాలం మీ పాడి పంటల్ని, మీ ఇంటి పరిసరాల్నీ కాపుగాచే నిఘానేత్రం మా నాన్నది

ఈ గొడ్డు చాకిరీకి, కొత్తమాసనాడు కొలిసిచ్చే జీతంలో ఎన్నికుంచాల ధాన్యం కోతగోసేసినా..
లోలోపలే కుమిలిపోతాడేమో గానీ.. పైకి లెక్కలేనట్టుంటాడు...! మా నాన్నది గుండా చెరువా?..!!
మీకాపదొస్తే ప్రాణాలు పణంగా పెట్టి కాపాడే విశ్వాసపాత్రులం మేమే...ఎడం చెయ్యికీ కుడి చెయ్యికీ తేడా లేదూ?
అసుంటసుంటంటారా?... ఎక్కువ- తక్కువ లేదా..? అంటూ మమ్మల్నెందుకు.. ఈసడించుకుంటారు?

ఏటెల్లకాలం మీ గడ్డివాములకు మేం కాపలా కుక్కలెక్క.. మీరు విదిల్చిన ఎంగిలి మెతుకులే
మేం పంచభక్ష్యపరమాన్నాలని భుజించాలా..? నిషేధించినా.. నాలుగక్షరం ముక్కలు నేర్చుకున్నాం
గుండెల్లో బద్దలయ్యే అగ్నిపర్వతాలున్నాయ్... మా కనుపాపల్లో మెరుగుతున్న చరిత్రనే మేం రాస్తున్నాం..
మీ వక్రీభవన కళ్లద్దాల్లోంచి ఓరకంటితో చదివేసి దాన్ని దళితకవిత్వమంటార్రా దద్దమ్మల్లారా..?

తాటికాయంత బుర్రల్లో చీమ తలకాయంత విచక్షణ జ్ఞానం లేని నరరూప రాక్షసులపై యుద్ధం ప్రకటిస్తున్నాం
కండ బలం, గుండెబలం, బుద్ధిబలం సంతరించుకున్న మా ధీరత్వాన్నీ, పోటీ తత్వాన్నీ తట్టుకోలేని కుట్రదారుల్లారా..
అధికార మదమెక్కి మీరు అణగదొక్కేస్తున్నా.. తుపాను ముందర ప్రశాంతత మా సహనం ఇక హెచ్చరిక జారీ చేస్తున్నాం..
హద్దులు మీరింది చాలు... మీ ఆటవిక, మత్స్యన్యాయాలు కట్టిపెట్టి.. వినండిప్పుడు చెబుతున్నాం... అసుంటసుంట..!!!

♦






# ప్రకృతి... విధ్వంసం... చరిత్ర

- సుంకర గోపాలయ్య
9492638547

**క**వి ఏం చేస్తుంటాడు? ఆయన ఆలోచనా విధానం ఎలా ఉంటుంది? ఎప్పుడు కవిత్వం అవుతాడు? ఎప్పుడూ కవిత్వంలోనే ఉంటాడా! కదిలించే సన్నివేశం, కదిలిపోయే హృదయం ఉండాలే గాని.. క్షణ క్షణం కవిత్వమే కదా!

కవికి కవిత్వం మానసికాహారం. పూనుకొని రాసిన కవిత్వం మనకు తెలిసిపోతుంది. కవిత్వం పూనినప్పుడు రాసే కవిత్వం నిలిచిపోతుంది. ఎందుకీ చర్చ అంటారా! తమ జిల్లాలోని కొన్ని ప్రాంతాలను చూచి వద్దామనే ఆలోచన చేసుకున్న ప్రభు... చూశాక కుదురుగా ఉండలేకపోయారు. ఒళ్ళంతా కవిత్వం, కవిత్వంగా ఉండి అక్షరాలతో బొమ్మలు గీచారు. అక్షరాలా చరిత్రను, జ్ఞాపకాలను మనముందుంచారు. 'పర్యావరణ ప్రయాణాలు' అనే పేరుతో ఓ 30 పేజీల చిరుపుస్తకాన్ని తెచ్చారు. 3 ప్రయాణాలను 30 పేజీల కవిత్వం చేశారు.

మెట్ట చెరువు రాయభూపాలపట్నం, కోనసీమ, రంప ఎర్రపాలెం ఈ 3 ప్రాంతాల ప్రయాణ కవిత్వం ఈ పుస్తకం. ''కనపడని అయస్కాంతక్షేత్రమేదో కాలికి చక్రాన్ని కట్టిలాగుతుంది" అని ప్రయాణం మొదలౌతుంది. కవితోపాటు మనం కూడా బయలుదేరుతాం.

ప్రభు మనకు రైలు పట్టాలు, పంటపొలాలను, దారితప్పిన ఉడతల్ని, సంజీవనిలాంటి పులిహోర ప్రసాదాన్ని ఖర్వాటుని శిరస్సులాగా కాంతికి మెరిసే రోడ్డుని. ఆకాశంలో ముఖం చూసుకునే పెద్ద చెరువుని చూపిస్తారు. ఎగరేసిన జెండాలంటి తాటిచెట్లు, గాలితో గొంతు కలిపి పాడే జానపద గేయాలను వినిపిస్తారు. అక్కడక్కడ పెరిగిన కంపల మీద తెల్లని కొంగలు పెదాలమీది గాథసప్తశతిలా నిలబడి ఉండటాన్ని గుర్తింజేస్తారు. ఉల్లంకి పిట్టలు, నీటికాకి, కొక్కిరాయి, నల్లమచ్చల నీళ్ళ బుచ్చిగాడు లాంటి పిట్టలు మన కంటి ముందు బొమ్మకడతాయి.

*"ఎత్తైన గట్టుమీద/ అమ్మ దేవతలా రావిచెట్టు/ ఒక్కో పత్రం ఒక్కోనేత్రం చేసుకొని/ దారినీ ఊరినీ చెరువుని కాస్తుంది"*

*''గోండులు గీసిన బొమ్మలా గూడ కొంగ/ నీటిలో చేపల నాట్యాలు చూస్తూ/ పంచతంత్రంలో కొంగలా తీర్పులు చెప్తోంది లాంటి భావ చిత్రాలు గీస్తారు"*

ఇప్పటిదాకా ప్రకృతిలో పరవశించిన ప్రయాణం నాగరికత పేరు మీద జరిగిన విధ్వంసం వైపు మళ్ళుతుంది. ఇక్కడ ప్రభు అసలు ప్రయాణ రహస్యం తెలుస్తుంది.

*"శిశిరం రాల్చిన చెట్ల ఆకులు రోడ్డుమీద/'పకృతి పంచిన కరపత్రాల్లా పడి ఉన్నాయి.. అవి పర్యావరణ పరిరక్షణకు పంచిన కరపత్రాలు."*

కొండలు చిమ్మిన నెత్తురు, పేల్చేసి దొలిచేసి తవ్వేసిన కొండలు భూమితో చెప్పిన రహస్యాలు, భూమిని ఓడించిన రియల్ ఎస్టేట్ సైన్యాలు, సమాధి అయిన చెరువు.. ఇవన్నీ విధ్వంసక ముఖచిత్రాలు..

రెండవ ప్రయాణంగా కోడిపందేల కోనసీమ బయలుదేరుతాం.. ఇందులోని ముగింపు వాక్యాలు చదివిన తరువాత సహృదయుడైన పాఠకునికి ఈ వాక్యాలు వెంటాడతాయి. నిలబడిపోతాయి.

*"ఒక చినుకు/ దాని పయనం వల్ల గోదావరి అయినట్టు/*

**కవిత**

# భూమిని శపిస్తూ ఆకాశం

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

అతడక్కడ అధిష్టిస్తాడు
దైవంలా దేవతలా
అతడు సంస్థానాధీశుడో
పెట్టుబడి దారుడో
భూస్వామో ధనస్వామో–
ఇక భూమి కదలిక మొదలౌతుంది
నిత్యవృత్తులు కాలు కదుపుతాయి!
వారసత్వం మోసుకొచ్చిన చైతన్యం
చైతన్యం యిచ్చిన నైపుణ్యం
నేత కార్మికుడి చేతిలో ధమనులు సిరలు
అతడి ఆకలి అర్ధనగ్నశరీరం
మగ్గం గుంటలో మనువాడి
విశ్రాంతిని శ్రమ
నిద్రను కర్తవ్యం తినేస్తాయి
అందాల ఆభరణంగా
అవతరించిన వస్త్రాన్ని
దైవమో దేవతో అలంకరించుకున్నాక
తన్నుతాను అభినందించుకుంటూ కార్మికుడు
వొంటి చేతి చప్పట్లు చరుస్తాడు!
కాళ్ళకు చెప్పులు ఎరుగని
రెండుపూటలే రోజనుకున్న మానవుడు
కాలికి రక్షణగా
నడకకు ఠీవిగా
పాదానికి అందంగా
కిర్రు చెప్పులు తయారు చేస్తాడు
రాళ్ళురప్పల్లో చెక్కిన
కళాఖండాల్ని చూసిన మనకు
పాదరక్షల్లో కళను పొదిగి
కనువిందు చేస్తాడు
దైవమో దేవతో తొడిగి
నడక హుందాగా సాగుతుంటే
మూడు పూటల్ని రెండు పూటలకు
కుదించిన మానవుడి
కనురెప్పలు నిశ్శబ్దంగా చప్పట్లు చరిచి
ఆనంద భాష్పాలు రాలుస్తాయి!
యుగాల చరిత్రలో
గజానికో నిజం నిలిచి
వృత్తులన్నీ యిప్పుడు
ఎలుగెత్తి పాడేది వొక్కటే –
నిండుకొన్న కుండల్ని చేతబట్టి
శ్రమ ఫలితం యిదంటూ విజ్ఞప్తులు!
ఆకాశాన్ని అర్థిస్తూ భూమి
భూమిని శపిస్తూ ఆకాశం! ◆

---

***ఒక మనిషి/ తన ప్రయాణం వల్ల సమాజం అవుతాడు"***

కోడిపందాల కోనసీమకి బయలుదేరిన కవి ఆ మార్గంలో గతానికి, ఇప్పటికి వచ్చిన మార్పులను కవత్వీకరించారు. కోడిపందాలు ఆడితే శిక్షింపబడతారు అనే ఫ్లెక్సీలు ఉండేచోటనే.. కాకతీయ తోరణంలా పందేలా స్వాగతద్వారం, నవ్వుతూ ఎమ్మెల్యే నమస్కారం.. అని అనడంలో ప్రభుగారి ఆంతర్యం తెలుసుకోవచ్చు.

***"ఎక్కడికక్కడ బరులు/ చుట్టూ కోళ్ళు మాత్రమే గుర్తుపట్టగల/ ఉద్రేకపు మొహాలు/ పసిపాపల్ని ఎత్తు కొచ్చినట్టు/ పుంజుల్ని తిప్పుతున్నారు"../ అన్ని డేరాల్లోను కోళ్ళే/ మనుషుల్ని మోస్తూ తిరుగుతున్నా"*** యంటారు...

ప్రభు ఉత్సాహంగా ప్రయాణం మొదలు పెట్టి.. ప్రకృతి వెంట తిప్పి.. ఒకానొక  ఉద్విగ్న వాతావరణాన్ని మనలోకి నింపుతారు.

మూడవ ప్రయాణం బౌద్ధ సమణుకల రంప ఎర్రంపాళెం.. ఈ భాగం ప్రభు – చారిత్రక దృష్టిని మనముందు ఉంచుతుంది. కవిత ధారగా సాగిపోతుంది. రాజులు యుద్ధానికి, వ్యాపారానికి, బతుకుకి, చావుకీ తిరిగిన నేల' అంటారు. ఈ ఒక్క వాక్యం ఈ ప్రాంతపు చరిత్రను మనముందు ఉంచుతుంది.

***"ఈ తూర్పు కనుమ పాదాలలో/ ఎంత చరిత్ర రూపొందుతూ వచ్చింది/ మనిషి తన బైరూపాల ముఖాలతో/ ఈ నేల మీద తారట్లాడి/ మనల్ని నిర్మించాడు.."*** ఇవి పచ్చినిజాలు. వాఖ్యానాలు అవసరం లేని వాక్యాలు.

***''గాలి మౌనంగా లేదు/ రెండు వేల వర్షాల మాటలన్నీ/ ప్రిజం వెనుక కాంతికిరణాల్లా వాలుతున్నాయి."***

అవి చరిత్రని వినిపిస్తున్నాయంటూ ప్రభు గొప్ప వాక్యాలు ఎన్నో రాసారు.

***ఒక ప్రాచీన కంపన దేహాన్ని మీటాలంటే, సాల భంజికల మీద పసిరికల నాట్యాలు చూడాలంటె.. ఆకుపచ్చ సముద్రంలో శాక్యముని ధ్యానంలా నిల్చిన కొండను పలకరించాలంటే.*** ఈ చిన్న పుస్తకంలోని గొప్ప కవితాన్ని చదవాలి. మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ప్రభుగారు పుచ్చకాయలు తినిపిస్తారు. ఐసు కొనిస్తారు. కలరస్‌కాయలు తాగిస్తారు. సీవెండి కారేజిల్లో నిమ్మకాయ పచ్చడి వేసిన చద్దిపెరుగన్నపు ముద్ద పెడతారు. మరీ ఆలస్యం ఎందుకు ప్రభు ప్రయాణం కవిత్వంలోకి ప్రవేశించండి. ప్రభు హృదయాన్ని మీటండి. ఇవాళ బానేవచ్చారు అంటారు. అవును, చెట్టు, కొండా చరిత్ర లాంటివి. వాటిని మనిషి కాపాడుతుంటే అవి మనిషిని కాపాడతాయి. అతనికొక చరిత్రను నిర్మిస్తాయి.. ఇదే ప్రభు ఆవేదన. మనం కూడా పంచుకుందాం. చరిత్రను పదిలంగా నిర్మించుకుందాం. ◆

# వర్తమాన సామాజిక కవితా చిత్రం

- వొరప్రసాద్






వట్టి వచనంలా తేలిపోకుండా, సంక్లిష్ట ప్రతీకలతో మరీ అర్థం కాకుండానూ ఈ రెండింటికీ మధ్యస్థంగా సరళంగా, సూటిగా కళాత్మకంగా కవిత్వం రాసి మెప్పించడం అంత సులువైన పని కాదు. ఇటీవల కవిత్వం రాస్తున్న వారి సంఖ్య చాలా పెరిగింది. అయితే కవితా ప్రియులు కొంత పెదవి విరుస్తుంటారు. మంచి కవిత్వంగా పిలిచే నాలుగు వాక్యాలు రాసేవాళ్ళు కనపడటం లేదు అనడం వింటుంటాం. అయితే కవిత్వం రాస్తున్న ఇంతమందిలో సామాజిక వస్తువుకు కళాత్మక కవితా రూపం ఇచ్చేవారు లేకపోలేదు. తన తొలి కవితా సంపుటి 'మనిషి నా భాష' తో తెలుగు కవితా వనంలోకి ప్రవేశించిన కిల్లాడ సత్యనారాయణ ఆ కోవకి చెందిన కవిగా భావించవచ్చు.

సాహిత్య అధ్యయనం కన్నా వర్తమాన సమాజం పట్ల వాస్తవిక అనుభవం ఈ కవికి ఎక్కువ ప్రేరణగా పనిచేసింది. అత్యున్నత పోలీసు అధికారిగా పనిచేసిన క్రమంలో తను ఎదుర్కొన్న అనేక సంఘటనలను కవితా వస్తువులుగా చేసుకున్నారు. ఈ కవితా సంపుటిలోని కవితలు చదివిన కవిత్వ పాఠకుడు ఎవరైనా ఆ విషయాన్ని గమనిస్తారు. ఆయా వస్తువులను కవిత్వంలోకి చాలా అవలీలగా తీసుకురాగలిగారని అనిపిస్తుంది.

'ఆకాశం' అనే కవితలో ***'ఊహకందని ఆకాశంలా/ జీవితం ఎప్పటికప్పుడు/ కొత్త ప్రశ్నలు వేస్తుంది'*** అంటారు. నిజానికి జీవితం ఎప్పటికప్పుడు అర్థమైపోయినట్టూ, తెలిసిపోయినట్టూ ఉంటుంది. అదే సమయంలో ఒకోసారి జీవితం ఏ మాత్రం అర్థం కానట్టూ, అంతా అయోమయంగానూ ఉంటుంది. అలాంటప్పుడు జీవితాన్ని అర్థం చేసుకోవడంలో కొత్త ప్రశ్నలు ఎదురవుతాయి. ఆ విషయాన్ని చాలా తేలికైన పదాలతో చెప్పినా దాంట్లో ఎంతో లోతైన అర్థం ఉంది. ఊహకందని ఆకాశం అనడం ఎంతో ఔచిత్యంగా ఉంది. మన కళ్ళకి ఆకాశంగా కనపడే దృశ్యం లోతుల్లోకి వెళితే అనంతమైన ఖగోళం ప్రత్యక్షమవుతుంది. ఆ అనంతమైన ఖగోళాన్ని అర్థం చేసుకోవడం ఎంత కష్టమో మానవ జీవితం కూడా అర్థం కావడం అంత కష్టంగా కవి భావించాడు. ఆ భావాలను చాలా సులువైన పదాలతో కవిత్వం చేయగలిగారు. ఈ కవితా పంక్తులు విడిగా చదివినా అర్థవంతంగా మనకు కనిపిస్తున్నాయి. కానీ 'ఆకాశం' కవిత మొత్తాన్ని చదివినప్పుడు ఈ పంక్తులు మరింతగా ఇమిడిపోయి పాఠకుడికి భావోత్తేజం కలుగుతుంది.

వర్తమాన సమాజం ఎదుర్కొంటున్న పలు సమస్యల్ని తన కవితా వస్తువులుగా చేసుకున్నారు కిల్లాడ సత్యనారాయణ. పట్టణ సంస్కృతి గురించి కవిత్వీకరిస్తూ ***'పట్టణపు/ ప్లాస్టిక్ పువ్వుల్లో/ నన్ను బంధించాలని చూడకు/.../ పల్లె పెదాలపై నవ్వు/ నన్నాకర్షిస్తుంది'*** అంటారు 'పట్టణపు ప్లాస్టిక్ పువ్వుల్లో' అనే కవితలో. పట్టణాలు, నగరాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. వ్యవసాయ దేశంగా ఉన్న భారతదేశం స్వాతంత్ర్యానంతరం క్రమంగా పరిశ్రమలు, వాణిజ్యం పెరిగి నగరాలు కీలకపాత్ర పోషించడం మొదలైంది. పల్లెతో అనుబంధం ఉన్న ప్రజానీకం ఉపాధికోసం, వ్యాపారం కోసం నగరాలలో స్థిరపడడం పెరిగింది. వ్యవసాయం ప్రాధాన్యత కోల్పోయి పల్లెలు క్రమంగా అదృశ్యం అవుతున్నాయి. చిన్నా పెద్దా పట్టణాలు, నగరాలు పల్లెల్ని మింగేస్తున్నాయి. పల్లె జీవితం చవిచూసిన తరానికి ప్రతినిధిగా కవి ఆ పల్లె జ్ఞాపకాలను తన కవితలో నెమరు వేసుకుంటారు. పట్టణం అంటే విముఖత. ప్లాస్టిక్ పువ్వుతో పోల్చి పట్టణం అంటే తన అయిష్టతను వ్యక్తం చేస్తారు. పట్టణంలో నివసించడం

అనివార్యమైన స్థితిలో ***'పల్లె పెదాలపై నవ్వు'*** తనని ఆకర్షిస్తుందంటాడు. పల్లె జీవితం పట్టణ జీవితంగా మారినప్పుడు ఉండే మానసిక స్థితికి ఈ కవిత అద్దం పడుతుంది.

ఈ కవితా సంపుటి పేరు **'మనిషి నా భాష'.** ఈ శీర్షికతో కవిత ఏమీ లేదు. తన కవితా దృక్పథాన్ని చెప్పడానికి బహుశా కవి తన పుస్తకానికి ఈ పేరు పెట్టి ఉంటారు. సమాజం మొత్తానికి కేంద్రం మనిషి. అందువల్లే తన కవిత్వానికి 'మనిషి' కేంద్రంగా ఉండాలని తొలికవితా సంపుటికి ఈ పేరు పెట్టి ఉంటారు. సమాజం మనిషిని ఉన్నతీకరించాలి. మనిషి సమాజాన్ని మరింత పరిపుష్టం చేయాలి. ఈ రెండు అంశాలు పరస్పర పూరకంగా పనిచేయాలి. మంచి వ్యవస్థ ఉన్నతమైన, మానవీయమైన మనుషుల్ని తయారుచేస్తుంది. సమాజం లోపభూయిష్టంగా ఉంటే మనుషులు ఉన్నతులుగా వికసించలేరు. సమాజం మానవీయంగా లేకపోతే మనుషులు అమానవీయ పరిస్థితుల్ని ఎదుర్కొంటారు. వృద్ధాప్యం గురించి **'ఓల్డేజ్ హోమ్'** అనే కవితలో వృద్ధుల పట్ల సమాజ బాధ్యతను గుర్తుచేస్తారు– ***"కాటికి కాళ్ళు చాపిన జీవితం కాదిది/ కష్టసుఖాలు చూసిన అనుభవం నాది"*** అంటారు. వృద్ధాప్యం గురించి చాలా కవితలు ఇప్పటికే వచ్చాయి. కాని ఈ కవితలో ఓ కొత్తదృష్టి కనపడుతుంది. వృద్ధాప్యం అంటే కాటికి కాళ్ళు జాపడం కాదనే కవి చెప్తున్నాడు. ఒక్కసారిగా పాఠకుడిలో కొత్త ఆలోచన వస్తుంది. నిజానికి మనిషి చనిపోయే చివరి క్షణం వరకూ మనిషిగా గౌరవం పొందుతూనే ఉండాలి. వృద్ధాప్యం పేరుతో వివక్ష కనపరచడం అనేది మనిషికి అవమానకరమే. ఇక్కడ కవి పాఠకుడిలో ఆలోచనలు రేపి మానవ సంస్కారాన్ని పెంపొందించే పనిచేస్తాడు. ఈ కవిత చదివిన పాఠకుడు వృద్ధాప్యాన్ని కాటికి కాళ్ళు జాపడంగా ఇక భావించడు.

అలాగే ఈనాటి ప్రపంచీకరణ సమాజంలో మనిషి ఎంతగా తనని తాను మరిచిపోతున్నాడో **'హిపోక్రసీ'** అనే కవిత చెప్తుంది. ***"నేను నా కోసం పుట్టాను/ మార్కెట్ కోసం పెరిగాను"*** అంటారు ఒకచోట ఈ కవితలో. ఈ రోజు మనిషిని మార్కెట్ ఎంతగా చుట్టుముట్టేసిందో మనం చూస్తున్నాం. ముఖ్యంగా తెలుగు ప్రాంతంలో మార్కెట్ కోసం వేల ఎకరాల వ్యవసాయ భూమిని రైతుల నుంచి సేకరిస్తున్నారు. పెట్టుబడులు రావాలంటే భూమి కావాలి. పరిశ్రమలు పెడితే వాటి ఉత్పత్తులకి మార్కెట్ కావాలి. మార్కెట్ కావాలంటే నగరాలు ఏర్పడాలి. ఇప్పుడు అమరావతిని పెట్టుబడులకు కేంద్రంగా చేయాలని జరుగుతున్న విన్యాసాలను మనం చూస్తున్నాం. వ్యవస్థ మొత్తం మార్కెట్ చుట్టూ తిరుగుతుంది. మార్కెట్‌లో లాభాలు కేంద్రంగా ఉంటాయి తప్ప మానవీయ విలువలకు అవకాశం ఉండదు. అందుకనే కవి మనిషిగా పుట్టాను అయితే మార్కెట్ కోసం పెరిగాను అని అన్నాడు. ఈ వ్యవస్థను లోతుగా అర్థం చేసుకుంటే తప్ప ఈ అవగాహన రాదు.

మనిషి నా భాష అనడంలోనే ఈ కవికి మౌలికమైన అవగాహన, తాత్వికపరమైన అంశాలపట్ల ఆసక్తి ఉన్నట్లు తెలుస్తుంది. వ్యవస్థ ఏదైనా మనిషి కేంద్రంగా నిర్మింపబడాలి అనే సంకేతం 'మనిషి నా భాష' అనడంలో పాఠకుడికి గ్రహింపుకొస్తుంది. వ్యాపారం కోసం, వస్తువుల్ని అమ్ముకోవడం కోసం సమాజం నిర్మించబడితే అక్కడ మనిషి గౌరవంగా బతకడానికి, జీవించడానికి అవకాశం ఉండదు. కొనుగోలుదార్లకే ఈ వ్యాపారసమాజంలో మర్యాద, గౌరవాలు లభిస్తాయి. ఎన్ని వస్తువులను, ఎంత ఎక్కువగా కొనగలిగిన వారికే ఈ సమాజంలో గౌరవంగా కీర్తిప్రతిష్టతో జీవించడానికి అవకాశం. వర్తమాన సమాజంలో ఈ దృశ్యం మనకి స్పష్టంగా కనపడుతుంది. చాలా సున్నితంగా, సరళమైన పద్ధతిలో తనవైన భావాలను కవిత్వం ద్వారా చెప్పడానికి చేసిన ఒక మంచి ప్రయత్నం ఈ కవితా సంపుటి.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మనదేశానికి పేరు. నిజంగా ఆ ప్రజాస్వామ్యాన్ని దేశప్రజలంతా అనుభవిస్తున్నారా? అసలు ప్రజాస్వామ్యమంటే ఏంటి? కవి ఇటువంటి ప్రశ్నలు వేస్తూనే సమాధానాలు కూడా చెబుతారు ***'అధికారమంటే...?'*** అనే కవితలో.– ***'మండిపోతున్న కడుపుల్లో–/ గంజినీళ్ళు పోయడం కదా ప్రజాస్వామ్యమంటే?/ చీకట్ల పొరల్ని – /చీల్చివేయడం కదా అధికారమంటే?/ సంతోషం వెదజల్లే / పరిమళం కదా ప్రజాస్వామ్యమంటే!"*** దేశంలోని ప్రజలందరికీ సంతోష పరిమళాన్ని వెదజల్లడంగా ప్రజాస్వామ్యాన్ని పేర్కొనడం కవి దృష్టిని పట్టిస్తుంది. ఒక కీలకమైన సామాజికాంశాన్ని కవితా వస్తువుగా తీసుకుని పాఠకుడికి సులువుగా బోధపడేలా కవి ప్రయత్నించడం అభినందనీయమైన విషయం.

***"గతి కదా జీవితంలో రీతి / ప్రగతి కదా ప్రయాణంలో నీతి"*** అని 'పువ్వు స్వగతం కవితలో అంటారు. ఒక క్రమబద్ధమైన జీవితాన్ని గడపడం, దాన్ని ప్రగతిమార్గంలో కొనసాగేలా చూసుకోవడం జీవిత ప్రాధాన్యత గల అంశమని సరళమైన రెండు చరణాల్లో వ్యక్తీకరిస్తారు. సంఘంలో కొన్ని విలువలకి కట్టుబడి జీవనం సాగించడం అవసరం.

సమూహంగా మనుషులు కలిసి మెలిసి జీవనం సాగించాలంటే ఆ విలువలే సాధనాలవుతాయి. ఒక మంచి విషయాన్ని పరిమళభరితమైన 'పువ్వు' స్వగతంగా పాఠకుడికి కవి వినిపిస్తాడు.

స్త్రీల చుట్టూ ముళ్ళకంచెల్లా అల్లుకున్న వ్యవస్థను 'తనెక్కడ?' అనే కవితలో శక్తివంతంగా ఆవిష్కరిస్తారు – ***"దైవం రాసిన రాతలు / మతం గీసిన గీతలు / కులం చేసిన తీర్మానాలు / కుటుంబం వేసిన నిర్ణయాలు"*** దైవం, మతం, కులం, కుటుంబం స్త్రీని చుట్టుముట్టి తనకి వ్యక్తిత్వం లేకుండా చేసిన స్థితిని చాలా సునాయాసంగా 'తనెక్కడ?' అంటూ ప్రశ్నించడంతో ఆ తీవ్రత పాఠకుడిని తాకుతుంది. చిన్న చిన్న మాటల్లోనే మౌలికమైన, లోతైన అంశాలను సుబోధకం చేయడంలో కవి విజయం కనపడుతుంది.

అవయవ లోపంతో జన్మించినా దాన్ని అధిగమించి ముందుకు సాగిన దృశ్యాన్ని స్ఫూర్తివంతంగా చెప్పిన కవిత **'ధృతి'.** – ***"గళం నుండి సంగీతం ప్రవహించింది/ గాత్రం గానానికి అనుసంధానం అయ్యింది/ శ్రోతలు పరవశించిపోయారు/ ఆమె స్వరానికి నీరాజనవాహిణి/ ఇప్పుడు ఏ రెండు కళ్ళూ/ ఆమె కాళ్ళవైపు చూడడం లేదు/ ఇప్పుడు అందరూ– / ఆమె స్వరం కోసం పరుగులు"*** విజయం సాధించడానికి ఏ లోపమూ అడ్డంకి కాదంటూ ఉత్తేజంగా సాగుతుంది ఈ కవిత. 'నీరాజనవాహిణి' అనే పదాన్ని కొత్తగా సృష్టిస్తాడు కవి. ఆ పదం చక్కగా కవితలో సహజంగా ఇమిడిపోయింది. ఆమె స్వర ప్రతిభకు ప్రజలు నీరాజనాలు పలికారు అనే విషయాన్ని 'నీరాజనవాహిణి' అనే ఒక్క పదంతో కవి చెప్పగలిగారు.

ఈ సంపుటిలో మనం చదివే ప్రతీ కవితా మనం నిత్యం జీవితంలో ఎదుర్కొనే అంశాలనే ఆకట్టుకునే విధంగా వివరిస్తుంది. సదరు అంశాన్ని కొత్తగా చెప్పడానికి కవి చేసే ప్రయత్నం కూడా కనపడుతుంది. ఈ కవితల్లో చాలా లోతైన, సంక్లిష్ట జీవితాంశాలని మాములు మాటల్లో చెప్పడం చూస్తాం. **'స్వేచ్ఛ'** అనే కవితలో ***"భావాల బానిసత్వం/ వొదిలించుకుని కదా/ మానవజాతి పురోగమించింది?/ చరిత్ర ఛాయల్ని / తొలగించుకొని కదా / మానవజాతి పురోగమించింది/ సంకెళ్ళను తొలగించుకొని కదా / మేధస్సు అంబరాన్నంటింది"*** అంటారు. ఈ రోజు సమాజం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాల చారిత్రక నేపథ్యంలోకి పాఠకుడిని తీసుకెళ్ళిపోతారు ఈ కవితలో. తను చెప్పదలుచుకున్న అంశంపట్ల ఆసక్తి కలిగేలా, ఆలోచన చేసేలా చేయడంలో కవి సఫలీకృతుడవుతాడు. కవిత చదివిన తర్వాత ఆ విషయం పట్ల మన భావాలు పురివిప్పుకుంటాయి.

వేగంగా పరుగులు తీస్తున్న సమకాలీన సమాజంలో మనిషి స్థితికి 'సమయ దారిద్ర్యం' కవిత అద్దం పడుతుంది. ***'తనకోసం కాక/ ధనం కోసం బతకాల్సొచ్చింది /గడియారం ముల్లు చప్పుడు / వినబడుతుందే కాని-/ అలుపెరగక కొట్టుకుంటున్న/ గుండె చప్పుడు కాదు"*** అంటారు. బ్రతకడానికి, ఆ తర్వాత విలాసంగా బతకడానికి ధన సంపాదనలో మునిగిపోయే పరిస్థితులను ఈ కవితా చరణాలు గుర్తు చేస్తాయి. గుండె శబ్దాన్ని గడియారం ముళ్ళు శబ్దంతో పోల్చి వేగాన్ని, ఒత్తిడిని పాఠకుడి కళ్ళకు కట్టిస్తాడు కవి.

కిల్లాడ సత్యనారాయణ కవిత్వ ప్రయోజనం గురించి స్పష్టమైన అవగాహన ఉన్న కవి. అక్షరం అన్నా తెలుగు భాష అన్నా ప్రేమగా స్పందించే కవి. ***"మనిషిని నిలబెట్టడం కదా/ నా కవిత్వం"*** అని 'తాదాత్మ్యం' కవితలో అంటాడు కవి.

కవి వ్యక్తిత్వాన్ని సూటిగా తెలియజేసే కొన్ని కవితా చరణాలు మనకు ఈ పుస్తకంలో తటస్థ పడతాయి. ***"తిట్టుతో, పొగడ్తతో సంబంధం లేనివాణ్ణి/ ఆశతో, నిరాశతో అనుబంధం లేనివాణ్ణి/ నాకు తెలుసు/ నువ్వు నన్ను కదిలించలేవని/ చీకటినీ వెలుతురినీ సమానంగా స్వీకరించేవాణ్ణి/ దుఃఖంలో, సుఖంలో సమానంగా జీవించేవాణ్ణి"*** అంటారు. చక్కటి జీవిత పరిణతిని ఈ చరణాలు వ్యక్తం చేస్తాయి. ఒక బాధ్యతాయుత అధికారిగా ఉన్న కవి ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. తన స్వీయానుభవం నుండి తన అవగాహనలో ఇముడ్చుకున్న భావాల సారాంశం ఈ కవితా పుస్తకం. తొలిపుస్తకంగా ఏమాత్రం అనిపించదు. భాష, భావం, వ్యక్తీకరణ, పదబంధాలు కవితా పాఠకుడికి తమ రుచిని అందిస్తాయి. మరింత గాఢమైన కవిత్వం ఈ కవినుండి వచ్చే అవకాశాన్ని ఈ తొలి కవితా సంపుటి గట్టి వాగ్దానం చేస్తుంది.

**'ఆమెపేరు'** అనే శీర్షికతో ఒక కవిత ఆ పుస్తకంలో ఉంది. ఆమె వస్తే ఆ ఊరు శుభ్రపడుతుంది, ఆమె వస్తే ఆ ఊరుకి బడి వస్తుంది. ఆమె వస్తే ఆ ఊరుకి ఆసుపత్రి వస్తుంది అంటూ సాగుతుంది ఆ కవిత. పాఠకుడికి ఆ కవిత చివరి పంక్తులకి చేరుకుంటేనే గాని తెలియదు ఆమెవరో. ఆమె పేరు 'చైతన్యం' అంటారు కవి. మనిషికి చైతన్యం ఎంత ప్రాధాన్యత కల అంశమో ఈ కవిత చెబుతుంది. ఆ సామాజిక చైతన్యం మనిషికి వచ్చినప్పుడే ఈ వ్యవస్థ మరింతగా మానవుడిని ఉన్నతుడ్ని చేస్తుందనే సందేశం 'మనిషి నా భాష' కవితా సంపుటి ఇస్తుంది. కవిత్వ ప్రేమికులు తప్పక చదవాల్సిన ఒక మంచి కవితా సంపుటి ఇది. ♦

**కథ**

# సంకల్పం



**పుష్పాల సూర్యకుమారి - 9391113756**

నాయుడుగారు కాల్చిన చుట్ట పడేసి ఆ రోజు న్యూస్ పేపర్ తిరగేయసాగారు. ఇంతలో నాయుడుగారికి బాగా సన్నిహితులు, ప్రక్క ఇంటి సత్యమూర్తిగారు వచ్చారు.

"రావయ్యా! సత్యమూర్తీ!" అంటూ తన ప్రక్కన ఉన్న కుర్చీ చూపించారు.

సత్యమూర్తిగారు కూర్చుంటూ "నాయుడూ! మీ మనువడు రాజేష్ ఊళ్ళో రొయ్యల చెరువుల తవ్వకాలను నిషేధించే ప్రయత్నాలు చేస్తున్నాడట? ఓ పది మంది కుర్రాళ్ళతో ఉద్యమాన్ని బాగానే లేవదీస్తున్నాడు?" అన్నారు ఆరా తీస్తూ.

"అది ఉద్యమం కాదు, ఒక యజ్ఞం. ఆ యజ్ఞంలో మనలాంటి పెద్దలం కూడా మంచీ చెడూ ఆలోచించి సమిథలం కావాలి. మన గోదావరి జిల్లాలో ఇష్టానుసారంగా రొయ్యల సాగు కొనసాగిస్తున్నారు. ఇది భవిష్యత్తుకు పెనుముప్పుగా మారే ప్రమాదం ఉంది. దీని వలన దారుణమైన పరిస్థితులు తలెత్తవచ్చు. ముందు, ముందు సిరుల పంటలు పండించే పంట పొలాలు ఎందుకూ పనికిరాకుండా పోతాయి. ఇప్పటికే పంట కాలువలు పాడైపోతున్నాయి. పొలాలు ఉప్పుగా మారే ప్రమాదం ఉంది. వీచే గాలి, ప్రవహించే నీరు కలుషితమై పోవచ్చని కొందరు అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు. అంతే కాదు ఈ రొయ్యల సాగు వలన భూగర్భ జలాలు కాలుష్యపూరితమై పోతున్నాయి. వ్యవసాయానికి, తాగునీటికి కావలసిన నీటి వనరులు హరించుకుపోయే ప్రమాదముంది. నా మనుమడు అగ్రికల్చర్‌లో పి.హెచ్‌డి చేసాడు. వ్యవసాయం గూర్చి బాగా తెలుసు. రొయ్యల చెరువుల వలన పక్క పంట పొలాలు నాశనమవ్వకూడదనే వాడి ఆవేదన, ఆరాటం. అందుకే రొయ్యల చెరువుల అక్రమ తవ్వకాలను అడ్డుకుంటున్నాడు. ఊళ్ళో జనానికి ఇది మింగుడు పడడం లేదు!" ఆవేశంగా

అన్నారు.

"నాయుడూ! నువ్వు చెప్పింది అక్షర సత్యం కానీ, కొందరు స్వార్థపరులు రొయ్యల చెరువుల వల్ల లాభాలు వచ్చి పడిపోతుంటే రేపటి భవిష్యత్తు గూర్చి ఆలోచించడం లేదు. ప్రతి ఒక్కరిలో స్వార్థం పడగలు విప్పుతోంది. ప్రక్కవాడి పొలం ఏమైతే మనకేంటి అన్న నిర్లక్ష్య వైఖరి కనపడుతోంది ప్రతి ఒక్కరిలో!" అన్నారు నిస్పృహగా సత్యమూర్తిగారు.

సరిగ్గా అప్పుడు శంకరం పది మంది ఊరి జనాన్ని వెంటబెట్టుకుని నాయుడుగారి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. నాయుడుగారు ఊరి జనాన్ని, అల్లుడు శంకరాన్ని చూచి విస్మయంగా "శంకరం! ! ఏంటి? వీళ్ళని వెంటబెట్టుకొచ్చావు?" అడిగారు.

"మీరు ఈ ఊరి పెద్దలు... అందరి తగవులు తీరుస్తారు కదా... మా తగవు కూడా తీరుస్తారని!" అన్నాడు.

"ఏంటి! ఏమైంది?" అడిగారు కంగారుగా.

"వీళ్ళంతా తమ పొలంలో రొయ్యల సాగు కోసం చెరువులు తవ్వుకుంటుంటే మీ మనుమడు రాజేష్ ఓ పదిమంది కుర్రాళ్ళతో వచ్చి తవ్వడానికి వీళ్ళేదని అడ్డుపడ్డాడు. అంతే కాకుండా ఈ రోజు నా పొలంలో రొయ్యల చెరువుల్ని తవ్వుతుంటే అడ్డుపడి పనివాళ్ళని బెదిరించి పంపించేసాడు. రొయ్యల సాగు జరుగుతున్న చోటల్లా నిరోధిస్తున్నాడు. ఊళ్ళకు ఊళ్ళనే మార్చేస్తాడా? ఎన్నో ఆశలు పెట్టుకుని జీవిస్తున్న వీళ్ళందరి ఆశలపై నీళ్ళు చల్లుతాడా? ఇది న్యాయమా చెప్పండి!" అని నిలదీసాడు.

నాయుడుగారు ఏదో మాట్లాడబోయారు. ఆ వచ్చిన జనం దుయ్యబడుతూ "మీ మనుమడ్ని పట్నం వెళ్ళి ఉద్యోగం చేసుకోమని చెప్పండి! ఇక్కడికొచ్చి ఊరిని బాగు చేస్తానంటూ మా జీవితాల్ని రోడ్డు మీదకి ఈడ్చవద్దని చెప్పండి! పది మంది కుర్రాళ్ళని వెంటబెట్టుకుని ఉద్యమాలు లేవదీస్తున్నాడు. మా జోలికొస్తే మేం ఊరుకోము!" బెదిరిస్తూ అన్నారు.

నాయుడుగారికి కోపం, ఉద్రేకం, ఉక్రోషం ముంచుకొచ్చాయి. "ఏం చేస్తారయ్యా! చంపేస్తారా! స్వార్థపు ఊబిలో కూరుకుపోయారు. ప్రక్కవాడి పొలం ఏమైపోయినా ఫర్వాలేదు మీకు. ఇలా అందరూ ఈ భూముల్ని రొయ్యల చెరువులు చేసేయండి... రేపు మనకు తినడానికి తిండి గింజలుండవు. అన్నానికి బదులు రొయ్యలే తినాలి. వరి వ్యవసాయం కనుమరుగైపోతుందనే చింతలేదు మీకు. ఏ ముఖం పెట్టుకుని వచ్చారు న్యాయం చేయమని... మీరు చేస్తున్న పనిలో న్యాయముందా?" ఖండిస్తూ అడిగారు.

ఎప్పుడొచ్చాడో తెలియదు రాజేష్. "తాతయ్యా! వీళ్ళ మెదడులో రొయ్యల చెరువులు కాసులు కురిపించే కల్పవృక్షాల్లా కనిపిస్తున్నాయి. భవిష్యత్తులో వంట పొలాలు సర్వనాశనమైపోయినా వీళ్ళకి కించిత్ బాధలేదు. వీళ్ళ నరనరాల్లో స్వార్థం జీర్ణించుకుపోయింది!" అన్నాడు.

"వచ్చావా! నాయనా! వీళ్ళకి సమాధానం చెప్పు!" కోపంతో ఊగిపోతూ అన్నాడు శంకరం.

"మూడు పంటలు పండే సారవంతమైన భూముల్ని రొయ్యల చెరువులుగా మార్చటం న్యాయమా? అన్నపూర్ణగా పిలిచే గోదావరి జిల్లాలో మీలాంటి స్వార్థపు శక్తులు ఆక్వాసాగుతో బంగారు పంట పొలాల్ని ఉప్పు భూములుగా మార్చేస్తున్నారు. ఇది భవిష్యత్తును వణికిస్తోంటే మీరెందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. ఈ ఊరు మనకి బ్రతుకునిచ్చింది. ఊరికి మనం ఎంతో కొంత మేలు చేయాలి కదా. మన ఊరి బాగు కోసం మనందరం బాధ్యతగా వ్యవహరించాలి. మన గ్రామ అభివృద్ధికి కృషి చేద్దాము...ఈ క్రతువులో మీరూ భాగస్వాములుకండి! అంతేగాని, స్వార్థపుటాలోచనకు స్వస్తి చెప్పండి. వరి వ్యవసాయాన్ని వృద్ధి చేద్దాము...అక్రమ ఆక్వా తవ్వకాలు నియంత్రిద్దాము...మన దేశంలో తరతరాలుగా వృత్తి ధర్మంగా వస్తోన్న వ్యవసాయాన్ని పరిరక్షిద్దాము...

ఆక్వా సాగులో యాంటీబయోటిక్స్ వాడకం ఎక్కువగా ఉంటోంది. ఇది ప్రజారోగ్యంపై దుష్ప్రభావం చూపుతోంది. రొయ్యల సాగుకు ఉపయోగించే యాంటీబయోటిక్స్ వాడకం వలన రొయ్యలను తింటున్న జనానికి...ఆ మందుల ప్రభావం వలన కొన్ని రకాల వ్యాధులు సంక్రమిస్తున్నాయి. చివరకు క్యాన్సర్ కూడా రావచ్చని అమెరికా, యూరోపియన్ దేశాలు పరిశోధనల్లో వెల్లడయింది. అక్రమ చెరువుల తవ్వకాల వల్ల ఇప్పటికే విలువైన భూములు బీడుబారిపోయాయి. ఇక అవి అధికమైతే భూములన్నీ ఎడారిగా మారిపోయే ప్రమాదముంది.

మన వ్యవసాయ క్షేత్రాన్ని కాపాడుకుందాము... అంతేగాని కురుక్షేత్రంగా మార్చకండి! ఆక్వా సాగు వలన లాభాలు ఎలా ఉన్నా కన్నీళ్ళు మిగల్చగలవు. తరువాత పైసా ఆదాయం ఉండదు. ప్రభుత్వం నిర్దేశించిన భూముల్లోనే చెరువుల తవ్వకాలు జరగాలి. దానికి మేం అడ్డుపడము. ప్రభుత్వ నియమాలు పాటించాలి... వారి అనుమతి పొందాలి. వాటిని ఉల్లంఘిస్తే మేము సహించము. ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాము!" ఉద్వేగంగా, హిత బోధ చేసాడు.

"ప్రభుత్వానికి ఏం చెబుతావయ్యా!" కోపంగా మీదమీదకి వచ్చారు.

"పచ్చని సారవంతమైన భూముల్లో రొయ్యల చెరువులు తవ్వితే ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించదు. వాటికి కొన్ని నిర్దేశితమైన ప్రదేశాలను కేటాయించింది. ఆ భూముల్లో చెరువులు తవ్వుకోండి. అలా చేయకపోతే మీ అక్రమ తవ్వకాలు గూర్చి ప్రభుత్వానికి విన్నవించుకుంటాము!" ఆవేశంగా అన్నాడు. కొందరు విని మౌనంగా వెళ్ళిపోయారు. మరికొందరు కోపంతో "మీ మనువడు మా దారికి అడ్డు వస్తే మేము ఊరుకోము నాయుడుగారూ!" అంటూ బెదిరించి వెళ్ళిపోయారు. శంకరం కోపాన్ని నిగ్రహించుకుంటూ అక్కడి నుండి కదిలాడు.

"తాతయ్యా! వాళ్ళ బెదిరింపులు తాటాకు చప్పుళ్ళలాంటివి. భయపడకు!" అన్నాడు రాజేష్. ఆయన మౌనంగా ఇంట్లోకి వెళ్ళారు. రాజేష్ అనుసరించాడు.

నాయుడుగారి భార్య శకుంతలమ్మ "ఏవండీ! శంకరం మన ఊళ్ళో జనాన్ని ఎందుకు వెంటబెట్టుకొచ్చాడు? ఏమైంది?" అని ప్రశ్నించింది.

నాయుడుగారు ఆమెకు జరిగిందంతా చెప్పి నిట్టూర్చారు.

అంతా విని శకుంతలమ్మ "రాజేష్! ఎందుకురా మనకీ గొడవలు? ఊరిని ఉద్ధరిస్తానని ఉద్యోగం మానేసి ఇక్కడకొచ్చి అందరి నోట్లో చెడ్డగా నానుతున్నావు? నువ్వు చేసే మంచి పనులను వాళ్ళు గ్రహించడం లేదు. నీ మీద దుగ్ధ పెట్టుకుని నీకేం కీడు తలపెడతారో అని భయంగా ఉంది. ఇక నుండి దేంట్లోనూ తలదూర్చకు!" అంది నిక్కచ్చిగా.

"ఒక మంచి పని చేసేటప్పుడు ఇలాంటి అవాంతరాలు, అడ్డుగోడలు తప్పవు. అనవసరంగా నువ్వేం భయపడకు! వాడ్ని నీ మాటలతో నీరుగార్చకు!" అన్నారు భార్యకి ధైర్యం చెబుతూ నాయుడుగారు.

"నాన్నమ్మా! నేను అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకూ నిదురపోను. ఈ పోరాటంలో నేను ఏమైపోయినా ఫర్వాలేదు. ఈ గ్రామాన్ని బాగుచెయ్యాలి. వరి వ్యవసాయాన్ని కాపాడాలి." దృఢ నిశ్చయంతో అన్నాడు.

"నీకు మీ తాతగారిలానే సమాజ సేవ చేయాలి, గ్రామాల్ని ఉద్ధరించాలి అన్న తపన, ఆరాటం ఎక్కువైపోయాయి! నీకు ఏమైనా అయితే ఈ నాన్నమ్మ తట్టుకోలేదురా!" ఆవేదనతో కదిలిపోతూ అందామె.

"నాకు ఏం కాదు నాన్నమ్మా! భయపడకు. ఆప్యాయంగా భుజాల చుట్టూ చేతులు వేసి అనునయించాడు.

◆◆◆

ఆ రోజు రాజేష్ మేనత్త విశాలాక్షి ఇంటికి వెళ్ళాడు. ఉష మండువాలో ఎదురైంది. ముఖం నిండా నవ్వు నింపుకుని బావకు దగ్గరగా నిలబడి "ఏంటి బావా! అసలు రావడం మానేసావు?" గోముగా అడిగింది.

అతడు చిరునవ్వుతో మరదల్ని పరిశీలనగా చూస్తూ "ఉషా! అసలు ఖాళీ ఉండటం లేదు. పని ఒత్తిడిలో ఉన్నాను!" అనురాగాన్ని ఒలికిస్తూ చెప్పాడు.

"నా కంటే నీకు పనులే ఎక్కువైపోయాయా? నన్ను చూడాలనిపించటం లేదా?" బుంగమూతి పెట్టి చిరుకోపంగా అడిగింది.

"ఉషా! నువ్వు కోపంలో కూడా చాలా అందంగా ఉంటావు... నువ్వు ఎప్పుడూ నా మీద ఇలాగే కోపగించాలి!" అన్నాడు ఆమె గడ్డాన్ని పైకెత్తి ప్రేమగా చూస్తూ.

"అన్నట్టు రొయ్యల చెరువుల గూర్చి మా నాన్నతో కూడా వైరం పెంచేసుకున్నావు. మా నాన్న నీ మీద చాలా కోపంగా ఉన్నారు!" అంది.

"సరేలే! అత్తయ్య ఏది!" అడిగాడు.

"వంటింట్లో ఉంది!"

వంటింట్లోకి దారి తీస్తూ "అత్తయ్యా!" అని పిలిచాడు.

విశాలాక్షి ముఖం ఇంత చేసుకుని "రాజేష్! నువ్వా! రారా! ఏంట్రా ఈ మధ్య మా ఇంటికి రావడం మానేసావేం?" ఆత్మీయంగా అడిగింది.

"ఖాళీ ఉండడం లేదు అత్తయ్యా!" అన్నాడు.

"సరేలే! నీ కోసం తొక్కుడు లడ్డు చేసాను తిను!" అంటూ ప్లేటులో లడ్డూలు పెట్టి అందించింది.

అతడు లడ్డూ నోట్లో పెట్టుకుని "అత్తయ్యా! మంచి టేస్ట్‌గా ఉన్నాయి. నువ్వు ఏమి చేసినా బాగుంటుంది!" అభినందనగా చూసాడు.

సరిగ్గా అప్పుడు శంకరం వచ్చాడు. రాజేష్‌ని చూసీ చూడనట్టే ముఖం పక్కకు పెట్టుకుని ''విశాలాక్షీ! మంచి నీళ్ళు ఇవ్వు!" అడిగాడు.

రాజేష్‌కి మావయ్య ప్రవర్తనకి బాధ కలిగింది. ఉషా, విశాలాక్షీ కూడా శంకరం ప్రవర్తనని గమనిస్తూనే ఉన్నారు.

''అత్తయ్యా! మావయ్యకి నా మీద కోపం వచ్చినట్టుంది!" అన్నాడు.

విశాలాక్షి "వాడి మీద మీకెందుకు కోపం?" సూటిగా అడిగింది.

"నీకు బాధగా లేదా! ఎంతో లాభాలు తెచ్చిపెట్టే రొయ్యలు చెరువులు వీడి మూలాన ఆగిపోయాయి. నేను క్షమించలేను!" ఉక్రోషంగా అన్నాడు.

"మావయ్యా! మీరు స్వార్థంతో ఆలోచిస్తున్నారు. రొయ్యల చెరువుల వల్ల ఎంత లాభాలున్నాయో నష్టాలు కూడా అలాగే ఉన్నాయి. ఎన్నో శతాబ్దాలుగా మనకు జీవన భృతి అయిన వరి వ్యవసాయానికి తిలోదకాలిచ్చి... ఆక్వా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. మీ పద్ధతి ఎలా ఉందంటే మీరు కూర్చున్న కొమ్మను నరుక్కునట్టుంది. మీరు మారకపోతే ఎన్నో కష్టాలు చవి చూస్తారు!" ఉద్వేగంగా అన్నాడు.

"రాజేష్! నా మాట వినరా! నా భూమి నా కూతురికే కదా... రేపు పెళ్ళి అయితే అది నీకే దక్కుతుంది. రొయ్యల చెరువుల వలన బోల్డు లాభాలు వస్తాయి. అది మొత్తం నీకే చెందుతుంది. మన భూమి విషయంలో చూసీ చూడనట్టు వదిలేయి!" ప్రాధేయపడ్డాడు శంకరం.

"మావయ్యా! నా దృష్టిలో అందరికీ ఒకటే న్యాయం జరుగుతుంది. నువ్వు కాబోయే మావగారివని వదిలేస్తానని అనుకోకు. ముందు నువ్వు ఆ స్వార్థపుటాలోచనకు స్వస్తి చెప్పు. నీ ఆస్తిపై నాకెటువంటి ప్రేమ లేదు. ఉష అంటే నాకు ప్రాణం... ఈపలంగా ఏ కట్నకానుకలు లేకుండా ఉషను పట్టి చేతులతో నా ఇంటికి పంపు...నాకు ఆనందమే!" అన్నాడు.

"ఇంత జరిగిన తరువాత నా కూతుర్ని నీకిచ్చి ఎలా పెళ్ళి చేస్తాననుకున్నావురా! వెళ్ళు... వెళ్ళు... ఇక నా కూతురిపై ఎటువంటి ఆశలు పెట్టుకోకు.... నా కూతుర్ని నాకిష్టమైన వాడికిచ్చి పెళ్ళి జరిపిస్తాను!. నీ నిర్ణయం మార్చుకో!" కోపాన్ని నిగ్రహించుకుంటూ పిడికిళ్ళు బిగిస్తూ ఖంగున అన్నాడు.

"మావయ్యా! మీరు మీ కూతుర్ని ఇచ్చి పెళ్ళి చెయ్యకపోయినా ఫర్వాలేదు. నా నిర్ణయంలో ఎటువంటి మార్పు ఉండదు. నా లక్ష్యసాధనే నాకు ముఖ్యం. లక్షల్లో జీతం వచ్చే ఉద్యోగాన్ని వదులుకొని వచ్చాను ఈ ఊరి బాగు కోసం! డబ్బు మీద నాకెప్పుడూ ఆశ లేదు. జనానికి సేవ చేయడమే నాకు ఆనందం. నా ఆశ, ధ్యాస, శ్వాస ఈ ఊరి సంరక్షణ కోసమే! వస్తాను!" అన్నాడు కదులుతూ.

♦♦♦

ఆ రోజు నాయుడుగారు వీధి అరుగు మీద కూర్చుని పొలంలో పనిచేసే పాలికాపులతో మాట్లాడుతున్నారు. సరిగ్గా అప్పుడు ఊరిలో ఉన్న మగవాళ్ళంతా కట్టగట్టుకు వచ్చారు.

"నాయుడుగారు! మీ మనుమడు చేసిన పని ఏమైనా బాగుందా!" తీవ్రంగా అడిగారు దుయ్యబడుతూ.

"మా మనమడు ఏం పని చేసినా మంచిదే చేస్తాడు!" అన్నారు శాంతంగా.

"ఇక్కడ మాకు ఒళ్ళు మండిపోతుంటే చాలా నిదానంగా సమాధానం ఇస్తున్నారు. ఊళ్ళో కుర్రాళ్ళందరిని తమ వైపు లాక్కోవడమే కాకుండా మా ఇంటి ఆడవాళ్ళలో కూడా చైతన్యం తెచ్చి ఉద్యమాలు లేవదీస్తున్నాడు!" ఉరుముతూ అడిగారు.

"ఏంటయ్యా! ఏం జరిగింది?" అడిగారు విసుగ్గా.

"ఇంకా ఏం జరగాలి? మా ఆడవాళ్ళని కూర్చోబెట్టి

చెరువుల తవ్వకాల వల్ల నష్టాలు ఏకరవు పెడుతున్నాడు. పూర్తిగా వాళ్ళ బుర్రల్ని మార్చేసాడు. మా ఆడవాళ్లు మా ఇంట్లో నాలుగు రోజుల్నుంచి అన్నానికి బదులుగా రొయ్యల కూరలు వండి మా కంచాల్లో వడ్డించి "ఇదే అన్నం అనుకుని తినండి!" అంటున్నారు. "ఇదేమి చోద్యం రొయ్యలు అన్నం అనుకొని ఎలా తింటాము!" అని అడిగితే "మన ఊళ్ళో పంట భూముల్ని రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారుగా... రేపు మనకు తినటానికి బియ్యం గింజలుండవు. రొయ్యలే. అందుకే అలవాటు చేసుకోండి!" అంటూ దెప్పుతూ మా ముందు కంచాలు విసిరి కొడుతున్నారు. చివరకు ఈ ఊళ్ళో ఆడవాళ్ళని కూడా మాకు వ్యతిరేకంగా మార్చేసాడు. వాళ్ళకి మీ మనుమడి మాటే వేదవాక్కు అయిపోయింది!" అన్నారు మండిపడుతూ.

"ఆడకూతుళ్ళందరూ మంచి నిర్ణయం తీసుకున్నారు. వాళ్ళకున్న ఇంగిత జ్ఞానం మీకు లేకపోయింది. రేపు భవిష్యత్తులో మనం అన్నానికి బదులు రొయ్యలే తినవలసివస్తుందని వాళ్ళకు తెలిసిన సత్యం మీకు అవగతం అవ్వడం లేదు. మీరు మారకపోతే మీ భవిష్యత్తు అంధకారమైపోతుంది. నష్టాల ఊబిలో కూరుకుపోతారు. ఆ సత్యాన్ని తెలుసుకోండి! వెళ్లండి!" గట్టిగా చీవాట్లు పెట్టి పంపేసారు, నాయుడుగారు.

♦♦♦

అర్ధరాత్రి రెండు అవుతోంది. రాజేష్ ఆ సమయంలో ప్రక్క ఊరికి పని మీద వెళ్ళి తిరిగి వస్తున్నాడు బైక్ మీద. ఒక పది నిమిషాల్లో ఇంటికి చేరుకునేవాడే... ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కారులో స్పీడుగా వచ్చి కావాలనే రాజేష్‌ని గుద్దేసి వెళ్ళిపోయారు. ఒక ప్రక్క అతడు పడిపోయాడు. మరో ప్రక్క బైక్ పడిపోయింది. రక్తం మడుగులో కొట్టుకుంటున్న అతడ్ని తెలిసిన వాళ్ళు చూసి, అంబులెన్స్‌కి ఫోన్ చేసి రప్పించారు. వెంటనే ఆ ఊరికి ప్రక్కనే ఉన్న పట్నంలోని హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు హడావుడిగా. డాక్టర్లు అతడి పరిస్థితి చూసి కేసు చాలా సీరియస్ అని చెప్పి వెంటనే ట్రీట్‌మెంట్ మొదలుపెట్టారు. డాక్టర్లు, నర్సులు చాలా హడావుడిగా తిరుగుతున్నారు. నాయుడుగారికి విషయం తెలిసి భార్యను వెంటబెట్టుకుని ఆగమేఘాల మీద వచ్చేసారు. శకుంతలమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. శంకరం, భార్యని కూతుర్ని తీసుకొచ్చాడు. ఉష తాతయ్యని పట్టుకుని ఎక్కి ఎక్కి ఏడ్వసాగింది. ఆయన మనుమరాలి వీపుని ప్రేమగా నిమురుతూ "ఏడ్వకు తల్లీ! నీ బావకు ఏం కాదు. నీ ప్రేమ గొప్పది... వాడిని బ్రతికిస్తుంది!" అన్నారు ఓదార్పుగా. ఊరి జనంతో ఆ హాస్పిటల్ నిండిపోయింది.

రాజేష్ అంటే ప్రాణమిచ్చేవారే కాదు... చెఱువుల విషయంలో వ్యతిరేకించేవాళ్ళు కూడా వచ్చారు, హాస్పిటల్‌కి. వృద్ధాశ్రమంలోని వృద్ధులు, తను చదివిస్తున్న స్కూల్ పిల్లలు ఏడుస్తూ వచ్చేసారు.

ఆ ఊరి ఆడవాళ్ళందరూ "ఏ పాపాత్ములు చేయించారో ఈ ఘోరం. దేవుడిలాంటి కుర్రాడ్ని పొట్టన పెట్టుకున్నారు. వాళ్ళు సర్వనాశనం అయిపోతారు." ఊరికి మేలు చేసే ముత్యంలాంటి పిల్లాడ్ని చంపటానికి ప్రయత్నిస్తారా...వారికి పుట్టగతులుండవు!" రకరకాలుగా శాపనార్థాలు పెట్టసాగారు.

నాలుగు రోజులు గడిచిపోయాయి. రాజేష్ పరిస్థితి రోజురోజుకి మెరుగయింది. గండం నుంచి బయటపడ్డాడు. పది రోజుల తరువాత హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చాడు. అప్పుడు ఊరి జనమంతా రాజేష్‌ని చూడ్డానికి వచ్చారు. రొయ్యల చెరువుల తవ్వకాల విషయంలో రాజేష్ మీద కోపంగా ఉన్న వ్యక్తులు తమ తప్పు తెలుసుకుని పశ్చాతాపంతో "రాజేష్! ఈ ఊరికి మంచి చేయాలని నువ్వు ఎంతగానో తపనపడుతుంటే మేము గ్రహించలేకపోయాము. ఇన్నాళ్ళు మూర్ఖులుగా, అవివేకులుగా ప్రవర్తించాము. మా ఇంటి ఆడవాళ్ళకున్న ఇంగిత జ్ఞానం మాకు లేకపోయింది. మా ఆడవాళ్ళు నీ క్రతువులో భాగస్వాములవుతూ రొయ్యల కూరలతో మా కళ్ళు తెరిపించే ప్రయత్నం చేసారు. మాకు జ్ఞానోదయమైంది. మా తప్పు తెలుసుకున్నాము. సారవంతమైన పంట భూముల్ని కాపాడతాము. ప్రక్క ఊళ్ళకి కూడా వెళ్ళి రొయ్యల చెరువుల తవ్వకాలను నిషేధిస్తాము. నువ్వు తలపెట్టిన యజ్ఞానికి మేమూ సమిధులమవుతాము!" అన్నారు చేతులు పట్టుకుని ప్రాధేయపూర్వకంగా. రాజేష్, నాయుడుగారు ఆనందంతో పొంగిపోయారు వాళ్ళలో వచ్చిన పరివర్తనకి.

"అల్లుడూ! నేనూ నీ పక్షమే!" నవ్వుతూ ఉష చేతిని రాజేష్ చేతిలో పెట్టి ఆత్మీయంగా నిమిరాడు శంకరం. అందరూ ఆ దృశ్యాన్ని తిలకిస్తూ సంతృప్తిగా నవ్వుకున్నారు. ♦



# రాయలసీమ నవలల్లో సంఘసంస్కరణ

- ఇ. తిరుపతి
9491513811

**1872**లో నరహరి గోపాల కృష్ణమశెట్టి రాసిన "శ్రీరంగరాజ చరిత్ర", 1872లో కందుకూరి వీరేశలింగం పంతులు రాసిన "రాజశేఖర చరిత్ర" ఈ రెండు నవలలు తెలుగు నవలా సాహిత్యంలో ప్రారంభంగా సాహిత్య విమర్శకులు పేర్కొంటారు. అయితే పై ఇద్దరిలో ఎవరు మొదటివారు అనే అంశంపై ఎంతోమంది సాహితీవేత్తలు తమతమ అభిప్రాయాలను తెలియజేశారు. అయితే 2014లో యోగివేమన విశ్వవిద్యాలయంలో "రాయలసీమ నవల" అనే అంశంపై పరిశోధన చేసిన డా॥ పొదిలి నాగరాజు తన సిద్ధాంత గ్రంథంలో తెలుగు నవల ఎవరితో మొదలైంది అనే అంశంపై విస్తృతమైన చర్చ సాగించారు. తెలుగులో తొలినవల ఏది అనే అంశంపై కొత్తపల్లి వీరభద్రరావు (1956) నుండి వల్లంపాటి వెంకటసుబ్బయ్య (2006) వరకు దాదాపు 22 మంది సాహితీవిమర్శకుల అభిప్రాయాలను పరిశీలించారు. వారిలో నరహరి గోపాలకృష్ణమశెట్టిని తొలితెలుగు నవలా రచయితగా ఆమోదించారు. కందుకూరి వీరేశలింగం పంతులును తొలితెలుగు నవలా రచయితగా ఆమోదించనివారు ఉన్నారు. ఇరువురి అభిప్రాయాలను పరిశీలించిన డా॥ పొదిలి అంతిమంగా గోపాలకృష్ణమశెట్టినే తొలితెలుగు నవలా రచయితగా నిర్ధారించారు. ఈ అభిప్రాయంతో పోల్చితే తెలుగు నవలతోపాటు రాయలసీమ నవల కూడా 1872లో శ్రీరంగరాజచరిత్రతోనే ప్రారంభం అయ్యింది.

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో రాయలసీమ ప్రాంతం వెనకబడి ఉందనే అభిప్రాయాన్ని యోగివేమన విశ్వవిద్యాలయ విద్యార్థులు పూర్వపక్షం చేశారు. ప్రారంభం నుండి 1960 ప్రాంతంలో రాయలసీమ నవల సంఘసంస్కరణకు తనదైన కృషి చేసింది.

రాయలసీమ తొలినవలగానూ, తెలుగులో తొలినవల గానూ గుర్తింపు పొందిన శ్రీరంగరాజ చరిత్ర నవలలోనే సంఘసంస్కరణ దృక్పథంతో కథ సాగింది. గ్రామీణ జీవన చిత్రాన్ని చిత్రించడంతో పాటు ఆర్థిక అసమానతలను, వర్గ, వర్ణ వివక్షతను ధిక్కరిస్తూ లంబాడల అమ్మాయిని రాజు వివాహమాడడం 1872 ప్రాంతంలో అత్యంత గొప్ప సంస్కరణవంతమైన ఆలోచన. దీన్నిబట్టి తెలుగులో తొలినవలలో ఆరంభమైన సంస్కరణ దృక్పథం తదనంతరం పరంపరగా తెలుగులో అనేకమంది నవలాకారులు అందిపుచ్చుకున్నారు. ముఖ్యంగా డా॥పొదిలి అభిప్రాయం ప్రకారం తొలితెలుగు నవలా రచయిత అయిన గోపాలకృష్ణమశెట్టి సీమలోని అనేకమంది నవలా రచయితలకు ప్రేరణగా నిలుస్తున్నాడు. 1872 నుండి ఎంతోమంది నవలా రచయితలు తమ రచనలలో సంఘసంస్కరణ భావాలను బలంగా ప్రతిఫలింపజేశారు. అలాగే 1908లో దేవమణి సత్సనాథన్ రాసిన "లలిత" నవలలోనూ స్త్రీల సమస్యలను, మద్యపానం, జూదం, చెడుసావాసాలు, చెడు ఆలోచనలు వంటివి ప్రాణహానికి దారితీస్తాయని చెప్తుంది. అలాగే స్త్రీలు చదువుకుంటే కలిగే ప్రయోజనాలు కూడా ఈ నవలలో వివరించడం జరిగింది.

అలాగే స్త్రీ విద్యను ప్రోత్సహించే ఇతివృత్తంతో అనంతగిరి సేర నార్యకవి 1915లో 'సుశీల' అనే నవలను రాశాడు. ఇలాంటివి 1950 వరకు దాదాపు మరో ఐదు

నవలలు వచ్చాయి. అవి సువర్ణకేసరీ కృష్ణసేన, రత్నాబాయి, భానుమతి, నీతిరత్నాకరము మొదలైన రాయలసీమ తొలితరం నవలలతో మిగిలిన తెలుగు ప్రాంతాలలో వచ్చే సంఘసంస్కరణ సాహిత్యానికి ఏమాత్రం తగ్గకుండా రాయలసీమ తొలితరం రచయితలు తమ బాధ్యతను నిర్వర్తించారు.

మలితరం రచయితలు కూడా తొలితరం నవలా రచయితలు అందించిన మార్గదర్శకత్వంతో ఆదర్శవంతమైన నవల రాయడం ప్రారంభించారు. 1951-1960 మధ్య రాయలసీమ నుండి మరో ఏడు నవలలు సంఘసంస్కరణ దృష్టితో వచ్చాయి. అవి

1) అనుబంధాలు - ఆర్.ఎస్.సుదర్శనం - 1956
2) కాత్యాయని - జనమంచి వేంకటసుబ్రహ్మణ్య శర్మ - 1957
3) భావం - అంతటి నరసింహం - 1958
4) లేడీ లెక్చరర్ స్వగతం - అంతటి నరసింహం - 1958
5) డా॥ విద్యాసాగర్ - బి.లక్ష్మణరావు - 1958
6) మళ్ళీ వసంతం - ఆర్.ఎస్.సుదర్శనం - 1960
7) బృందావనం - జీరెడ్డి బాల చిన్నారెడ్డి - 1960

కుటుంబ జీవితంలోని అనుబంధాల విలువల్ని తెలియజేసిన నవల "అనుబంధాలు". మనుషులు తమ ఆత్మీయులను విడిచి ఉండవచ్చు వారి మనసులు మాత్రం వారిని వదలి ఉండలేమని చెప్పే గొప్ప నీతి పాఠం ఇది. అసలు మన సంప్రదాయాలను, మన ఊరిని వదిలి బ్రతుకుదెరువు కోసం ఎక్కడికీ వెళ్ళనవసరం లేదని, చెప్తుంది ఇతివృత్తం. మొత్తంగా మానవుల మధ్య ముఖ్యంగా వయసు అంతరాలున్న వారు తమ భేదభావాలను మరచిపోయి బ్రతకాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తుంది నవల.

ఆర్.ఎస్.సుదర్శనం రాసిన "అనుబంధాలు" నవల నేటి యువతకు ఆదర్శవంతమైన సందేశాన్ని అందిస్తుంది. సమాజంలో కన్యాశుల్కం తర్వాత అంతకంటే ఎక్కువగా మానవ సంబంధాల ప్రతిబంధకంగా మారింది వరకట్నం. వరకట్నం అనే దురాచారం ఎన్నో కుటుంబాలను నిలువునా దహించి వేసింది. అబ్బాయి తరపు తల్లిదండ్రులు తమ బిడ్డకు ఎక్కువ కట్నం ఇచ్చే అమ్మాయితో పెళ్ళి చేయాలనుకుంటుంటారు. అమ్మాయి తరపువారు తమ విలువైన ఆస్థులను అమ్మి వరుడికి కట్నంగా సమర్పించి ఘనంగా పెళ్ళి చేస్తుంటారు. ఇక్కడ పెళ్ళి ఆనందదాయకమైన కార్యం అయినా ఒక కుటుంబంలో ఆనందం మరో కుటుంబంలో విషాదం నింపింది. అందుకు ప్రధాన కారణం వరకట్నం. ఇటువంటి అన్యాయమైన దురాచారాన్ని తిరస్కరించి, సమాజం వరకట్న రహిత సమాజం కావాలని ఆశించిన నవల "అనుబంధాలు".

గోపాలస్వామి తన కొడుకు వేదమూర్తికి పెళ్ళి చేయాలని అందుకు ప్రతిగా వచ్చే కట్నం వల్ల కుటుంబం అప్పులు తీర్చవచ్చని ఆలోచిస్తాడు. కానీ వేదమూర్తి చదువుకున్నవాడు, మంచి మనసున్నవాడు కావడం వల్ల వరకట్నం తీసుకుని పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడడు. దాంతో గోపాలస్వామి దిగులు చెంది చనిపోతాడు. తండ్రి మరణాంతరం వేదమూర్తి తాను పనిచేసే కళాశాలలో విమల అనే అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. కట్నం ఆశించకుండా జరిగిన ఈ పెళ్ళితో తనతోటి వారికి ఆదర్శవంతుడయ్యాడు. తర్వాత వేదమూర్తి, విమల కష్టపడి డబ్బు సంపాదించి గోపాలస్వామి చేసిన అప్పులను తీరుస్తారు. ఆ విధంగా తన తండ్రి కోరికను నెరవేర్చాడు.

నవల ఆద్యంతం ప్రగతిశీల భావాలతోనే నడుస్తుంది. పురోగమిస్తున్న సమాజానికి కావలసింది ప్రగతి నిరోధక భావాలు కాదని, అభ్యుదయ భావాలని అవి కూడా మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపేవిగా ఉండాలని చెప్తుంది నవల. వరకట్నం, కన్యాశుల్కం వంటి దురాచారాలను రూపుమాపడానికి చదువుకున్న నేటితరం యువత ముందుకు రావాలని పిలుపునిస్తుంది నవల. 1958 ప్రాంతంలో రాసిన ఈ నవల ఆనాటి కాలాన్నే గాక భవిష్యత్తు తరాన్ని కూడా వరకట్న రహిత వ్యక్తులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసింది.

1958 ప్రాంతంలో అంతటి నరసింహం రాసిన "భావం". "లేడి లెక్చరర్ స్వగతం" అనే రెండు నవలలోనూ సమాజంలో వింత పోకడలకు పోతున్న విచ్చలవిడితనాన్ని చిత్రించాయి. యవ్వనంలో ఉండే శారీరక వాంఛలను తీర్చుకునే క్రమంలో తరతమ భేదం మరచిపోయి చివరకు తల్లిని తెలియనితనంతో కామించి, అసలు విషయం తెలుసుకుని తనను తానే అసహ్యించుకునే మనస్తత్వాన్ని చిత్రించిన నవల భావం.

సరైన వయసులో పెళ్ళి చేసుకోకపోతే కలిగే నష్టాన్ని కళ్ళకు కట్టిన నవల 'లేడీ లెక్చరర్ స్వగతం'.

1960లో జీరెడ్డి బాలచెన్నారెడ్డి రాసిన నవల "బృందావనం" స్ఫూర్తిదాయకమైన సంఘసంస్కరణ కథా

## కవిత

# తీయని చెమట

- జాకీర్
8977159437

చెమటలో ఉడికిన పేగులు
ఇసుకను నింపుకుంటున్నాయి...
కాలం కక్కిన బంధం
ఆమె నుదిటిపై సూర్యుడు నిద్రపోతూ....

ఎప్పుడూ ఆమె కిటికీలోపలే
నిబంధనల దుప్పట్లు కప్పుకుంటూ...
చుక్కలు కనపడని ఆకాశం కోసం
చెట్టుపై నుండి కల ఎగిరిపోయింది...

ఇరవైఆరు సంవత్సరాల నుండి
గర్భవతిగానే ఉందామె...
నేను తొమ్మిది మాసాలు కడుపులో
ఇరవైఐదు సంవత్సరాలు అమ్మ
కనుపాపలో...

చీకటి దృశ్యాలు ఊపిరిలో
నరాలన్నీ కోసుకుంటూ తీరానికి
వెలుగు రేఖ వెక్కరిస్తూ...



పాదాలు లేని అస్తిత్వం గాలిలేని ప్రదేశానికి...

ఇప్పుడామె పేగులను వొత్తుకుంటోంది
చందమామ వేడిగా సూర్యుడు చల్లగా

ఇటు నుండి అటో అటు
నుండి ఇటో
గాయాలు పుడమిలోకి
ఇంకిపోవాల్సిందే...

వేడుకలో ఆమె ఉదయించింది
చీమలు ప్రవచిస్తున్నాయి...
దేగలు, గ్రద్దలు
వేదాలు, గ్రంథాలన్నీ
అంతరించాయి...
ఇప్పుడామె మహాగ్రంథం
అక్షరాలను విసురుతూ... ♦

---

ఇతివృత్తం. ముకుందరావు, కృష్ణారావు ఇరువురు ప్రాణస్నేహితులు. అయితే ఇద్దరి ఆలోచనలు మాత్రం పూర్తి విరుద్ధం. ముకుందరావు సంప్రదాయవాది. కృష్ణారావు అభ్యుదయ వాది. ముకుందరావు తన చెల్లెలు విజయను కృష్ణారావుకు ఇచ్చి పెళ్ళి చేయాలనుకుంటాడు. కానీ ఆ విషయం కృష్ణారావుకు తెలియదు. అందువల్ల కృష్ణారావు తన అభ్యుదయ భావాలకు అనుకూలంగా ఓరోజు 'నవ్యకళానికేతనం'లో నాటకం వేసిన ఓ వేశ్యను పెళ్ళి చేసుకుంటాడు. దాంతో ముకుందరావు ఆశలు అడియాశలయ్యాయి. తర్వాత వారి ఇరువురి మధ్యదూరం పెరిగింది. ఇది జరిగిన కొన్నాళ్ళకు ముకుందరావు చెల్లెలు 'విజయ' కూడా ఆదర్శమండలి అధ్యక్షుడైన జగన్మోహనరెడ్డిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటుంది. ఇటు మిత్రుడు, చెల్లెలు ఇద్దరూ తన అభిప్రాయాలకు వ్యతిరేకంగా పెళ్ళిళ్ళు చేసుకోవడంతో తన భావాలన్నీ అంతరించిపోయినట్లయ్యింది. ఛాందసభావాలపై అభ్యుదయ భావాలే విజయం సాధించాయనిపిస్తుంది.

రాయలసీమ నవల ప్రారంభం నుండి తనదైన వివిధ సామాజిక అంశాలను వస్తువులుగా స్వీకరించి సమాజాన్ని అభ్యుదయం వైపు పయనించేలా తనవంతు పాత్ర పోషించింది.

అవధానం, సంప్రదాయ సాహిత్యం ఎక్కువగా వచ్చిన రాయలసీమలో నవల వాటి అన్నింటికీ ఎదురు నిలిచింది. సమాజాన్ని చైతన్యపరచి, సాంఘిక విలువలవైపు పయనింపజేసే ప్రయత్నం బలంగా చేసింది. ఆర్థిక అసమానతలు, అంతరిస్తున్న మానవ సంబంధాలు, వరకట్నం వల్ల నిలువెల్లా దహించుకుపోతున్న ఆడపిల్లల కుటుంబాలు. శరీర కోరికలకు విపరీతంగా లొంగిపోయి జీవితాన్ని నాశనం చేసుకుంటున్న యవ్వనులు ఇలా ప్రతి సామాజిక సమస్యను ఇతివృత్తంగా స్వీకరించి అందుకు పరిష్కారం చూపింది రాయలసీమ నవల.

గొప్ప సంస్కరణవంతమైన నవలలు రాయలసీమ నుండి వచ్చాయి. తర్వాత కాలంలోనూ అదే ఒరవడి కొనసాగింది.

రాయలసీమ నవలా సాహిత్యం రాయలసీమకున్న సంప్రదాయ సాహిత్యమనే ముద్రను చెరిపివేసింది. తెలుగునేలలో రాయలసీమ నవల తనదైన ప్రత్యేకతను చాటుకుంది. ♦



# ఆ ఒక్క క్షణం

- మహీధర శేషారత్నం
9989018569

"అమ్మా!" అనబోయిన పెదాల్ని బలిష్ఠమైన చేతులు నొక్కేసాయి. పెదాలు పలకలేకబోయిన పదాల్ని కళ్ళు పలికాయి. అలా పలుకుతూనే నిలిచిపోయిన ఆ కళ్ళు నెలరోజులుగా సావిత్రిని వెంటాడుతూనే ఉన్నాయి.

రంగారావు మీద చెయ్యి వేసినప్పుడల్లా అమ్మా అని పిలిచే పాప ముఖం కళ్ళముందు కదలాడి తోసేస్తోంది.

"ఛీ! నీయవ్వ. చేసిందంతా చేసి ఈ యవ్వారం ఏందే!" అని రంగారావు విసుక్కుంటున్నాడు.

ఎవరికీ తెలియని ఈ రహస్యం మనసును గుచ్చి గుచ్చి చంపుతోంది. గదిలో ఏ మూలనుంచో పాప పెద్ద పెద్ద కళ్ళతో నోట్లో వేలేసుకుని చూస్తున్నట్లే ఉంది. పిలుస్తున్నట్లే ఉంది.

"ఏందే! పోయినోళ్ళతోపాటు మనమూ పోతామా ఏంది?" అని చుట్టుపక్కల వాళ్ళు ఓదారుస్తుంటే కడుపులో గడ్డపార దిగేసినట్టు వుంది. బండరాయి గుండెల మీద ఎత్తి పడేసినట్టు ఉంది. కక్కొచ్చి నట్టుంది.

ఏ సుఖంకోసం రంగారావుని దగ్గరకు రానిచ్చిందో ఆ సుఖం అంటే అసహ్యం వేస్తోంది. ఇంతకళ్ళు మూసుకుపోయి ఈ పని ఎలా చేసింది? రంగారావు నోరు నొక్కుతుంటే గింజుకుంటున్న ఆ లేత శరీరం చూసిన బేలచూపులు తనను తినేస్తున్నాయి.

చీకట్లో గోడవార కొంగు పరుచుకు పడుకున్న సావిత్రికి ఏదో మెత్తగా తగలినట్లైంది. ఎవరో తనను తాకినట్లైంది.

"పోరా! ముదనష్టపోడా! నా మతి పోగొట్టేవు కదరా!" ఖయ్యిన లేచింది.

"ఏంటే సావిత్రీ! నేను.. ఎవరనుకుంటున్నావు?" .... పక్కింటి పంకజాక్షి.

పంకజాక్షి సావిత్రి పక్కింట్లోనే ఉంటుంది. రంగారావుకీ, సావిత్రికీ మధ్య ఏదో ఉందనే విషయం, రంగారావు సావిత్రి ఇంటికి తరచూ వస్తూండే విషయం పంకజాక్షికి తెలుసు. కాని పంకజాక్షికి సావిత్రి జుట్టు వేలి ముడేసుకుని, మాసిన

చీరకట్టుకుని పిచ్చిదానిలా తిరుగుతూ ఉంటే కూతురు పోయిన దు:ఖమే అనుకుంది కాని అంతకంటే ఊహించలేదు.

"రా! ఈ చీకట్లో ఏం కూర్చుంటావు కాని మా ఇంటికి పోదాం కాసేపు"... బలవంతంగా రెక్కపట్టి లేపబోయింది.

"ఇప్పుడు రాలేనే పంకజం. కాసేపు పడుకోవాలి. నిద్దరొస్తోంది."

అతికినట్టు అబద్ధం ఆడేసింది.

పంకజం కాసేపు కూర్చుని ఆ ముచ్చటా, ఈ ముచ్చటా చెప్పి "ఏడుస్తూ కూర్చోమాకు. కష్టాలు మనుషులకు కాకపోతే మానులకొస్తాయా?" అంటూ వెళ్ళిపోయింది.

పంకజం వెళ్ళిపోయాక సావిత్రి వీధి తలుపేసి మళ్ళీ వచ్చి పడుకుంది.

పాడారిన కళ్ళకు నిద్ర రావటం లేదు. నిద్ర కాదు అసలు కళ్ళు మూయాలంటేనే భయమేస్తోంది. కళ్ళు మూసినా, తెరచినా పాపే కళ్ళ ముందు నిలుస్తోంది, పెద్ద పెద్ద కళ్ళతో ఆశ్చర్యంగా చూస్తూ.

"దీని పీక పిసికేస్తే పోయే! ఎవడికేం చెబుతుందో అని ఈ గుంటముండకి భయపడి చస్తున్నావ్!".. రోజూ విసుక్కునే రంగారావు మాటల్ని తనలోని భయం ఒప్పించింది.

సాధారణంగా మధ్యాహ్నం బళ్ళోనే భోంచేసే పాప అనుకోకుండా వచ్చిందొక రోజు. రంగారావు విలాసంగా కాలు మీద కాలు వేసుకు పడుకున్నాడు.

తలుపు వేసివుంటే దబదబ బాదింది. ఎవరో చూసి గుమ్మంలోంచే పంపెయ్యొచ్చనుకుంటూ తలుపుతీసింది.

రెండు వేళ్లు చూపుతూ తనని తోసుకుంటూ పరిగెత్తేది కాస్తా మంచం మీద రంగారావుని చూసి ఆశ్చర్యంగా ఆగిపోయింది.

"చుట్టాలొచ్చేరామ్మా!" అంది కళ్ళు తిప్పుతూ.

"ఊ!" అంది ఏం చెప్పాలో తెలియక.

"ఏమవుతారమ్మా!..." అంది.

"వెళ్ళి ఆ పని చూసుకురా!" తప్పించుకోవడానికి విసుక్కుంది.

వెళ్ళొచ్చిన పాప మళ్ళా "ఏమని పిలవాలమ్మా!" అంది

"చిన్నాన్న!" చిన్నగా అంది.

అప్పుడే లేచి అక్కడికొచ్చిన రంగారావు "చిన్నాన్నా! లేదు, చింతకాయా లేదు. పో! పోయి ఆడుకో" అని విసుక్కున్నాడు. పాప ముఖం చిన్నబుచ్చుకొని వెళ్ళిపోయింది.

"ఎందుకట్టా కసురుతావు"! తానూ చిన్నబుచ్చుకుంది. ఎంతయినా అది తన కన్నబిడ్డ. మనసు చివుక్కుమంది.

"లేకపోతే రేపెక్కడైనా కనపడి చిన్నాన్న, చిన్నాన్న అని వెంటపడితే .." నీకూ బుద్ధి లేదన్నట్టు చూసాడు.

ఎంత జాగ్రత్త పడ్డా పాప చూపుల్లో పడకుండా తప్పించుకోలేకపోయారు. రెండు మూడు సార్లు ఇలా జరిగితే ఊరు మాటు మణిగేక రాసాగాడు. అయినా తనకి బెదురుగానే ఉండేది.

నిద్రకి మాత్రలు తెస్తా! అరబిళ్ళ నీళ్ళల్లోనో, పాలల్లోనో కలిపి తాగించెయ్యమన్నాడు. ధైర్యం చెయ్యలేకపోయింది. తన ఖర్మకాలి పాప పాసుకి లేచి అప్పుడూ చూసింది. ఒక తప్పును కప్పిపుచ్చడానికి ఎన్ని తప్పులు చెయ్యాలో! పాప పోయాక తనకెంత భయం వేసింది. ఒంటరిగా పాప శవాన్ని ముందు బెట్టుకుని..

ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక భయంభయంగా దిగులుగా అల్లాడి పోయింది. తానిక్కడుంటే అల్లరవుతుందని అన్నీ సర్దేసి రంగారావు జారుకున్నాడు.

ఒంటరితనం.. నేరం.. భయం .. పోయిందనే దిగులు కంటే దాన్ని ఎలా కప్పివుంచాలో తెలియక అల్లాడి పోయింది.

పురుగుముట్టిందనడానికి ఆ గుర్తులే లేవు. చివరకు ఒంటేలుకని లేచి నిద్రకళ్ళతో తూలి గడప మీద పడిందనీ, తగలరాని చోటేదో దెబ్బతగిలి ప్రాణం పోయిందని చెప్పింది.

చుట్టుపక్కల వాళ్ళు నమ్మారో, లేదో తెలియదు కాని ఏం మాట్లాడలేదు.

పంకజం మాత్రం "దెబ్బ ఎక్కడా కనపడ్డం లేదు!" అంది.

మంచి గౌను వేసి గుంటలేసి గుప్పెడు మన్నేసింది. ఖర్చులు పెట్టుకోవాల్సివస్తుందేమోనని తండ్రి కూడా నిలబడలేదు. అయిందనిపించి తండ్రీ, సవత్తల్లీ వెళ్ళిపోయారు.

లోకానికి నిజం కప్పెట్టేసింది. కాని తన మనసు మాత్రం వదలటం లేదు. నిద్రా, మెలకువా కాని స్థితిలో సావిత్రి అలాగే పడివుంది చాలాసేపు.

♦ ♦ ♦

"కూర్చో సాయిత్రీ! జుట్టు చిక్కు తీస్తా. ఎలా అట్టలు కట్టి పోయిందో!

బలవంతంగా సావిత్రిని కూర్చోబెట్టి తలదువ్వడం మొదలు పెట్టింది అంబుజం. అంబుజం సావిత్రికి మేనత్తే కాదు అత్తకూడాను. ఆ కొడుకు తాగుబోతు, తిరుగుబోతు తాగి

బండినడుపుతూ యాక్సిడెంట్లో పోయాడు. నా కొడుకే పోయాక నాకేం పని వీళ్ళతో అని గమ్మునుంది. ఒంట్లో ఓపిక అణిగేక సావిత్రి గుర్తుకొచ్చింది. ఎలా చేరదియ్యాలా అని ఆలోచిస్తుంటే పాప పోవడంతో పరామర్శకి వచ్చింది.

"నాతో రాయే సావిత్రీ! మనింటికెళ్ళి పోదారి!"

సావిత్రి పెదాల మీద చిత్రమైన నవ్వు తొంగిచూసింది.

'మనిల్లు' ఈ మనిషి తననూ తన కూతురినీ చేరదీస్తే ఇలా జరిగేది కాదు కదా! అనిపించిందొక క్షణం.

"లేదులే అత్తా! నేనేడకీ రాను"! అత్త చేతిలో జుట్టు విసురుగా లాక్కుంది.

అంబుజానికి మండింది. తెగనిక్కు పోతోంది అనుకుంది మనసులోనూ.

"నీ ఇష్టం. నే చెప్పేది చెప్పా" అంది నిష్ఠురంగా.

''ఏమత్తా!'' సావిత్రి ఇప్పుడు యాదికొచ్చింది. చంటిదానితో ఒక్కతే కష్టపడుతూంటే గమ్మునుండావు.."

ఎప్పుడొచ్చిందో పంకజం నవ్వుతూనే చురకేసింది.

ఈ పంకజం ఒకర్తి. ఎప్పుడూ ఈడే ఈడిగలబడతాది... మనసులోనే గుంజుకుంది అంబుజం.

"అలా అంటే నేనేం జెప్పేది. నాకాడేమన్నా డబ్బు మూలుగుతోందా? నా బాదలు నాకున్నాయి.." నిష్ఠురంగా అంది అంబుజం.

"సావిత్రీ పనిచేస్తూనే ఉంది కదా! కూలీనాలీ చేసి దాని బతుకది బతుకుతుండాది. ఏనాడైనా నీ కొడుకు కూడు పెట్టాడా దానికి?"... పంకజం వదల్లేదు

"ఏమో! మొగుడూ, పెళ్ళాల యవ్వారాలు నాకేం తెలుసు... ఏం జేసుకున్నారో!... ఏం తిన్నారో..!

మూతి తిప్పుకుంటూ లేచింది అంబుజం.

"నే పోతుండా!" విసవిసా వెళ్ళిపోయింది.

ఈ లంపటం పెట్టుకోకు సావిత్రీ! నీ మీద ప్రేమేం కాదు. ముదివయసు. కాలు, చెయ్యీ నొచ్చితే చూసే దిక్కులేదని..

పంకజం మాటలకు బదుల్వివలేదు సావిత్రి. పంకజం ఆ మాట ఈ మాట చెబుతూనే చారెడు బియ్యం ఉడకేసింది. పంకజం వెళ్ళిపోయినా సావిత్రి కూర్చున్న చోటునుండి లేవలేదు. బయటికి కనపడని నిప్పు గుండెల్లో మూటకట్టి ఉంది. ఎవరో చెబుతూంటే వింది. 'సముద్రంలో నిప్పు ఉంటుందట. అంతులేని చల్లని నీళ్ళలో భగ్గున మండే మంటలు. ఆ మంటల్ని ఈ నీరు ఆర్పలేదు. తనలో మండే మంటలు ఎవరికీ కనపడవు. అనుకుంటాంగాని మనసును మాయజేయడం మహాకష్టం.

♦ ♦ ♦

అమా! అమ్మా!.. చెవుల్లో పాప పదే పదే పిలుస్తోంది.

నేనేం తప్పు చేసానమ్మా! అని నిలదీస్తోంది. అమ్మా! నాకు పండక్కి కొత్త గౌను కొనవూ!.. అని మారాం చేస్తోంది. చామనచాయగా, బక్కగా వున్నా ముద్ద నందివర్ధనాల్లాంటి తెల్లటి పెద్ద పెద్ద కళ్ళు.

ఆ కళ్ళే కదూ తనని భయపెట్టాయి. ఐదేళ్ళ పాప రంగారావునీ, తననీ రహస్యంగా చూస్తున్నట్లే ఉండడంతో ఏదో తెలియని మైకంలో రంగారావు ఒళ్ళు తెలియని కోపంతో పాప పీక నొక్కుతూంటే నిస్తేజంగా నిలుచుండిపోయింది.

ఆ మూలే.. సరిగ్గా ఆ గోడమూలే పాపనుంచుని తననూ, తన ఒళ్ళో పడుకున్న రంగారావుని చూస్తుంటే తాను రంగారావు మాటల మీద సరిగ్గా దృష్టి పెట్టలేకపోయింది. అప్పుడే కదూ రంగారావు చిర్రెత్తుక వచ్చి "ఏందే! గుడ్లగూబ మొహందానా! అలా మిడిగుడ్లేసుకు చూస్తున్నావు. గుడ్లు పీకేస్తాను" అంటూ మీద మీద కెళ్ళి అరిచాడు. అంతే పాప బావురుమంది. చటుక్కున నోరు నొక్కేసాడు.

అమ్మా! అనబోయిన లేత పెదవులు మరి తెరవకుండా నొక్కేసాడు. ముక్కుతో సహా! తన కళ్ళముందే కూతురుపోయింది. రంగారావు అరచేయంత లేని తన కూతురు లేత మొహం ఆ అరచేతికి లొంగిపోయింది.

విడిపించాలని కూడా తోచక మొద్దులా నిలబడిపోయింది. ఒక్కక్షణం తన బుర్రపనిచేస్తే పాపని తీసుకు వేరే ఏదో ఎవరూ తెలియని ఊరు పోయేది. ఎక్కడయినా తన కష్టం తాను చేసుకోవలసిందే... ఆ ఒక్క క్షణం.. తన బుర్ర పనిచేస్తే తన కూతురు దక్కేది. తనకీ చిత్రవధ తప్పేది.

రంగారావు మోజులో తేలికగా కనిపించిన తప్పు కొండలా పెరిగిపోయి గుండెల్ని అణిచేస్తోంది. మెడపై చేతులేసి వీపు మీద ఊగుతున్నట్టూ, నా పుస్తకాలు చూడమ్మా అంటూ బళ్ళో ఇచ్చిన పుస్తకం, పంతులమ్మ రాసిచ్చిన అక్షరాలు గొప్పగా చూపిస్తున్నట్లే ఉంది.

అమ్మా! నాకు ఎర్రరిబ్బన్లు కొనిపెట్టవా? అని ఏడ్చి కొనిపించుకున్న ఆ రిబ్బన్లు రంగు మాయకుండానే నేలపై పడి దొర్లుతున్నాయి.

తానేం చూసింది? తన కళ్ళెలా మూసుకుపోయాయి? ఏం పొందింది? ఏం పోగొట్టుకుంది.

అంతర్ముఖంగా గోడవార పడి వున్న సావిత్రి ఎవరో తట్టి లేపుతున్నట్టయి కళ్ళు తెరిచింది... రంగారావు.. ఇదేందే సావిత్రీ! ఇట్టా అయిపోతున్నావు? మనం మాత్రం అనుకున్నామా? ఇలా అవుతుందని.. అనుకోకుండా అలా జరిగిపోయింది..

ఆకుకి అందకుండా పోకకి పొందకుండా పెదవి జారకుండా అలా.. ఇలా.. అనే అంటున్నాడు. సావిత్రి లేచి కూర్చుంది. మోకాళ్ళ మీద తలెట్టుకుని కళ్ళు మూసుకుకూర్చుంది.

"నా మాటిను. మర్చిపో! అదీపాటికి యాడో పుట్టే ఉంటుంది"... తెచ్చికోలునవ్వు.

సావిత్రికి మండింది. అమ్మోరిలా చూసింది.

రంగారావుకి చిర్రెత్తుకొచ్చింది. తానొక్కడే తప్పు చేసినట్టు ఏందాచూపు? ఇది కాకపోతే మరో ఆడదే దొరకదా! లోకం గొడ్డోయిందా?

మనసులో విసుక్కున్నాడు. దీనితో జాగ్రత్తగా ఉండాలి. ఇది నోరు విప్పకుండా చూడాలి. నోరిప్పితే తన పని ఔట్.

మీద చెయ్యేసి మెల్లిగా ఓదార్పుగా వీపు రుద్దుతున్నాడు.

మెల్లిగానే రంగారావు చెయ్యి తప్పించింది.

"నువ్వేం భయపడమాకు. నీ పేరెవరకీ చెప్పనులే. వెళ్ళిపో! ఎప్పుడూ రామాకు.." చిన్నగా అయినా సూటిగా చెప్పింది.

ఏమిటో ఈ ఆడాళ్ళు అర్థంకారు. మనసులోనే అనుకుంటూ మౌనంగా వెళ్ళిపోయాడు.

మెల్లిగా లేచి రేకు పెట్టె తెరచి ఎదురుగా కూర్చుంది. కూతురు గౌన్లు ముఖానికి అద్దుకుంది. ఏముంటాయి అందులో, కూతురు మురిపెంగా దాచుకున్న బొమ్మలు.. విరిగిపోయినవి, మాసిపోయినవి.. చిన్న పెన్సిలు ముక్క.. చిరిగిపోయిన బొమ్మల పుస్తకం.. కొత్తగా చూస్తున్నట్టు చూస్తోంది. తానీ మధ్య కూతుర్ని పట్టించుకోలేదు. తన లోకంలో తాను ఉంది. పిచ్చిపిల్ల.. అర్థంకాకపోయినా అమ్మలో మార్పు వచ్చిందని గ్రహించింది. అదే దాని కళ్ళలో కనిపించి తనని భయపెట్టేది. మొగుణ్ణుంచి ఏనాడూ ముద్దుమురిపాలకి నోచుకోని తాను నాలుగు మంచి మాటలకు లొంగిపోయింది. తల్లిపోయాక తండ్రి మారు మనువు చేసుకొని తన గురించి ఏమాత్రం ఆలోచించకుండా అత్త కొడుక్కి ముడెట్టేసాడు. అతగాడు పోతే తనకు మళ్ళీ మనువు చెయ్యాలని కూడా అనుకోలేదు. పిల్లముందుందిగా! ఏదో పనిచేసుకుంటూ దానితోపాటు అదే బతుకుద్దిలే అనుకున్నాడు. ఏభై యేళ్ళ వయసులో ఆయనకు పెళ్ళి కావలిసి వచ్చింది గాని పాతికేళ్ళయినా లేని తాను మనిషని ఆయననుకోలేదు. పెళ్ళిచేస్తే పసిదాన్ని తాను పోషించాల్సి వస్తుందని భయపడ్డాడు. పెట్టె ముందేసుకుని అలాగే కూర్చుంది సావిత్రి. ఇంత బాధ పడాల్సి వస్తుందనుకుంటే అసలా తప్పు చేసుండేది కాదేమో.

కూతురు మంచి గౌన్లు నాలుగు ఏరి పక్కనెట్టింది. దాని బొమ్మలు వాటిపై పెట్టింది. బడివిడిచే వేళకి బడి దగ్గరకు వెళ్ళి దూరంగా నుల్చుంది. అదిగో .. ఆ పిల్లే మేరియో, మెర్సీయో.. ఏదో ఉందా పిల్లపేరు. రెండు మూడు సార్లు పాపతో కల్సి ఇంటికొచ్చింది. 'నా ఫ్రెండమ్మా!'' అంటూ పాప సంతోషంగా చెప్పింది. దగ్గరకెళ్లింది. పాప చెయ్యి పట్టుకొని "మా ఇంటికొస్తావా?" అంది. ఆ పిల్ల బుద్ధిగా బుర్రూపింది. వెళ్తూ వెళ్తూ బిస్కెట్టు పాకెట్టు కొంది.

మంచినీళ్ళు పట్టుకొచ్చి పాకెట్టు విప్పి ఇచ్చింది. "కావల్సినవి తిను. మిగిలినవి దాచుకో" అంది. పాప నిజంగానా అన్నట్టు చూసింది.

సావిత్రి నవ్వింది చాన్నాళ్ళకు. పాప నవ్వింది పొందికగా తిని నీళ్ళు తాగింది. మూతి తుడుచుకుంది.

'నీకీ గౌను వెయ్యనా?' అంది ఒక మంచి గౌను చూపించి.

'ఊ!' అంది. మెల్లిగా గౌను వేసింది. దగ్గరకు తీసుకు ముద్దెట్టుకుంది. పాప గట్టిగా బుగ్గతుడిచేసుకుంది. సావిత్రి మనసు చివుక్కుమంది. అదే తన పాపయితే 'ఇటమ్మా! ఇంకోటి! అంటూ రెండో బుగ్గ చూపించేది. ఏమనుకొని ఏం లాభం? నిగ్రహించుకోలేని ఆ ఒక్క క్షణం తననూ, తన పాపనూ బుగ్గి పాల్చేసింది..

తనకు మాత్రమే తెలిసిన ఈ రహస్యం తనను తగలబెట్టేస్తోంది. ఈనిన బర్రె కూడా దూడను తీసుకెడుతూంటే ఆ స్థితిలో కూడా అరుస్తూ వెంట పడుతుంది దూడమీద ప్రేమతో. తాను మనిషి.. తానేం చేసింది?

సావిత్రి అలా ఎంతో సేపు కూర్చుండిపోయింది. మర్నాడు ఆ ఊరి చెరువులో సావిత్రి శవం తేలింది. ♦

# స్వీకారం

## అక్రమ సంతానం




మరాఠీ మూలం: **శరణకుమార్ లింబాళె**

తెలుగు: **రంగనాథ రామచంద్రరావు**

వెల :60/- పేజీలు: 128

ప్రతులకు : 9440705955

అక్కర్‌మాశి రాయటానికి పూర్వం నేను దాదాపు అన్ని దళిత ఆత్మకథలను చదివాను. మరాఠీలో ప్రచురింపబడిన ఇతర ఆత్మకథలనూ చదివాను. వీటన్నిటిలోనూ వ్యక్తమైన జీవితం కంటే నా జీవితం భిన్నమైంది. వాటిని చదివాక నాకు ఆ నమ్మకం కలిగింది. ఈ విభిన్నతే నన్ను ఆత్మకథ రాయటానికి ప్రేరేపించింది.

**- శరణ్‌కుమార్ లింబాళె**

## పుట్టెడు నానీలు




**పుట్టి గిరిధర్**

వెల : 50/- పేజీలు: 63

ప్రతులకు: 9494962080

గిరిధర్ నానీల్లో లోకవృత్త పరిశీలనం, సామాజిక చైతన్యం, ఊహాశాలిత, నాస్టాల్జియా, శైలీనైగనిగ్యం ఇలా ఉత్తమ కవిత్వానికి ఉండవలసిన ద్రవ్యాలన్నీ ఉన్నాయి. ముఖ్యంగా భావావేశం.

**- ఆచార్య ఎన్. గోపి**

## కళలు - సాహిత్యంపై మార్క్స్, ఎంగెల్స్‌ల భావనలు




పుస్తకానికి బి.క్రెలోవ్ రాసిన ముందుమాట అనువాదం

తెలుగు: **కొత్తపల్లి రవిబాబు**

వెల : 5/- పేజీలు: 24

ప్రతులకు: 9490196890

సమాజంలో సాహిత్యమూ, కళల స్థానం గురించి కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్‌లు వివిధ సందర్భాలలో వెలిబుచ్చిన అభిప్రాయాలను, వారి సంపూర్ణ రచనల నుండి, లేఖల నుంచి ఎన్నికచేసి ఒకచోట చేర్చిన సంపుటి ఇది. ఈ అంశంపై శాస్త్రీయ కమ్యూనిజం యొక్క సంస్థాపకులు చెప్పినదంతా ఈ సంపుటిలో లేకపోయినప్పటికీ కళాత్మక సృష్టిపట్ల మార్క్స్, ఏంగెల్స్‌ల ముఖ్యమైన భావనలను ఈ సంపుటి పాఠకులకు అందిస్తుంది.

**- బి.క్రెలోవ్**

## మూడోకన్ను కవిత్వం




**చలపాక ప్రకాష్**

వెల : 100/- పేజీలు: 200

ప్రతులకు : 9247475975

'అబ్బా! ఏం రాసాడ్రా బాబూ'/అంటూ కొన్ని అక్షరాలు మెచ్చుకున్నాయి!/'నన్ను మలుచుకోలేదేం' అంటూ మరికొన్ని అక్షరాలు/కుళ్ళుకున్నాయి!!/కొన్ని - / కవిత్వంలో తడిసి ముద్దై/ పుష్కరాలు జరుపుకున్నాయ్! /కొన్ని / నిష్ప్రయోజనంగా పరుగెత్తే రోజుల్లాగ.../తరువాత చటుక్కున తిప్పేసే పుటల్లాగ.../వెందదున్నా గుర్తుంచుకోలేని వ్యర్థంలాగ..!!?/ ఆవిరైపోయాయ్!!

**- చలపాక ప్రకాష్**

## బాలకాండ దీర్ఘకవిత




**ఒక ప్రేమానురాగానుబంధాల కవిత**

**భగ్వాన్**

వెల : 10/- పేజీలు: 16

ప్రతులకు: 9393533336

ఒకడు - రాలుగాయి/ఒకడు - గడుగ్గాయి/ఒకడు - టపాకాయి/ "మనుమలు మీకు ముగ్గురు/నాకైతే నలుగురు" అందావిడ/అర్థంకాని ముఖంతో ఆవిడను చూసాను/ ఆకాశంలో మొలిచి - ఏడుకొమ్మల బరువుతో/విల్లులా వంగిన చెట్టుమీంచి /వాన తుంపరల పూలు రాలుతున్నట్టు నవ్వి /అర్థమైందా లేదా అన్న/ప్రశ్న గుర్తు ముఖంతో నన్ను చూసింది..

**- భగ్వాన్**

## మన తెలంగాణ "సుధామ'యొక్తి




**కాలమ్ (కాలిక వార్తాంశ కథనాలు)**

**సుధామ**

వెల : 150/- పేజీలు: 187

ప్రతులకు: 9849297958

సమతుల్యత పాటిస్తూ సాగిన సమకాలీన వ్యాఖ్యాన సంహిత ఈ 'మన తెలంగాణ'. అనేక ఆశల మధ్య ఆకాంక్షలతో ఏర్పడిన నూతన రాష్ట్రంలో మాటలకూ చేతలకూ మధ్యన, అలాగే వాగ్దానాలకు, వాస్తవాలకు మధ్యన, ప్రశంసలూ విమర్శలను పరిగణనలోకి తీసుకుంటూ, అవసరమైన చోట సూటిగా, మరికొన్నిచోట్ల అన్యాపదేశంగా చెప్పాల్సింది చెబుతూ, వేయాల్సిన చురకలు వేస్తూ, సుధామయం చేశారు రచయిత.

**- తెలకపల్లి రవి**



*విజయవాడలో సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో సెప్టెంబర్ 9న జరిగిన టాల్‌స్టాయ్ పుస్తకాల ఆవిష్కరణ సభ. టాల్‌స్టాయ్ 190వ జన్మదినం సందర్భంగా జరిగిన ఈ సభలో టాల్‌స్టాయ్ రచనలపై సమాలోచన జరిగింది. ఈ సమాలోచనలో టాల్‌స్టాయ్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న తెలకపల్లి రవి, ఎన్. అంజయ్య, కొత్తపల్లి రవిబాబు, కె. ఉషారాణి, సి.ఎస్.ఆర్. ప్రసాద్, ఖాదర్‌మొహియుద్దీన్, జాన్సన్ చోరగుడి, మహమ్మద్ ఖదీర్‌బాబు, కె. లక్ష్మయ్య, కూనపురాజు కుమార్, మనోహర్ నాయుడు.*

## నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రారంభ సభ



సమాజ మార్పునకు కవులు, రచయితలు కృషి చేయాలని పలువురు సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు పేర్కొన్నారు. విజయవాడలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో సెప్టెంబర్ 9న నిర్వహించిన నవ్యాంధ్ర రచయితల సంఘం ఆవిర్భావ వేడుకల్లో వారు మాట్లాడారు. జి.లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ చేతికి మట్టి అంటకుండా పంట పండించడం ఎలా సాధ్యం కాదో.. ఎవరి మనసును నొప్పించకుండా, ఎవరో ఒకరి పక్షపాతం వహించకుండా మంచి సాహిత్యం రాదని అన్నారు. రెండు వర్గాలుగా చీలిపోయిన సమాజంలో కవులు పీడితుల పక్షాన ఉండాలని కోరారు. అలజడి, ఆందోళన నుంచి అక్షరాలు బయటకు రావాలని కవులకు ఆయన సూచించారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ.. నవ్యాంధ్ర రచయితల సంఘం నవ్యాంధ్రగా సాగాలని ఆకాంక్షించారు. ప్రగతిశీల భావజాలాన్ని, సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా సంఘం అడుగులు వేయాలన్నారు. అక్షరం ఆయుధంగా, ఆశయ కేతనంగా ముందుకు సాగాలని సూచించారు. ఆ సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్ పునాదులపై గొప్ప కవులను తయారు చేస్తామన్నారు. డాక్టర్ ఆర్.రంగారావు మాట్లాడుతూ కవిత్వం వ్యక్తీకరణలో ద ృష్టికోణంలో మార్పుతెచ్చే దిశగా కవులను తయారు చేయడంలోనే సంఘం గొప్పతనం ఉందన్నారు. ఎపిజెఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెవుల కృష్ణాంజనేయులు మాట్లాడుతూ కవులు తమ రచనల ద్వారా రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఎత్తి చూపాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ పీడిత ప్రజల పక్షాన నిలిచేందుకు ఈ సంఘం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు చంద్రశేఖర్ ఆజాద్, శ్రీరామ కవచం సాగర్, కె.శాంతారావు, ఎంవిజె.భువనేశ్వరరావు, చిన్ని నారాయణరావు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కవులు, రచయితలు పాల్గొన్నారు.

## 'జుమ్మా' కన్నడ అనువాదానికి పురస్కారం




'జుమ్మా' కథల సంపుటి



సృజన్



వేంపల్లి షరీఫ్

వేంపల్లి షరీఫ్ కథల సంపుటి 'జుమ్మా' కన్నడ అనువాదానికి కర్నాటక ప్రభుత్వం 'కన్నడ సాహిత్య పరిషత్ పురస్కారం' ప్రకటించింది. ఏటా కన్నడలోకి అనువాదమైన ఉత్తమ సాహిత్యానికి ఈ పురస్కారం ఇస్తారు. 2017 సంవత్సరానికి 'జుమ్మా'ను ఉత్తమ అనువాద కథా సంకలనంగా ఆ ప్రభుత్వం ప్రకటించింది. కడపజిల్లా వేంపల్లెకు చెందిన షరీఫ్ తాను రాసిన 12 కథలను 'జుమ్మా' పేరుతో సంకలనం చేశారు. 2011లో సూఫీ పబ్లికేషన్స్ తరపున ఈ పుస్తకం వెలువడింది. 2012లో ఈ పుస్తకానికి గాను కథకుడు వేంపల్లె షరీఫ్‌కు కేంద్రం 'సాహిత్య అకాడెమి యువ పురస్కారం' ప్రకటించింది. 'జుమ్మా' కథాసంకలనాన్ని ప్రముఖ కన్నడ రచయిత సృజన్ అనువాదం చేశారు. కర్నాటకలో ప్రతిష్టాత్మక ప్రచురణ సంస్థ 'నవ కర్నాటక పబ్లికేషన్స్'ఈ పుస్తకాన్ని అచ్చువేసింది. తెలుగులో ప్రముఖుల గుర్తింపు పొందిన ఈ పుస్తకానికి కన్నడలోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఆగస్టు 12, 2018న బెంగళూరులో కన్నడ సాహిత్య పరిషత్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ కవి ఎల్. హనుమంతయ్య చేతుల మీదుగా సృజన్ ఈ పురస్కారం అందుకున్నారు. ♦

## వైల్డ్‌వింగ్స్ ఆంగ్ల కవితా సంపుటి పరిచయ సభ



***విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో సెప్టెంబర్ 22న స్రష్టవాణి కొల్లి ఆంగ్ల కవితా సంపుటి పరిచయ సభలో మాట్లాడుతున్న యువ రచయిత ఆర్. ఇందు. చిత్రంలో శాంతిశ్రీ, బాలాంత్రపు ప్రసూన, కవయిత్రి స్రష్టవాణి కొల్లి.***

సమాజంలోని అనేక సంఘటనల ద్వారా ప్రభావితం అయిన కవి మనసులోని భావాలకు అక్షర రూపం 'వైల్డ్‌వింగ్స్' అని పలువురు వక్తలు అన్నారు. వర్ధమాన కవయిత్రి స్రష్టవాణి కొల్లి ఆంగ్ల కవితా సంపుటి పుస్తక పరిచయ సభలో వారు పాల్గొన్నారు. సాహితీస్రవంతి ఆధ్వర్యంలో విజయవాడలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో సెప్టెంబర్ 22న జరిగిన ఈ సభలో వి.ఆర్. సిద్ధార్థ కళాశాల ఆంగ్లాచార్యులు బాలాంత్రపు ప్రసూన మాట్లాడుతూ సృజనాత్మకమైన భావాలకు అక్షర రూపం ఇచ్చి పుస్తకంగా తీసుకురావటం అభినందనీయమన్నారు. మహిళలు, ఆకలి చావులు, రైతులు, ప్రకృతి, యువత వంటి అంశాలను తన కవిత్వంగా విభిన్నంగా వ్యక్తీకరించారన్నారు. తొలికవితా సంపుటి కావడంతో కొన్ని కవితల్లో సీనియర్ కవుల ప్రభావం కనపడుతుందని, కొత్తగా రాస్తున్న వారికి ఇది సహజమేనని అన్నారు. ముందు ముందు మరింత మంచి కవిత్వాన్ని రాసే శక్తి ఈ కవయిత్రికి ఉన్న విషయాన్ని ఈ తొలికవితా సంపుటిలో మనం గుర్తించవచ్చుని అన్నారు. యువ రచయిత్రి ఆర్. ఇందు కవితలను విశ్లేషిస్తూ అంతర్జాతీయ స్థాయి కవులు రాసిన రీతిలో కవితలు ఉన్నాయని అన్నారు. సెమినార్‌లో ఎదురైన సంఘటనలు కవితలుగా మార్చి అందంగా అమర్చారని తెలిపారు. ఆంగ్ల కవితలను చక్కగా చదివి విశ్లేషించారు. సభకు అధ్యక్షత వహించిన శాంతిశ్రీ మాట్లాడుతూ నేటి యువతలో సృజనాత్మక శక్తిని గుర్తించి ప్రోత్సహిస్తే స్రష్టవాణి వంటి వారు ముందుకొస్తారని అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే పిల్లలు వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించగలుగుతారని అన్నారు. కవయిత్రి స్రష్టవాణి స్పందిస్తూ చిన్నప్పటి నుండి తనకు ప్రత్యేక గుర్తింపు పొందాలనే కోరిక ఉండేదని అన్నారు. కవిత్వం రాయడం ద్వారా తనకు అనేక అనుభవాలు కలిగాయని అన్నారు. ఆకాశంలో తారలను చేరుకోవచ్చేమో కాని మనిషి అంతరంగాన్ని అర్థం చేసుకోవడం అంత సులువైన విషయం కాదని అన్నారు. తన మనసును ప్రభావితం చేసిన అనేక అంశాలను అక్షరాలుగా పేర్చి కవితలుగా రాశానని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండు నారాయణ, కొండపల్లి మాధవరావు, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ కె. ఉషారాణి, సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్, కవయిత్రి తండ్రి, జర్నలిస్టు అరవింద్, కవి అనిల్ డ్యాని తదితరులు పాల్గొన్నారు. ♦

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



# చిలుకూరి దేవపుత్ర 15.04.1951 - 18.10.2016

తరతరాలుగా కులవ్యవస్థకు బలైన పేద బతుకుల వెతల చిత్రాలను సాహిత్యం చేసిన శక్తివంతమైన రచయిత చిలుకూరి దేవపుత్ర. మన్నుతిన్న మనిషి కథ ప్రాచుర్యం పొందింది. పంచమం, అద్దంలో చందమామ, చీకటిపూలు, కక్షశిల వంటి నవలలు, ఆరుగ్లాసులు, ఏకాకినౌక చప్పుడు, బందీ వంటి కథా సంకలనాలు వెలువరించారు. రాయలసీమ మేటి కథకులలో ఒకరు.

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2017-19
Date of Posting : 1st &2nd of Every Month ▪ Date of Publication: 27.09.2018


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




వైద్యానికి సుస్తీ వైద్య నిపుణుల ఆవేదన
పేజీలు 184 రూ.150/-




జూలియస్ ఫ్యూజిక్ రక్తాక్షరాలు
పేజీలు 104 రూ. 75/-




ప్రపంచ సాహితీ వేత్తలు
ముక్తవరం పార్థసారథి
పేజీలు 176 రూ. 150/-




హ్యాపీ డేస్
సినీ ప్రముఖుల విద్యార్థి దశ ముచ్చట్లు
పేజీలు 224 రూ. 175/-




ప్రముఖుల జ్ఞాపకాలు
పేజీలు 224 రూ. 175/-




పేరులో ఏముంది?
ప్రాంతాలపై ధిక్కారం
విలక్షణ పేర్ల విశిష్ట కథనం
పేజీలు 192 రూ. 150/-




మార్కెట్ విప్లవలయంలో
మన గ్రామసీమలు
పేజీలు 384 రూ. 250/-




మహారాష్ట్రలో రైతుల మహా పాదయాత్ర
పేజీలు 64 రూ. 40/-




నేలకొరిగిన కోకిల
పేజీలు 320 రూ. 220/-




కటికపూలు
పేజీలు 134 రూ. 100/-




శ్రీశ్రీ సాహిత్యం ఆర్థిక రాజకీయ దృక్పథం
పేజీలు 160 రూ. 120/-




విశ్వనరుడు గుర్రం జాషువ
పేజీలు 128 రూ. 100/-




తెలుగు సినీ దర్శకమాలిక - విజయవీచిక
పేజీలు 360 రూ. 250/-




స్వేచ్ఛకు సంకెళ్లు
పేజీలు 104 రూ. 70/-

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533

**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059